# మంచిమాట

## పదుగురు మెచ్చేబాట




సంకలనం

## ఎ.ఎన్.జగన్నాథశర్మ

# మంచిమాట

## పదుగురు మెచ్చే బాట




సంకలనం:

ఎ.ఎన్.జగన్నాథశర్మ



**వైష్ణవి ప్రచురణలు**

**పటమట సెంటర్, విజయవాడ-520010**

# MANCHIMATA

*Editor:* ***A.N.Jagannadhasarma***

---

# **మంచిమాట**

సంకలనం: **ఎ.ఎన్.జగన్నాథశర్మ**

© రచయిత

ప్రథమ ముద్రణ:
**జనవరి 2015**

కవర్ & లే అవుట్ డిజైన్: **కె. రామకృష్ణ**

ప్రచురణ:
**వైష్ణవి ప్రచురణలు**
డోర్.నెం. 67-3-4, కొడాలివారి వీధి,
పటమట సెంటర్, విజయవాడ-520010
మొబైల్: **92913 55345**

ప్రతులకు:
**విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచీలు**
హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం, కడప
గుంటూరు, తిరుపతి, ఒంగోలు, హనుమకొండ, కాకినాడ, కరీంనగర్, శ్రీకాకుళం

ముద్రణ: **రెయిన్‌బో ప్రింట్‌ప్యాక్,** హైదరాబాద్
మొబైల్: **92462 71620**

వెల: **రూ. 25/-**

# మంచిమాట

శ్లో॥ *ధారణా ద్ధర్మ మిత్యాహుః, ధర్మో ధారయతి ప్రజాః,*
*యత్స్యా ద్ధారణసంయుక్తః, స ధర్మ ఇతి నిశ్చయః.*
ధరించేది కనుక ధర్మం అయింది. ధర్మమే ప్రజలను ధరిస్తూ ఉన్నది. ఏది సంఘాన్ని కట్టుబాటులో ఉంచుతున్నదో దానినే ధర్మం అని పెద్దలు నిశ్చయించారు.

శ్లో॥ *గీతే వాద్యే తథా నృత్యే సంగ్రామే రిపు సంకటే,*
*ఆహారే వ్యవహారేచ త్యక్తలజ్జః సుఖీభవేత్?.*
పాడేటప్పుడు, వీణను వాయించేటప్పుడు, నృత్యంలో, యుద్ధంలో, ఆహారవేళలో, వ్యవహారంలో సిగ్గునూ, మొగమాటాన్నీ విడిచినవాడే సుఖాన్ని పొందుతాడు.

శ్లో॥ *అష్టాదశపురాణానాం, సారం సారం సముద్ధృతం,*
*పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనమ్.*
పద్దెనిమిది పురాణాల సారాన్నీ పిండగా పిండగా పరోపకారం చేస్తే పుణ్యం అనీ, పరపీడన చేస్తే పాపం అనీ తేలింది.

శ్లో॥ *జిహ్వాగ్రే వర్తతే వ్యాధిః జిహ్వాగ్రే మిత్ర బాంధవాః,*
*జిహ్వాగ్రే బంధ సంప్రాప్తిః జిహ్వాగ్రే మరణం ధ్రువమ్.*
వ్యాధులు, మిత్రులు, బంధువులు, బంధనాలు, ఆఖరికి మరణం కూడా నాలుకను నిగ్రహించుకొనడం, నిగ్రహించు

కోలేకపోవడం మీదనే ఏర్పడుతున్నాయి. నాలుకను నిగ్రహించుకోవడం అత్యవసరం.

ప॥ *కులకాంత తోడ నెప్పుడు*
*గలహింపకు పట్టి తప్పు ఘటియింపకుమీ*
*కలకంఠి కంట కన్నీరు*
*ఒలికిన సిరియింట నుండ నొల్లదు సుమతీ!*

భార్యతో ఎప్పుడూ కలహం పెట్టుకోకూడదు. లేని నేరాన్ని ఆమె మీద ఆరోపించకూడదు. ఉత్తమ ఇల్లాలి కంటనీరు ఏ ఇంట పడితే ఆ ఇంట లక్ష్మీదేవి నిలువదంటాడు సుమతీశతక కర్త.

❖ అదృష్టం అడ్డం తిరిగితే పండుతిన్నా పన్ను విరుగుతుంది.

-పర్షియన్ సామెత

❖ పండితుడు అయిన వాడు అందని దాని కోసం అర్రులు చాచడు. పని చెడిపోతే బాధ పడడు. ఆపదలు వచ్చి మీద పడితే భయపడడు. మంచి చెడ్డలూ, కష్టసుఖాలూ, సాధ్యా సాధ్యాలూ, లాభనష్టాలూ బాగా విచారించిగాని ఏ పనీ ప్రారంభించడు. ప్రారంభించిన పనిని సగంలో విడిచి పెట్టడు. మనస్సును ఉరకలు వేయకుండా నిగ్రహించు కుంటాడు. కాలాన్ని వ్యర్థం చెయ్యడు. పెద్దలు హర్షించే పనినే చేస్తాడు. ప్రయోజనం లేని పనిని చెయ్యడుగాక చెయ్యడు. మిత్రుల అభ్యుదయం చూసి అసూయపడడు. తనకి

సన్మానం జరిగితే పొంగిపోడు. అవమానం జరిగితే కుంగి పోడు. గంగా ప్రవాహంలాగా కలత లేకుండా ఎప్పుడూ ఉంటాడు.

–విదురనీతి

❖ ఏమీ తెలియని వాడికి హాయిగా సులువుగా చెప్పొచ్చు. అంతా తెలిసిన వాడికి ఇంకెంతో తేలికగా చెప్పొచ్చు. తెలిసీ తెలియని వాడికి చెప్పడం బ్రహ్మశక్యం కాదు.

–భర్తృహరి

ప॥ *నగలు లేవటంచు వగజెందుటేగాని*
*నగలవల్ల లేని సొగసురాదు*
*మగువకేల నగలు? మనసిచ్చు మగడున్న*
*వాస్తవమ్ము నార్ల వారి మాట!*

నగలు లేవని స్త్రీలు దిగులు చెందుతారేగాని, నగల వల్ల లేని అందం వస్తుందా? రాదుగాక రాదు. మనసిచ్చే భర్త ఉండాలే గాని, నగలెందుకు? అంటారు నార్ల వెంకటేశ్వరరావుగారు.

శ్లో॥ *శ్వః కార్య మద్య కుర్వీత పూర్వాహ్ణేచాపరాహ్ణికమ్!*
*నహి ప్రతీక్షతే మృత్యుః కృతంచాస్య నచాకృతమ్!!*

రేపు చేయాల్సిన పనిని ఇప్పుడే చెయ్యాలి. మధ్యాహ్నం చేయాల్సిన పనిని ఉదయమే చెయ్యాలి. మనం పనులు ముగించామా, లేదా? అన్నది మృత్యువుకి అనవసరం. ఆగదది.

శ్లో॥ *సంపద స్వప్న సంకాశాః యౌవనం కుసుమోపహమ్!*
*విద్యుచ్చంచల మాయుష్యం తస్మాత్ జాగ్రత! జాగ్రత!!*

సంపదలు స్వప్నంలాంటివి. కలలా వచ్చి పోతాయవి. అశాశ్వతం. యౌవనం పువ్వులాంటిది. ఏ క్షణం ఎప్పుడు వాడిపోతుందో తెలియదు. వాడిపోక తప్పదు. ఆయుస్సు మెరుపుతీగలాంటిది. చంచలమయినది. ఇప్పుడో మరు క్షణమో ముగిసిపోతుంది. అందుకని అన్నింటా జాగ్రత వహించాలి.

❖ కుటుంబ క్షేమం కోసం ఏ ఒకరినయినా విడిచిపెట్టాలి. అవసరమయితే గ్రామం కోసం కుటుంబాన్నే విడిచిపెట్టాలి. దేశ క్షేమం కోసం గ్రామాన్ని విడిచిపెట్టినా తప్పు లేదు. తన బాగుకోసం భూమండలం అంతా విడిచిపెట్టేయొచ్చు. ఆపదల కోసం డబ్బుని జాగ్రత చేసుకోవాలి. ఆ డబ్బు కంటే భార్యని మరింత జాగ్రత చేసుకోవాలి. డబ్బు కంటే, భార్య కంటే కూడా తనని తాను జాగ్రతగా చూసుకోవాలి.

–విదురనీతి

❖ ఆత్మకు శరీరం లేదు. స్త్రీ అనీ పురుషుడనీ భేదం లేదు. ఏ పనీ దానికి అక్కరలేదు. ఆకలిదప్పికలూ, శోకమోహాలూ, జరామృత్యువులూ, ప్రియాప్రియాలూ, సుఖదుఃఖాలూ, శీతోష్ణాలూ...ఇలాంటి ద్వంద్వాలేవీ లేనిదది. ఇవన్నీ దేహానికే ఉంటాయి. ఇలాంటి దేహాన్ని తాను అనుకోవడం తప్పు. ఈ శరీరమే తాను అనుకున్నవాడు దొంగతో సమానం. పాపాత్ముడు కూడా. బ్రహ్మవేత్త పండితుడు, సంసారబంధంలో పడకూడదు. తానొక గొప్పవాడినన్నట్టుగా భ్రమించకూడదు. భ్రమించి, చెప్పుకుంటూ పూజలూ, సత్కారాలూ అందుకో

కూడదు. ఒకవేళ అందుకుంటే వారు కక్కిన కూడు తినే కుక్కతో సమానం.

–సనత్సుజాతుడు

❖ పుండు మానాలని వాత వేస్తే, వాత పుండు అయిందట.

–సామెత

❖ గతాన్ని ఆధారం చేసుకునే మనం జీవితాన్ని అర్థం చేసుకుంటాం. అయితే మనం జీవించాల్సింది మాత్రం భవిష్యత్తులోనే, అదే చిత్రం.

–కియర్కే గార్డ్

శ్లో॥ *నా౽ పృష్టః కస్యచి ద్బ్రూయాత్, న చా౽ న్యాయేన పృచ్ఛతః,*
*జానన్నపి చ మేధావీ, జడవ ల్లోక ఆచరేత్.*

అడగనిదే ఎవరికీ దేనినీ చెప్పకూడదు. అన్యాయంగా ప్రశ్నించినా సరే, జవాబు చెప్పకూడదు. బుద్ధిమంతుడు తెలిసినా తెలియనట్టే లోకంలో ప్రవర్తించాలి.

ప॥ *దేశసేవకన్న దేవతార్చన లేదు*
*స్వార్థ పరతకన్న చావులేదు*
*సానుభూతికన్న స్వర్గమ్ము లేదు*
*లలిత సుగుణజాల! తెలుగుబాల!*

–కరుణశ్రీ

దేశసేవను మించిన దేవతార్చనలేదు. దైవపూజ లేదు. స్వార్థబుద్ధి మరణం లాంటిది. ఇతరుల పట్ల దయా, సానుభూతీ చూపించడమే స్వర్గం.

❖ శాస్త్రాలు ఆమూలాగ్రం చదువుకుని ఆత్మజ్ఞానం సంపాదించుకోవాలి. ప్రారంభించిన పనిని పూర్తి చేయగలిగే సత్తా ఉండాలి. ఓర్పు ఉండాలి. ధర్మాధర్మాలు తెలిసి ఉండి, ధర్మంగానే నడుచుకోవాలి. చెడుపనులు చేయకూడదు. అన్నీ మంచిపనులే చెయ్యాలి. నాస్తికుడు కాకూడదు. అన్నిటి పట్లా శ్రద్ధ ఉండాలి. ఇలాంటి లక్షణాలు ఉన్నవారినే పండితులు అని అంటారు.

–విదురనీతి

శ్లో॥ *న స్నాన మాచరేత్ భుక్త్వా, నాతురో న మహానిశి,*
***న వాసోభి స్సహాజస్రం, నాజ్ఞాతే జలాశయే.***
భోజనం చేసిన తర్వాత స్నానం చేయకూడదు. అలాగే జ్వరంగా ఉన్నప్పుడూ, అర్థరాత్రి వేళల్లోనూ, కట్టుబట్టలతోనూ, పరిచయం లేని జలాశయాల్లోనూ స్నానం చెయ్యకూడదు.

❖ మొసలినోట ఉన్న మాణిక్యాన్ని సునాయసంగా తీసుకోవచ్చు. అల్లకల్లోలంగా ఉన్న సముద్రంలో చేతులు మడచి ఈదవచ్చు. పడగెత్తి కాటు వేసే తాచుపాముని కూడా నెత్తిన పెట్టుకోవచ్చు కాని, మొండిపట్టుబట్టి కూర్చున్న మూర్ఖుణ్ణి ఒప్పించడం ఎవరితరమూ కాదు.

–భర్తృహరి

❖ ఇతరులకు దైవత్వాన్ని ఆపాదించేందుకు మనం శ్రద్ధ వహిస్తామేగాని, మనల్ని మనం ఆ స్థాయికి చేర్చుకునేందుకు ఇష్టపడం.

–రోష్ ఫోకాల్డ్

శ్లో॥ *కాకః కృష్ణః, పికః కృష్ణః, కో భేదః పిక కాకయోః!*
*వసంతకాలే సంప్రాప్తే కాకః కాకః! పికః పికః!!*

కాకి నలుపు. కోకిల కూడా నలుపే! రెంటికీ భేదం లేదు. కాని, వసంతకాలం వచ్చిందంటే కాకి కాకే, కోకిల కోకిలే అని తెలిసిపోతుంది. అలాగే పండితునికీ, సామాన్యునికీ పెద్దభేదం తెలియదు. ఇద్దరూ ఒకేలా ఉంటారు. కాని, సమయం వస్తే ఎవరు పండితుడో, ఎవరు సామాన్యుడో తేలిపోతుంది.

❖ జీవితమే ఒక జూదం
ఖేదానికి మోదానికి లేదసలే భేదం.

–తిలక్

శ్లో॥ *ఏకైకా గౌస్త్రయ స్సింహాః, పంచ వ్యాఘ్రాః ప్రసూతిభిః,*
*అధర్మో నష్టసంతానో, ధర్మ స్సంతానవర్ధనః.*

గోవుకి ఒకటి, సింహానికి మూడు, పులికి అయిదు పిల్లలు పుడతాయి. కాని, లోకంలో గోసంతతే ఎక్కువ. అలాగే అధర్మం వంశనాశనానికీ, ధర్మం వంశాభివృద్ధికీ కారణం అవుతుందనేందుకు ఇంతకు మించిన నిదర్శనం లేదు.

❖ కర్మేంద్రియాలు అయిదూ, జ్ఞానేంద్రియాలు అయిదూ, మనస్సూ, బుద్ధీ అన్నీ పరమాత్ముని వల్లనే రక్షింపబడుతున్నాయి. ఇవన్నీ సంసారం మధువు అనుకుని అందులో మునిగి తేలుతూ ఉంటాయి. తేనెటీగలు ఓ పక్షంలో తేనెను కూడబెట్టుకుని, మరో పక్షంలో ఆరగిస్తాయి. అలాగే జీవుడు పూర్వజన్మలో చేసుకున్న పుణ్యపాపాలను ఈ జన్మలో

అనుభవిస్తున్నాడు. పరమాత్ముడు జీవుణ్ణి అలా అనుభవింప జేస్తున్నాడు. సనాతనుడుఅయిన ఆ భగవంతుణ్ణి యోగులు మాత్రమే దర్శించగలరు.

–సనత్సుజాతుడు

❖ రాజుకీ అగ్నికీ తేడా లేదు. రెండూ ఒకటే అనిపిస్తాయి. రాజుని అగ్నిలాగానే సేవకులు చూసుకోవాలి. అగ్నికి దగ్గరగా కూర్చోవడం అపాయకరం. ఆ వేడిమిని భరించడం కష్టం. బట్టలూ, శరీరం కాలినా కాలుతాయి. దూరంగా కూర్చుంటే ప్రయోజనం ఉండదు. అలాగే సేవకులు దగ్గరగా ఉంటే రాజుకి అనాదరణభావం కలగవచ్చు. దూరంగా ఉంటే వారున్నారు అన్నది జ్ఞాపకమే లేకపోవచ్చు. కనుక రాజుని ఆశ్రయించేవారు ఎప్పుడూ అతనికి దగ్గరగా ఉండకూడదు. దూరంగానూ ఉండకూడదు. అందీ అందనట్టుగా ఉండాలి. అలా జాగ్రత పడాలి.

–చాణుక్యుడు

*ప॥* చెప్పకు చేసిన మేలు నొ
*కప్పుడయిన గాని, దాని హర్షింపరుగా*
*గొప్పలు సెప్పిన అదియును*
*తప్పేయని చిత్తమందు తలపు కుమారీ!*

మేలు చేసి దాని గురించి గొప్పగా చెప్పుకోవడం మంచిది కాదు. వినేవాళ్ళు దానిని సహించరు సరికదా, బడాయి అని ఈసడిస్తారు. చేసిన పని గురించి గొప్పలు కూడా చెప్ప

కూడదు. చెబితే డబ్బా కొట్టుకుంటున్నాడని అంతా తప్పు పడతారు.

శ్లో॥ ***కుగ్రామవాసో కుజనస్య సేవా, కుభోజనం క్రోధముఖీ చ భార్యా, మూర్ఖశ్చ పుత్రో విధవా చ కన్యా, వినాగ్నినా సందహతే శరీరమ్.***
కుగ్రామంలో నివాసం, దుష్టుణ్ణి సేవించడం, పాచి అన్నాన్ని భుజించడం, కోపిష్ఠి భార్యతో కాపురం చేయడం, మూర్ఖుడయిన కొడుకునీ, విధవ కూతురునీ కలిగి ఉండడం... ఇవన్నీ నిప్పులేకుండానే శరీరాన్ని దహించేస్తాయి.

శ్లో॥ ***యావజ్జీవం సుఖం జీవేత్, ఋణం కృత్వా ఘృతం పిబేత్, భస్మీభూతస్య దేహస్య, పున రాగమనం కుతః***

–చార్వాకం

బతికినన్నాళ్ళూ సుఖంగా బతకాలి. అప్పు చేసయినా సరే హాయిగా నేతితో భోజనం చెయ్యాలి. శరీరం ఉన్నంత వరకే, చనిపోయాక అది మట్టిలో కలసిపోతుంది, మళ్ళీ రాదని తెలుసుకోవాలి.

❖ వెనుకా ముందుల కలయికే వర్తమానం.

–*శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి*

❖ గతమంతా తోలుబొమ్మలాడిన తెర
వర్తమానం నీ కన్నుల కప్పిన పొర

–*బాలగంగాధర తిలక్*

శ్లో॥ *భ్రాతృహంతా పితృహంతా మాతృహంతా చయఃపుమాన్! త్రయేతేచ మహాభక్తాః ఏతేషాంచ నమామ్యహమ్!*

అన్నను చంపించిన విభీషణుడూ, తండ్రిని చంపించిన ప్రహ్లాదుడూ, తల్లిని చంపిన పరశురాముడూ మహాభక్తులట! వారికి ఓ నమస్కారం అన్నది ఇందులోని చమత్కారం.

ప॥ *కామిగానివాడు కవిగాడు రవిగాడు*
*కామిగాక మోక్షకామి గాడు*
*కామియైనవాడు కవియగు రవియగు*
*విశ్వదాభిరామ వినురవేమ!*

బలమయిన కోరిక ఉన్నవాడే కవి అవుతాడు. జీవితంలో కాంతివంతుడవుతాడు. బలమయిన కోరికలేనివాడు మోక్షాన్ని మాత్రం ఏం కోరుకుంటాడు? ఏం సాధిస్తాడు?

❖ నీళ్ళతో నిప్పు ఆర్పగలం. గొడుగుతో ఎండను ఆపుకోగలం. పోతరించిన ఏనుగును అంకుశంతో లొంగదీసుకోగలం. కఱ్ఱతో ఎడ్లనూ, గాడిదలనూ మళ్ళించగలం. ఔషధాలతో రోగాలను నయం చేసుకోగలం. మంత్రాలతో విషాన్ని కూడా విరుచుకోగలం. దేనికయినా మందు ఉంది గాని, మూర్ఖునికే ఏ మందూ లేదు.

–*భర్తృహరి*

❖ సుఖానికి మూలం ధర్మం. సుఖం అంటే కష్టం లేకపోవడం. దుఃఖం లేకపోవడం. ఆనందం కలగడం. ఈ సుఖం ధర్మం వల్లనే కలుగుతుంది. ధర్మంగా నడుచుకుంటేనే కలుగుతుంది. అధర్మంగా నడుచుకోకపోతేనే కలుగుతుంది. ధర్మాన్ని గురించి వేదం చెబుతుంది. వేదం చెప్పినట్టుగా నడుచుకోవడమే ధర్మంగా నడుచుకోవడం. ఎవరికి తోచినట్టుగా

వారు నడిస్తే ఘర్షణ ఏర్పడుతుంది. ఈ ఘర్షణ దుఃఖాలకు మూలమవుతుంది. జనానికి మంచిమార్గం చూపించేది ధర్మమే! కాబట్టి ధర్మమే సుఖాన్ని కలిగిస్తుంది.

–చాణక్యుడు

శ్లో॥ *సంగీతంచైవ సాహిత్యం సరస్వత్యాః కుచద్వయం!*
*ఏక మాపాత మధురం పరం త్వాలోచనామృతం!*
సంగీత సాహిత్యాలు రెండూ సరస్వతీమాత పాలిండ్లు. సంగీతాన్ని విన్నంతసేపు మాత్రమే ఆనందం కలుగుతుంది. సాహిత్యం అలాకాదు, ఆలోచించిన కొలదీ అందులో ఆనందాలు ఊరుతాయి.

❖ పుచ్చుకున్నప్పుడు పుత్రుడు పుట్టినంత సంతోషం కలుగుతుంది. ఇచ్చేటప్పుడు ఇంటాయన పోయినంత దుఃఖం కలుగుతుంది, అదేం చిత్రమో!

–సామెత

❖ పెట్రోలుకి నిప్పు అంటించినట్టు జనానికి భయం అంటుకుం దంటే భగ్గున మండి అందర్నీ చుట్టబెడుతుంది. కానీ ధైర్యం అలాకాదు, అది చాలా కాలం రాజుకుని రాజుకుని ప్రజ్వరిల్లు తుంది.

–రావిశాస్త్రి

శ్లో॥ *మౌఖర్యం లాఘవకరం మౌనమున్నతికారకం!*
*ముఖరం నూపురం పాదౌ కంఠేహార విరాజితే!*
వ్యక్తి అల్పత్వాన్నిగానీ, ఔన్నత్యాన్నిగానీ పలుకే సూచి స్తుంది. ఉన్నతిని సూచించేది మౌనమనుకుంటే, లేదంటే

సున్నితమయిన సుతిమెత్తని మార్దవమయిన శబ్దాలనుకుంటే, పెద్దగా శబ్దించడం అల్పత్వం అనిపించుకుంటుంది. పాదాలను అలంకరించే మంజీరాలు శబ్దాడంబరాలు చేస్తాయి గాని, కంఠంలో భాసించే హారం చప్పుడు చెయ్యదుగాక చెయ్యదు. ఒకవేళ శబ్దించినా సుతిమెత్తగా శబ్దిస్తుందది.

❖ నిద్రపోవడం మూలంగా సగం జబ్బులు నయమయితే, సకాలంలో నిద్రలేచిన కారణంగా మిగిలిన సగం జబ్బులూ నయమవుతాయి.

–రాబర్ట్ షాఫర్

ప॥ *న వైరాగ్యాత్ పరం భాగ్యం, న బోధా దపర స్సఖా,*
*న హరే రపర స్త్రాతా, న సంసారాత్ పరో రిపుః!*

వైరాగ్యాన్ని మించిన భాగ్యమూ, జ్ఞానాన్ని పోలిన సఖుడూ, హరిని మించిన రక్షకుడూ, సంసారం కంటే శత్రువూ లేరుగాక లేరు.

ప॥ *చేకొని రాయని బాచడు*
*కాకాలు గుణించు పిన్నకాలము నాడే*
*'లా' కేత్వ మీయనేరడు*
*'దా'కును కొమ్మీయ డట్టి ధన్యుడు కలడే!*

రాయని భాస్కరుని దాతృత్వాన్ని వర్ణించే పద్యం ఇది. రాయని భాస్కరుడు బాల్యంలో అక్షరాల నుండి గుణింతాలకు వచ్చాడట! వచ్చి, 'లే' అనే అక్షరాన్నీ, 'దు' అనే అక్షరాన్నీ వ్రాయడం చేతకాలేదట అతనికి. 'లేదు' అనలేని పుట్టుదాత రాయని భాస్కరుడు అని ఈ పద్యభావం.

❖ అన్నీ తెలిసిన అమ్మ అమావాస్యనాడు మరణిస్తే, ఏమీ తెలియని తల్లి ఏకాదశినాడు మరణించిందట!

–సామెత

❖ పండితుడు అయిన వాడు ఐశ్వర్యం మొదలయిన వాటి తత్వాన్ని బాగా తెలిసిన వాడయి ఉంటాడు. కార్యాకారణ సంబంధాలన్నీ బాగా గుర్తుంచుకుని ఉంటాడు. ఎదుటివాడు ఏ ఉపాయాన్ని అవలంబిస్తున్నాడో అది బాగా తెలుసుకుని ఉంటాడు. జరిగే మాటే చెబుతాడు. లోకం పోకడలన్నీ బాగా అవగాహన చేసుకుని ఉంటాడు. మంచి ఊహాశాలీ, సద్య స్ఫూర్తీ కలవాడయి ఉంటాడు. అడిగిన దానికి వెంటనే జవాబు చెప్పగలవాడయి ఉంటాడు. ఎన్నడూ పెద్దలదారి తప్పి నడుచుకోడు. ప్రజ్ఞను అనుసరించి శాస్త్రజ్ఞానమూ, శాస్త్రజ్ఞానానికి తగిన ప్రజ్ఞా ఉంటాయతనికి. అంతులేని ఆస్తి పాస్తులు ఉన్నా, గొప్ప చదువు ఉన్నా, అనూహ్యంగా ఐశ్వర్యం పట్టినా గర్వం ఉండదతనికి. ఒదిగి ఒదిగి ఉంటాడు.

–విదురుడు

❖ పరబ్రహ్మ స్వరూపం చర్మచక్షువులకు కనబడదు. కర్మలు చేసి, వాటితో మనస్సు నిర్మలమైనవారే ఆ పరబ్రహ్మను చూడ గలరు. అలా చూడగలిగిన వారే ముక్తిని పొందుతారు. పర బ్రహ్మ అంతటా ఉన్నాడు. అన్నిటిలోనూ ఉన్నాడు. ఇది గుర్తించి ధ్యానించినవారికి దుఃఖాలు రావు. లోకం అంతా జలమయం అయినప్పుడు ఇక చెరువు ఎందుకు? అలాగే బ్రహ్మజ్ఞానికి ఇతర జీవుల వల్ల ప్రయోజనం ఏం ఉంటుంది?

జీవుడు ఒక జన్మలో తల్లి అవుతాడు. మరో జన్మలో తండ్రి అవుతాడు. ఇంకో జన్మలో కొడుకు అవుతాడు. సర్వానికీ అతనే ఆత్మ. ఆత్మకూ శరీరానికీ సంబంధం లేదు.

–సనత్సుజాతుడు

ప॥ *నయమున పాలుం ద్రావరు*
*భయమునను విషమ్మునైన భక్షింతురుగా*
*నయమెంత దోషకారియొ*
*భయమే చూపంగవలయు బాగుగ సుమతీ!*

–బద్దెన

బాబూ, నాయనా అని బ్రతిమలాడితే పాలు తాగరు. అదే కన్నెర్రచేసి భయపెడితే విషాన్నయినా తీసుకుంటారు. బ్రతిమాలడంలో తప్పు ఉందనుకుంటే, భయపెట్టడమే శ్రేయస్కరం.

శ్లో॥ *నిద్రాతు సేవితాకాలే*
*ధాతు సామ్య మతంద్రితామ్!*
*పుష్టిం వర్ణం బలోత్సాహం*
*వహ్నిదీప్తిం కరోతి హి!!*

–భావప్రకాశం

నిద్ర అగ్నిదీప్తిని కలిగిస్తుంది. అలసటను తగ్గిస్తుంది. ధాతువుల సమత్వాన్ని కలిగించి, దిగులును పోగొడుతుంది. పుష్టినీ, ఉత్సాహాన్నీ కలిగిస్తుంది.
'దానధర్మాలు చేయకపోయినా పర్వాలేదు, దక్షిణానికి తలపెట్టుకుని పడుకో' అంటారు పెద్దలు. ఎందుకు ఆ మాట

అంటారంటే...దక్షినదిగ్భాగానికి యముడు అధిపతి. ఉత్త రానికి తలపెట్టుకుని పడుకుంటే, పొద్దున లేవగానే యముణ్ణి చూసినట్టవుతుంది. అదలా ఉండగా ఆయస్కాంతసూచి ఉత్తర దక్షిణ దిశలను సూచిస్తుంది. అయస్కాంతక్షేత్ర దిశకూడా ఉత్తర దక్షిణాలుగా ఉంటుంది. ఈ కారణంగా దక్షిణానికి తలపెట్టుకుని నిద్రించాలి. అందుకు విరుద్ధంగా నిద్రిస్తే రక్తప్రసరణ దిశ, అయస్కాంతక్షేత్ర దిశ పరస్పరం విరుద్ధంగా ఉండి, అనారోగ్యానికి దారి తీస్తుంది. ఉత్తర దిక్కుగా తలపెట్టి ఉన్న ఏనుగు తలనే తెచ్చి గణేశునికి అతికించిన పురాణకథ దీనిని బలపరస్తున్నది.

నగ్నంగా పడుకోరాదు. ఇతురుల మంచాలపై, విరిగిన మంచంపై, మనుషులు లేని చోట పడుకోరాదు. ఎత్తుపల్లాలు ఉన్న చోట నిద్రిస్తే అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్టే! దేవాలయాల్లోనూ, శ్మశానాల్లోనూ నిద్రించకూడదు. నిద్రించే ముందు తాంబూలం నోటిలో ఉంటే దానిని తీసి వేసి, నోరు కడుక్కోవాలి. సిగలో పువ్వులుంటే వాటిని కూడా తీసేయాలి. ముఖమ్మీది తిలకధారణ కూడా తీసి వేయాలని ధర్మసింధు, శూద్రకాలామృతం తెలియజేస్తున్నాయి. పగటిపూట నిద్ర మంచిదికాదని ఆయుర్వేదం తెలుపుతోంది. అయితే బాగా శ్రమించేవారూ, రోగులూ పగటిపూట నిద్రించవచ్చని శుశ్రుతసంహిత తెలియజేస్తోంది. సంధ్యా కాలంలో అంటే సూర్యోదయ, సూర్యాస్తమయ కాలాల్లో నిద్రించరాదని అనేక శాస్త్రాలు తెలుపుతున్నాయి.

శ్లో॥ అగస్త్యః మాధవశ్చైవ
ముచుకుందో మహాబలః
కపిలో మునిరాస్తీకః
పంచైతే సుఖశాయినః

–స్మృతిముక్తావళి

అగస్త్యుడు, మాధవుడు, ముచుకుందుడు, కపిలుడు, ఆస్తీకుడు... ఈ అయిదుగురు మహాత్ములనూ స్మరించి నిద్రకు ఉపక్రమించడం చాలా మంచిది.

❖ నీటిలో మునుగు. మేరుపర్వత శిఖరాన్ని అధిరోహించు. శత్రువులను అణచి వేసేయ్! వ్యాపారం చెయ్యి. వ్యవసాయం కూడా చేసుకో! విద్యలు నేర్చుకో, కళల్లో ప్రవేశించు. పక్షిలాగ ఆకాశం అంతటా తిరుగు. లాభం ఉండదు. అదృష్టం ఉందీ, కావాల్సింది కాకామానదు, కారానిది కానూ కాదు.

–భర్తృహరి

అ ఆత్మ నదిలాంటిది. పుణ్యమే అందులో నీరు. సత్యమే దానికి జన్మస్థానం. ధైర్యమే దానికి ఒడ్డు. దయాదాక్షిణ్యాలే కెరటాలు. అందులో స్నానం చేసిన వాడు పుణ్యం చేసుకున్న వాడవుతాడు. ఇంకో నది కూడా ఉంది. అందులో నీరు పంచేంద్రియాలే! కామమూ, క్రోధమూ అందులో మొసళ్ళు. ధైర్యం అనే నావ పట్టుకుని ప్రయాణిస్తే, పునర్జన్మ అనే సుడిగుండంలో పడకుండా గట్టెక్కగలం.

–విదురుడు

ప॥ వెలది, జూదంబు, పానంబు, వేట, పలుకు
ప్రల్లదంబును, డండంపు పరుసదనము
సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ము సేత
యనెడు సప్త వ్యసనముల జనదు దగుల

–మహాభారతం

మనిషికి ఏడు దురలవాట్లు తగవు. ఈ ఏడు దురలవాట్లూ మనిషిని అన్ని విధాలా నాశనం చేస్తాయి. ఏంటయ్యా ఆ ఏడు దురలవాట్లు అంటే...1. వెలకి అమ్ముడుబోయే స్త్రీని ఆశ్రయించడం, 2. జూదం, 3. మద్యపానం, 4. వేట, 5. వదరుబోతుతనం, 6. గొప్పలు చెప్పుకోవడం, 7. ధన దుర్వినియోగం.

–ఈ ఏడింటిలో ఏ ఒక్కటయినా, కొన్నైనా, అన్నైనా మనిషికి అలవాటు కాకూడదు. అలవాటయితే అది వ్యసనం అవుతుంది.

❖ పాండిత్యం ఎక్కువయితే బుద్ధికి పడిశం పడుతుంది.

–చాసో

శ్లో॥ *రాజవత్ పంచవర్షాణి! దశవర్షాణి దాసవత్*
*ప్రాప్తేషు షోడశే వర్షే! పుత్రం మిత్రవదాచరేత్*

అభం శుభం తెలియని అయిదేళ్ళ బాలుణ్ణి రాజులా పెంచాలి. పదేళ్ళవాణ్ణి దాసునిలా, బానిసలా పెంచాలి. పిల్లాడికి పదహారు సంవత్సరాలు నిండాయి. యుక్తవయస్కుడు అయ్యాడు. యుక్తాయుక్త విచక్షణ తెలిసిందతనికి. అప్పుడతన్ని తండ్రి స్నేహితునిలా చూడాలి.

శ్లో॥ *అమృతం సద్గుణా భార్యా, అమృతం బాలభాషితం,*
*అమృతం రాజసమ్మానం, అమృతం మితభోజనం.*
గుణవంతురాలయిన భార్య, పిల్లల ముద్దుమాటలు, రాజ సభలో సన్మానం, మితమయిన భోజనం అమృతతుల్యం.

శ్లో॥ *ఆజగామ యదా లక్ష్మీః, నారికేళఫలాంబువత్,*
*నిర్జగామ యదా లక్ష్మీః, గజభుక్తకపిత్థవత్.*
సిరిసంపదలు వస్తే కొబ్బరికాయలోనికి నీరు వచ్చినట్టుగా తెలియకనే వస్తాయి. అవి పోవడం కూడా ఏనుగు మింగిన వెలగపండులోని గుజ్జులా కానరాకుండా పోతాయి.

❖ ఆచరణలేని విజ్ఞానం దీపం ముందు కూర్చుని కళ్ళు మూసుకోవడంలాంటిది.

–ఆర్యోక్తి

❖ నాలుగు మెతుకులు విదిలించేవాణ్ణి చూస్తే తోక ఆడిస్తుంది కుక్క. కాళ్ళతో మట్టి గోకుతుంది. వెల్లకిలాపడి, కడుపూ నోరూ చూపిస్తుంది. ఏనుగయితే...తనకి తిండిపెట్టేవాణ్ణి కూడా బెట్టుసరిగానే చూస్తుంది. ఎంతో బుజ్జగించి పెడితేనే తిండి అయినా తింటుంది.

–భర్తృహరి

ప॥ *శోకము సుఖముం చెఱచును*
*శోకము తేజంబు నడచు, శోకము బుద్ధిం*
*పోకార్చు గాన తాలిమి*
*గైకొని శోకంబు విడవగా వలయు నృపా!*

–మల్లికార్జునుడు

దుఃఖం సుఖాన్ని దూరం చేస్తుంది. తేజస్సును అణచి వేస్తుంది. బుద్ధిహీనుణ్ణి చేస్తుంది. కాబట్టి దుఃఖాన్ని దిగమింగి ఓర్పును అలవరుచుకోవాలి.

శ్లో॥ *కర్మణోహి ప్రధానత్వం కింకుర్వన్తి శుభాశ్శుభాః!*
*వశిష్ఠదత్తలగ్నోపి రామః కిం భ్రమతే వనే?!*

కర్మే నడిపిస్తుందిగాని, శుభాశుభాల జ్యోతిషాల లెక్కలు పని చెయ్యవు. వశిష్ఠుడంతటి వాడు రామపట్టాభిషేకానికి ముహూర్తం పెట్టాడు. మరి రాముడెందుకు అడవుల పాల య్యాడు?

❖ మనిషి అయినవాడు చెయ్యరాని చెడూ లేదు, చెయ్యలేని మంచీ లేదు. మనిషి అయినవాడు పాల్పడరాని స్వార్థమూ లేదు, సాధించలేని పరార్థమూ లేదు. మనిషి అయినవాడు దిగజారని నైచ్యమూ లేదు, అందుకోలేని ఉచ్ఛస్థితీ లేదు. మనిషి అయినవాడు చెయ్యరాని నాశమూ లేదు, చెయ్యలేని నిర్మాణమూ లేదు.

–శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

❖ ముసలితనంతో చక్కదనం పోతుంది. ఆశలు పెరిగితే ధైర్యం పోతుంది. మృత్యువుతో ప్రాణాలు పోతాయి. అసూయతో ధర్మం పోతుంది. క్రోధంతో సంపదలు పోతాయి. దుర్జనులకు సేవలు చేస్తే శీలం పోతుంది. కామం వల్ల సిగ్గుపోతుంది. గర్వంతో సకలమూ పోతాయి.

–విదురుడు

శ్లో॥ *ఆయుర్విత్తం గృహచ్ఛిద్రం*
*మంత్రౌషధ సంగమం*
*దానమానావ మానాని*
*నవగోప్యం నకారమేత్!!*

ఆయువు, డబ్బు, ఇంటి రహస్యం, మంత్రం, ఔషధం, సంగం, దానం, మానం, అవమానం...ఈ తొమ్మిందింటినీ 'నవగోప్యాలు' అంటారు. వీటిని ఎవరికీ చెప్పకూడదు.

❖ 'వినాయకుని పెళ్ళికి వెయ్యి విఘ్నాలు' అన్న సామెత ఎలా పుట్టిందంటే... తల్లిదండ్రులు పెళ్ళి చేసుకోమని కోరితే, తల్లి పార్వతితో అన్నిటా సమానమయిన కన్య దొరికితే తప్ప కుండా పెళ్ళి చేసుకుంటాను అన్నాట్ట వినాయకుడు. ఆమె కోసం అన్వేషిస్తూ కూర్చున్నాట్ట. జగన్మాత పార్వతికి సమాన మయినవారు దొరుకుతారా? దొరకరు. అందుకే ఇంతవరకూ వినాయకునికి పెళ్ళికాలేదని అంటారు. ఈ కథ కారణంగానే ఈ సామెత పుట్టింది అని అంటారు. పెళ్ళి చేసుకోరా నాయనా అంటే పెద్ద విఘ్నం తెచ్చిపెట్టడమే ఈ సామెతకు కారణం. ఇదిలా ఉండగా, వినాయకునికి సిద్ధి, బుద్ధి భార్యలు ఉన్నారని, వారికి క్షేముడు, లాభుడు కొడుకులు ఉన్నారని లోకంలో ఇంకో కథ ప్రచారంలో ఉంది.

శ్లో॥ *స్వగృహే పూజ్యతే మూర్ఖః*
*స్వగ్రామే పూజ్యతే ప్రభుః*
*స్వదేశే పూజ్యతే రాజాః*
*విద్వాన్ సర్వత్ర పూజ్యతే!*

స్వగృహంలో మూర్ఖుడు, స్వగ్రామంలో ప్రభువు, స్వదేశంలో రాజు పూజలు అందుకోగలిగితే...విద్వాన్ ఎల్లెడలా పూజలు అందుకుంటాడు. విద్వాంసుణ్ణి, విద్వత్తుగలవాణ్ణి, జనం గుర్తిస్తారు. ఆదరిస్తారు. ఆరాధిస్తారు. అందుకే విద్య మహ నీయమయినది అంటారు.

ప॥ *పంచమనిగమంబు భారతం బగునని*
*పొగడిరేల జనులు బుద్ధిమాలి*
*హింసనెంచి చూడ ఇష్ట మెట్లయ్యెనో*
***విశ్వదాభిరామ! వినురవేమ!***

ఋుక్, యజుస్, సామ, అధర్వవేదాల తర్వాత ఐదోవేదం భారతం అవుతుందని బుద్ధిమాలిన జనులు ఎందుకు పొగిడారో! ఆలోచిస్తే చూస్తే హింస ఎందుచేత ఇష్ట మయిందో!

శ్లో॥ ***అఘటిత ఘటితం ఘటయతి, సుఘటిత ఘటితాని దుర్ఘటీకురుతే!***
***విధిరేవ తాని ఘటియతి యాని పుమాన్నైవ చింతయతి!***

ఊహకి అందని ఘటనలను విధి జరిపిస్తుంది. జరిగేందుకు వీలులేని వాటిని జరిపిస్తుంది. జరిగిపోతున్నవాటిని స్తంభింపజేస్తుంది. ఘటనాఘటనలు విధి చేతిలోనే ఉన్నాయి.

శ్లో॥ ***భుక్తోపవిశత స్తుందం, శయానస్య తు పుష్టతా,***
***ఆయు శ్చంక్రమమాణస్య, మృత్యు ర్ధావతి ధావతః!***

తిన్న వెంటనే కదలకుండా కూర్చుంటే పొట్ట పెరుగుతుంది. పడుకుంటే కొవ్వు పెరుగుతుంది. మెల్లగా అటూ ఇటూ తిరగాలి. తిరిగితే ఆయుర్వృద్ధి కలుగుతుంది. పరిగెత్త కూడదు. పరిగెడితే ఆయుక్షీణం కలుగుతుంది.

❖ చంచలమైన జ్ఞాపకశక్తి చెడ్డది. చంచలమైన ప్రవర్తన మరింత చెడ్డది. చంచలమైన హృదయం, లక్ష్యం అన్నిటికన్నా చెడ్డవి.

–సి. సిమన్స్

ప॥ *ఒరులేయవి యొనరించిన*
*నరవర! అప్రియము తన మనంబునకగు, తా*
*నొరుల కవి సేయకునికియె*
*పరాయణము పరమధర్మపథములకెల్లన్.*

–తిక్కన

ఏ పని ఇతరులు చేసినప్పుడు మనకి ఇష్టంగా ఉండదో, కష్టమనిపిస్తుందో ఆ పనిని మనం ఇతరులకి చెయ్యకూడదు. ఇది అన్ని ధర్మాలకెల్లా ఉత్తమమైనది.

❖ ఏ పని చేసేందుకయినా ముందు బాగా ఆలోచించడం ఒక్కటే సరిపోదు. ఆ ఆలోచన అంటే మనం తీసుకున్న నిర్ణయం లేదా నిశ్చయాన్ని చాలా రహస్యంగా ఉంచుకోవాలి. మన ఆలోచన బయటపడకూడదు. బయటపడిందా, దానిని చెడగొట్టేవాళ్ళే ఎక్కువ. ఈర్ష్య, ద్వేషం, చూపోపమి...ఇలాంటి దుర్బుద్ధులు కలవారెందరో ఉన్నారు. వారంతా మన పనిని చెడగొడతారు. ఆలోచన అంటే మంత్రాలోచన ఎంత అవసరమో, దానిని పరమరహస్యంగా

ఉంచడమూ అంతే అవసరం. అలా ప్రవర్తించగలిగితేనే నిరాఘాటంగా కార్యసిద్ధి జరుగుతుంది.

–చాణక్యుడు

శ్లో॥ *ఖ్యాతశ్శక్రో భగాంకః, విధురపి మలినః, మాధవో గోపజాతః*
*వేశ్యాపుత్రో వశిష్ఠః, రతిపతి రతనుః, సర్వభక్షో హుతాశః!*
*వ్యాసో మాత్స్యోదరీయః, లవణ జలనిధిః, పాండవా జారజాతాః*
*రుద్రః ప్రేతాస్థిధారీ త్రిభువన విషయే కస్యదోషం న చాస్తి?*

ఇంద్రుడు గౌతముని శాపంతో మచ్చలు ఉన్నవాడు. చంద్రుడు కళంకి. కృష్ణుడు యాదవ వంశీయుడు. వశిష్ఠుడు వేశ్యాపుత్రుడు. మన్మథుడుకి దేహం లేదు. అగ్ని సర్వాన్నీ భక్షిస్తుంది. వ్యాసుడు పల్లె స్త్రీకి జన్మించాడు. సముద్రజలం ఉప్పు. పాండవులు జారత్వంతో జన్మించారు. శివుడు శవాల ఎముకులు ధరిస్తాడు. దోషం లేనివారు ముల్లోకాల్లోనూ వెదికినా కనిపించరు.

❖ మీపై మీరు విశ్వాసం కోల్పోవడం అంటే, భగవంతునిపై విశ్వాసం కోల్పోవడమే!

–వివేకానంద

❖ దుర్జనులను సజ్జనులను చేస్తుంది. మూర్ఖులను పండితులుగా మారుస్తుంది. శత్రువులను మిత్రులను చేస్తుంది. కనపడని దాన్ని కనబడేట్టుగా చేస్తుంది. కాలకూటవిషాన్ని కూడా అమృతంగా మార్చేస్తుంది. ఇదంతా చేసేది కర్మే! ఈ కర్మనే భగవతి అనుకో! కోరికలూ ఆశయాలూ నెరవేర్చు కునేందుకు

ఆ భగవతిని కొలుచుకో! మంచికోసం చూడకు. మంచి అంటే చిక్కులు తప్ప మరేమీ కాదు.

–భర్తృహరి

❖ డబ్బు దుబారా చేసేవాణ్ణి లక్ష్మి విడిచిపెట్టి పోతుంది. అవసరమా, అనవసరమా అన్న ఆలోచన లేకుండా, వెనుకా ముందూ చూడకుండా, అంతూపొంతూ లేకుండా డబ్బు ఖర్చు చెయ్యడం ఎవరికీ మంచిది కాదు. రూపాయి ఒకొక్కప్పుడు కుండపెంకుతో సమానమవుతుంది. ఒకొక్కప్పుడు అదే రూపాయి వెయ్యినోటుని తలదంతుంది. దాన్ని గుర్తించగలగాలి. గుర్తించినవాడికే డబ్బు ఎప్పుడు ఖర్చు చెయ్యాలో, ఎప్పుడు చెయ్యకూడదో, ఎంత ఖర్చుచెయ్యాలో తెలుస్తుంది. తెలుసుకోలేనివాడు దరిద్రుడయి ఎందుకూ పనికిరాకుండాపోతాడు.

–చాణక్యుడు

ప॥ *గుడ్లగూబ పెద్ద గుడ్లున్నదైనను*
*సుంతయైన వెలుగు జూడలేదు*
*విద్యలున్ననేమి? విజ్ఞతలేకున్న*
*వాస్తవమ్ము నార్లవారి మాట!*

గుడ్లగూబకి పెద్దపెద్దకళ్ళుండి ఏం లాభం? వెలుతురు చూడలేదు. అందుకే దానిని 'దివాంధం' అంటారు. అలాగే ఎంత పెద్ద చదువులు చదివినా విజ్ఞత లేనప్పుడు అతడు గుడ్లగూబతో సమానం అంటారు నార్లవారు.

శ్లో॥ *కిం పౌరుషం రక్షతి యేన నార్తాన్?*
*కిం వా ధనం నార్థి జనాయ యత్ స్యాత్!*
*సా కా క్రియా యా న హితానుబద్ధా?*
*కిం జీవితం సాధు విరోధి యద్వై!!*

–కాళిదాసు

ఆర్తులను ఆదుకోలేని పౌరుషం ఏం పౌరుషం? యాచకులకు ఇవ్వని డబ్బుండి, ఏం లాభం? అందరికీ హితంకాని పని ఎందుకు? సజ్జనులతో విరోధం పెట్టుకుంటే జీవితం ఎందుకు?

ప॥ *కనులు లేనివాడు కాళ్ళు పోయినవాడు*
*ఉభయు లరయు కూడి యుండినట్లు*
*పేదపేదగూడి పెనగొని యుందురు*
*విశ్వదాభిరామ వినురవేమ*

కళ్ళులేనివాడు, కాళ్ళులేనివాడు ఇద్దరూ కలసి లోటులేకుండా బతికినట్టు, పేదవాళ్ళు ఒకరితో ఒకరు విడదీయలేనంతగా కలసిపోయి బతుకుతారు. అలాగే ఒకరిలోపం మరొకరు పూరించుకుంటూ బతకడం గొప్పది అన్నది వేమన బోధ.

❖ జీవితంలో రెండే రెండు దురదృష్టాలు. ఒకటి, కోరినవి పొందలేకపోవడం, రెండు, వాటిని పొందడం.

–జార్జి బెర్నార్డ్ షా

శ్లో॥ *యుక్తి యుక్తం వచోగ్రాహ్యం బాలాదపి సుభాషితమ్!*
*వచనం తత్తు నగ్రాహ్యం అయుక్తంతు బృహస్పతేః!!*

లోకం మెచ్చేటువంటి మాట పిల్లాడు చెప్పినా గ్రహించాలి. లోకానికి సరిపడని మాటని బృహస్పతి చెప్పినా పట్టించుకో నక్కరలేదు.

శ్లో॥ *అగ్నిహోత్రం గృహం క్షేత్రం, గర్భిణీం వృద్ధబాలకౌ,*
*రిక్తహస్తేన నోపేయాత్, రాజానం దైవతం గురమ్.*

అగ్నిహోత్రం, స్వగృహం, పుణ్యక్షేత్రం, గర్భిణీస్త్రీ, ముసలి వారు, బాలురు, రాజు, దైవం, గురుడు...వీరి వద్దకు వెళ్ళే టప్పుడు ఒట్టిచేతులతో పోకూడదు. వారికి ఇచ్చేందుకు పండో, పువ్వో తీసుకునిపోవాలి.

❖ పాముకి విషం పళ్ళలో ఉంటే, జ్ఞాతికి విషం కళ్ళలో ఉంటుంది.

–సామెత

❖ హిందూధర్మాచరణ అంతా స్మృతులను అనుసరించే ఉంటుంది. స్మృతుల్లో ధర్మార్థకామమోక్షాలు అయిన చతు ర్విధ పురుషార్థాల గురించి వివరంగా పేర్కొన్నారు. వర్ణ వ్యవస్థ, అర్థవ్యవస్థ, వర్ణాశ్రమధర్మాలు, విశేష ప్రాయశ్చి త్తాలు, శాసనవిధానం, దండనవ్యవస్థ, మోక్షసాధన అన్నీ స్మృతుల్లో ఉన్నాయి. నూటికిపైగా స్మృతులు లభిస్తున్నాయి. అందులో ముఖ్యమయినవి:

మను, యాజ్ఞవల్క్య, అత్రి, విష్ణు, హారీత, ఔశాసన, అంగీ రస, యమ, ఆపస్తంబ, సంవర్త, కాత్యాయన, బృహస్పతి, పరాశర, వ్యాస, శంఖ, లిఖిత, దక్ష, గౌతమ, శాతతాప, వశిష్ఠ, ప్రజాపతి మొదలయినవి. ఇందులో మను, యాజ్ఞవల్క్యా

స్మృతులకు వాఖ్యానాలు ఎక్కువగా లభిస్తున్నాయి. కలియుగానికి పరాశరస్మృతి ప్రధానమయినది అంటారు.

ప॥ *మచ్చికలేనిచోట ననుమానము వచ్చిన చోట మెండుగా*
*కుచ్చితులున్నచోట గుణకోవిదులుండని చోట విద్యకున్*
*మెచ్చని చోట రాజు కరుణించని చోట వివేకులున్నచో*
*నచ్చట మోసమంద్రు సుగుణాకర పెమ్మయ సింగధీమణీ!*

చనువులేనిచోట, మనమీద ఎదుటివారికి అనుమానం కలిగిన చోట, లేదంటే మనకే ఎదుటివారి మీద అనుమానం కలిగిన చోట, కుచ్చితులు, కపటబుద్ధులు ఉన్నచోట, గుణకోవిదులు, తెలిసినవారు ఉండనిచోట, విద్యకు తగిన గుర్తింపు లేనిచోట, రాజు లేదా రాజ్యం ఆదరణ లభించనిచోట వివేకులు ఉండకూడదు. ఉంటే వారికి మోసం జరిగితీరుతుంది.

శ్లో॥ *జిహ్వాగ్రే వర్తతే లక్ష్మీ, జిహ్వాగ్రే మిత్ర బాంధవా,*
*జిహ్వాగ్రే బంధన ప్రాప్తిః, జిహ్వాగ్రే మరణం ధ్రువమ్!*

నాలుకవలన...అది పలికే మాటల వలన సంపదలు కలుగుతాయి. చుట్టాలు, స్నేహితులు ఏర్పడతారు. అతిగా మాట్లాడితే సంకెళ్ళు కూడ పడతాయి. ఆఖరికి ప్రాణం కూడా పోవచ్చు. మనిషికి కీర్తిని, అపకీర్తిని, ధర్మాధర్మాలను, పాప పుణ్యాలను ప్రాప్తింపజేసేది మాటే! ముఖానికి చిరునవ్వు ఎంత అందాన్ని కలిగిస్తుందో, మనిషికి మాట అంత అందాన్ని కలిగిస్తుంది. మాట్లాడడం ఒక కళ. దానిని అనుక్షణం అభ్యసించాలి.

❖ చల్లారిపోయిన విరోధాన్ని కెలకకూడదు. దర్పంగా తిరగకూడదు. వాజమ్మలా ప్రవర్తించకూడదు. పేదతనం కలిగినా చెడువృత్తులను స్వీకరించకూడదు. తనకు సుఖాలు కలిగితే పొంగిపోవడమూ, ఎదుటివారికి దుఃఖాలు కలిగితే సంతోషించడమూ తప్పు. అడిగితే ఇచ్చి, తర్వాత దాని గురించి బాధపడకూడదు. సమాజాన్ని అనుసరించి మనిషి మసలుకోవాలి. విరుద్ధంగా మసలి వివాదాస్పదుడు కాకూడదు.

–విదురుడు

❖ తాచుపాము ఒకటి పాములవాడి బుట్టలో చిక్కి నలిగిపోతోంది. ఆకలికి నకనకలాడిపోతోంది. బయటపడే అవకాశం లేదు దానికి. ఆ స్థితిలో ఆ బుట్టలో ఏదో ఉన్నదని, దానిని తిందామని ఒక ఎలుక ఆ బుట్ట కొరికి అందులోకి ప్రవేశించింది. అంతే! లోపలికి వచ్చీ రాగానే ఆ ఎలుకను గుటుక్కున మింగేసింది పాము. తర్వాత ఎలక చేసిన రంధ్రం నుంచే బయటపడి పారిపోయింది. దీని ద్వారా అర్థమయిందేమిటి? కాలం కలసిరాకపోతే నోరు మూసుకుని పడి ఉండాలి. బాగుపడేందుకయినా, చెడిపోవడానికి అయినా దైవమే బలీయమని తెలుసుకోవాలి.

–భర్తృహరి

శ్లో॥ *క్రోధో మూల మనర్థానం, క్రోధః సంసారబంధనం,*
*ధర్మక్షయకరః క్రోధః, తస్మాత్ క్రోధం విసర్జయేత్!!*

అనర్థాలన్నిటికీ మూలకారణం కోపమే! సర్వబంధనాలకూ కోపమే హేతువు. ధర్మాన్ని కోపమే నశింపజేస్తుంది. కనుక కోపాన్ని విడచిపెట్టాలి.

ప॥ *పాంథశాల జగతి, బ్రతుకు తీర్థస్థలి*
*జన్మకాదు ఖైదు, జగతియందు*
*బ్రతుకువరము, నీకు భగవంతుడొసగెను*
*కాదు చావు నీకు, కడమ మెట్టు*

–మాదాసు

ఈలోకం వచ్చీపోయే బాటసారుల నిలయం. మనం అందరం బాటసారులమే! ఈ జీవితం తీర్థస్థలం వంటిది. అంటే పవిత్రమయినది, విలువైనది కూడా. అలాగే ఈ జన్మ కారాగారం అనుకోరాదు. దేవునిదయ వలన 'జన్మ' లభించింది. దానిని సద్వినియోగం చేసుకోవాలి. నిరాశా నిస్పృహలతో ఆత్మహత్య చేసుకోవడం పరిష్కారం కాదు. ఆలోచించమని సారాంశం.

❖ పడవ నీళ్ళలో ఉండవచ్చుకాని, నీరు పడవలో ఉండకూడదు. అలాగే సాధకుడు సంసారంలో ఉండవచ్చుగాని, సంసార ఆసక్తి సాధకునిలో ఉండకూడదు.

–రామకృష్ణపరమహంస

❖ ఓడినవాడెప్పుడూ అనుమానిస్తాడు.

–సైరస్

❖ దీపం పేరు చెబితే చీకటి పోతుందా?

–సామెత

శ్లో॥ *ధనం తావ దసులభం, లబ్ధం కృచ్ఛ్రేణ రక్ష్యతే,*
*లబ్ధనాశో తథా మృత్యుః, తస్మా దేత న్న చింతయేత్!*

ధనసంపాదన చాలా కష్టం. సంపాదించిన దానిని రక్షించడం మరీ కష్టం. సాధించిన ధనం పోనూవచ్చు, లేదంటే తానే పోవచ్చు. అందుకని డబ్బు గురించి ఎక్కువగా ఆలోచించడం, సంపాదనని అలవాటు చేసుకోవడం మంచిది కాదు.

ప॥ *మాటలచేత దేవతలు మన్నన చేసి వరంబులిత్తురా*
*మాటలచేత భూపతులు మన్నన చేసి పురంబులిత్తురా*
*మాటలచేత కామినులు మన్నన చేసి సుఖంబులిత్తురా*
*మాటలు నేరకున్న అవమానము న్యూనముమాన భంగమున్*

మాటలచేతనే దేవతలు మెచ్చి వరాలు ఇస్తారు. మాటల నేర్పరితనంతోనే రాజులు రాజ్యాలను దానం చేసిన సందర్భాలు ఉన్నాయి. మాటల నైపుణ్యం చేతనే కామినులు తమంత తాముగా వరించి సుఖాలందిస్తారు. మాటలు రాని వారికి అవమానమూ, అందరిలోనూ న్యూనతా కలుగుతాయి.

శ్లో॥ *భూప్రదక్షిణ షట్కేన, కాశీయాత్రాయుతేన చ,*
*సేతుస్నానశతైర్యశ్చ, తత్ఫలం మాతృవందనే!*

ఆరుసార్లు భూప్రదక్షిణం చేసిన ఫలం, వేయిసార్లు కాశీయాత్ర చేసిన ఫలం, నూరుసార్లు నదీస్నానం చేసిన ఫలం, తల్లికి పాదాభివందనం చేస్తే లభిస్తుంది.

❖ మనిషినీడ పొద్దుటపూట పొడుగ్గా ఉండి, తర్వాత క్రమేపీ తగ్గిపోతుంది. మధ్యాహ్నం పూట పొట్టిగా ఉండి, తర్వాత క్రమేపీ పొడుగవుతుంది. దుర్జనుల మైత్రి పొద్దుటపూట నీడ లాంటిది. సజ్జనుల మైత్రి మధ్యాహ్నంపూట నీడలాంటిది.

–భర్తృహరి

❖ ఏది కన్నులకు కనబడకుండా ఉన్నదో, దేని వలన కన్నులు చూడగలుగుతున్నాయో అదే పరబ్రహ్మం.

–కేనోపనిషత్తు

శ్లో॥ *అతిరూపాత్ హృతా సీతా అతిదర్పాచ్చ రావణః*
*అతిదానాత్ బలిర్బద్ధః అతి సర్వత్ర వర్జయేత్!*

అందం అతిగా ఉండడంతో సీత అపహరణకు గురయింది. అతిగా గర్వించి రావణుడు నశించిపోయాడు. అతిగా దానం చేసి బలి బందీ అయ్యాడు. అందుకే 'అతి' అన్నిచోట్లా హాని కరం.

ప॥ *కంకుభట్టనంగ కాషాయములు గట్టి*
*కొలిచె ధర్మరాజు కోరివిరటు*
*కాలకర్మగతులు కనిపెట్టవలెనయా*
*విశ్వదాభిరామ వినురవేమ!*

సన్యాసిలా కాషాయవస్త్రాలు కట్టుకుని 'కంకుభట్టు' అనే పేరుతో ధర్మరాజు, విరాట మహారాజును సేవించాడు. కాని కాలాన్ని, కర్మ అనుభవాన్ని కనిపెట్టి నడుచుకోవడం ఎంతటి వారికయినా తప్పదు అంటున్నాడు వేమన.

శ్లో॥ *దదాతి ప్రతిగృహ్ణాతి గుహ్యామాఖ్యాతి పృచ్ఛతి*
***భుంక్తే భోజయతే చైవ షడ్విధం మిత్రలక్షణమ్!***

అవసరమయినప్పుడు అప్పు ఇవ్వడం, తీసుకోవడం, రహస్యాలు చెప్పడం, చెప్పించుకోవడం, మిత్రునిఇంట భోజనం చెయ్యడం, అతన్ని తన ఇంటికి భోజనానికి పిలవడం...ఈ ఆరూ మిత్రలక్షణాలు.

❖ అన్నం తిన్నవారూ, తన్నులు తిన్నవారూ మరచిపోరు.

–సామెత

శ్లో॥ *శీతే ఉ తీతే వసన మశనం వాసరాంతే నిశాంతే,*
*క్రీడారంభం కువలయదృశాం యౌవనాంతే వివాహం,*
*సేతోర్బంధం పయసి గళితే వార్ధకే తీర్థయాత్రాం,*
*విత్తే నష్టే వితరణ మహా! కర్తు మిచ్ఛంతి మూఢాః.*

శీతాకాలం వెళ్ళిపోయాక వస్త్రం, పగలు గడిచిపోయాక భోజనం, తెల్లారిన తర్వాత తరుణీ సంగమం, యౌవనం ముగిసిపోయాక వివాహం, గతజలసేతుబంధనం, వృద్ధాప్యంలో తీర్థయాత్ర, ధనం పోయాక దానం...వీటిని చేయాలనుకున్నవారు మహామూర్ఖులు.

❖ పుటం పెడితే బంగారం మంచిదో కాదో తెలుస్తుంది. ప్రవర్త ననుబట్టి మనిషి గుణం తెలుస్తుంది. వ్యవహారాన్నిబట్టి మనిషి మంచివాడో, దుర్మార్గుడో తెలుస్తుంది. భయం కలిగినప్పుడు శౌర్యమూ, డబ్బుచిక్కులు కలిగినప్పుడు ధైర్యమూ, ఆపదలు వచ్చినప్పుడు స్నేహమూ, చారుల యోగ్యతా తెలిసిపోతాయి.

-విదురుడు

❖ దేవశిల్పి విశ్వకర్మ కుమార్తెలు సిద్ధి – బుద్ధిని విఘ్నేశ్వరుని భార్యలుగా ఉపాసనపద్ధతిలో చెబుతారు. ఈ ఇద్దరినీ ఫలప్రాప్తి, జ్ఞానప్రాప్తికి ప్రతీకలుగా వ్యవహరిస్తారు. ఈ తత్వాలు రెండూ ఎల్లప్పుడూ విఘ్నేశ్వరుణ్ణి అంటిపెట్టుకునే ఉంటాయి. అందుకే విఘ్నేశ్వరునికి అంత ప్రాధాన్యత.

శ్లో|| *న నిందాం న స్తుతిం కుర్యాత్, న కించి న్మర్మణి స్పృశేత్,*
*నాఽ తివాదీ భవే త్తద్వత్, సర్వత్రైవ సమో భవేత్!*

ఎవరినీ నిందించకూడదు. పొగడకూడదు కూడా. ఒకరికి నొప్పి కలిగేటట్టు మాట్లాడకూడదు. ఎత్తిపొడపు మాటలు అసలాడకూడదు. అతివాదం పనికిరాదు. ఎప్పుడూ ఎవరి పరిమితిలో వారు ఉండాలి. లోకం అంతటా సమభావం కలిగినవాడే సుఖి అవుతాడు.

ప|| *పగయు గలిగెనేని పాము న్న యింటిలో*
*నున్న యట్లు గాక యూఱడిల్లి*

*యుండునెట్లు చిత్త మొకమాటు గావున*
*వలవ దధిక దీర్ఘవైర వృత్తి.*

ఎవరి మీదా పగ ఉండకూడదు. పగ ఉంటే నిద్రపట్టదు. పాము ఉన్న ఇంటిలో మనుషులు భయాందోళనలతో ఎలా ఉంటారో అలా పగ ఉన్నవారు అశాంతిగా ఆందోళనగా ఉంటారు. వారి మనసుకి స్థిరత్వం ఉండదు. అస్థిరమయిన మనసు అనేక దురాలోచనలకూ, దుర్మార్గాలకూ కారణం అవుతుంది. అందుకని, పగకు కారణమయిన వైరం ఎక్కువకాలం ఉండడం ఎవరికీ శ్రేయస్కరం కాదు.

–*తిక్కన*

❖ ముసలితనం ఆలోచించమంటుంది. యౌవనం సాహసించ మంటుంది.

–వివేకానంద

శ్లో॥ ***కార్యేషు దాసీ కరణేషు మంత్రీ, రూపే చ లక్ష్మీః క్షమయా ధరిత్రీ,***
***స్నేహే చ మాతా శయనే తు వేశ్యా, షట్కర్మయుక్తా కులధర్మపత్నీ.***

ఇంటిపనుల్లో దాసిగానూ, కార్యాలోచనల్లో మంత్రిగానూ, రూపసంపదలో లక్ష్మీదేవిగానూ, ఓరిమిలో భూదేవిగానూ, స్నేహంలో తల్లిగానూ, కూడినప్పుడు వేశ్యగానూ వర్తించే నేర్పరిగలవారినే 'కులపత్ని' అంటారు.

❖ కిందపడితే రబ్బరుబంతి చప్పున పైకి లేస్తుంది. చెడిపోయినా సజ్జనుడు వెంటనే బాగుపడతాడు. మట్టిముద్ద కిందపడితే పడడమే, పైకి లేచే అవకాశమే లేదు. అలాగే దుర్జనుడు చెడిపోయాడంటే చెడిపోవడమే! మరి బాగుపడడు.

–*భర్తృహరి*

❖ కోర్టుకెక్కినవారు ఒకరు ఆవుకొమ్మును, ఇంకొకరు తోకను పట్టుకుంటే, మధ్య వకీలు పొదుగుదగ్గర కూర్చుంటాడు.

–సామెత

ప॥ *వఱదైన చేను దున్నకు*
*కఱవైనను బంధుజనుల కడ కేగకుమీ*
*పరులకు మర్మము సెప్పకు*
*పిరికికి దళవాయి తనము బెట్టకు సుమతీ!*

వరద వచ్చిన తర్వాత మునిగిపోయిన పొలాన్ని దున్న కూడదు. కరువు వచ్చినప్పుడు బంధువుల ఇళ్ళకు వెళ్ళ కూడదు. పిరికివాడికి సేనాధిపత్యాన్ని ఇవ్వకూడదు. అలాగే ఇతరులకు తన రహస్యాల్ని చెప్పకుండా మౌనం వహించా లంటాడు సుమతీశతకకర్త.

శ్లో॥ **ఆలస్యం స్త్రీసేవా సరోగతా, జన్మభూమివాత్సల్యం,**
**భీరుత్వ మసంతోషః, షడ్వ్యాఘాతాని మనుజస్య.**

ఆలస్యం, స్త్రీలోలత, అనారోగ్యం, పుట్టినచోటంటే తగని మమకారం, పిరికితనం, ఏడుపుగొట్టుతనం...ఈ ఆరూ మనిషిని గొప్పవాణ్ణి చెయ్యవు.

*–హితోపదేశం*

శ్లో॥ ***మనసైవ కృతం పాపం, నశరీరకృతమ్ కృతమ్,***
***యేనైవా ఽ లింగితా కాంతా తేనైవా ఽ లింగితా సుతా.***

మనసుతో చేసిన పాపమే పాపంగాని, శరీరంతో చేసింది ఎంతమాత్రం పాపం కాదు. ఏ చేతుల్తో భార్యను కౌగిలించు

కుంటాడో, అదే చేతుల్తో కూతుర్ని కౌగిలించకుంటాడు పురుషుడు. అయితే ఆయా సందర్భాల్లో అతని మనసులో చాలా వ్యత్యాసం ఉంటుంది.

❖ మనిషి ఆత్మాభిమానాన్ని కలిగి ఉండాలి. అది లేనినాడు, మనిషిగా ఎదగలేడు.

–స్వామి వివేకానంద

❖ పాలు తమ తెలుపునూ, తీపినీ, బలవర్ధకశక్తినీ ముందు నీటికి ఇచ్చాయి. అయితే కాగికాగి పాలు ఇగిరిపోవడం చూసి, నీరు అగ్నిలో ఉరికింది. మిత్రుడు అలా అగ్నిలో ఉరకడాన్ని చూసి, పాలూ అగ్నిలో ఉరికాయి. వెంటనే పాలలో నీళ్ళు చల్లారెవరో. పాలు శాంతించాయి. ఇదీ మైత్రీలక్షణం.

–భర్తృహరి

❖ లోహం ముక్కలు రెంటినీ నిప్పులో పెట్టి కాలిస్తేనే అతుక్కుంటాయి. అంటే లోహాలు రెండు ఏకం కావాలంటే నిప్పు చాలా అవసరం. అలాగే తేజస్సూ, బలపరాక్రమాలే ఇద్దరు పెద్దలు స్నేహం చేసుకునేందుకు కారణం అవుతుంది.

–చాణక్య

❖ *షడ్దోషాః పురుషేణేహ, హాతవ్యా భూతి మిచ్ఛతా,*
*నిద్రా తంద్రా భయం క్రోధంః ఆలస్యం దీర్ఘసూత్రతా!*

–హితోపదేశం

బాగుపడాలనుకున్న మనిషి, అతినిద్ర, బద్ధకం, భయం, కోపం, సోమరితనం, ఎంతకాలానికీ పనిని ఓ కొలిక్కి చేర్చకపోవడం అనే ఈ ఆరు దోషాలనూ విడచిపెట్టాలి.

*ప॥ గడచిపోయినట్టి క్షణము తిరిగిరాదు*
*కాలమూరకెపుడు గడుపబోకు*
*దీపమున్నయపుడె దిద్దుకోవలెనిల్లు*
*విలువ తెలిసి చదువు తెలుగుబిడ్డ!*

–నార్ల చిరంజీవి

గడచిపోయిన క్షణం రమ్మంటే తిరిగిరాదు. అందుకనే కాలాన్ని వ్యర్థంగా, నిరుపయోగంగా గడపకూడదు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలి. దీపం ఆరిపోతే చీకట్లో ఏం చెయ్యగలం? ఏమీ చెయ్యలేం. అలాగే కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతిక్షణం విలువ అయినది చదువుకోవాలి.

❖ క్షమగలవాళ్ళు చేసే తప్పు ఒకటే! తప్పు చేసిన వారిని క్షమించి విడచిపెట్టడం. ఇలా విడచిపెట్టడంతో క్షమగలవాణ్ణి లోకం చాతగానివాడు అంటుంది. నిజానికి క్షమ దోషం కాదు. శక్తిగలవాళ్ళకి అది మరింత బలాన్నిస్తే, చాతగానివారికి అది ఒక సుగుణమవుతుంది. క్షమలో వశీకరణశక్తి ఉంది. క్షమాగుణం కలిగినవారికి అసాధ్యం అన్నది లేదు. శాంతం అనే కత్తిని ధరించినవారిని దుర్మార్గులు ఎదిరించడం కష్టం.

–విదురుడు

❖ 'దృశ్యతే యథార్థతయావస్తు పదార్థ జ్ఞానసమితి దర్శనమ్' తత్త్వజ్ఞాన సాధనాలయిన శాస్త్రాలనే దర్శనశాస్త్రాలంటారు. ఈ దర్శనశాస్త్రాలన్నీ జీవుని జనన మరణాల గురించి

చర్చిస్తాయి. అందుకే వీటిని 'దర్శనాలు' అంటారు. ముఖ్య దర్శనాలను షడ్దర్శనాలు అంటారు.

శ్లో॥ *శీలం శౌర్య మనాలస్యం, పాండిత్యం మిత్రసంగ్రహః,*
*అచోరహరణీయాని, పంచైతా న్యక్షయో నిధిః*
శీలం, శౌర్యం, చురుకుతనం, పాండిత్యం, స్నేహశీలత– ఈ అయిదూ అక్షయనిధులు. దొంగలపాలు కానేకావు.

శ్లో॥ *నేక్షేతోద్యంత మాదిత్యం, నాస్తం యాంతం కదాచన,*
*నోపసృష్టం న వారిస్థం, న మధ్యం నభసో గతమ్.*
ఉదయిస్తున్న సూర్యుణ్ణి, అస్తమిస్తున్న సూర్యుణ్ణి, నీళ్ళలో ప్రతిఫలిస్తున్న సూర్యుణ్ణి, నట్టనడిమిన నెత్తిమీద ఉన్న సూర్యుణ్ణి తేరిపారచూడకూడదు.

శ్లో॥ *నిర్వాణ దీపే కిము తైలదానం? చోరేగతేవా కిము సావధానం?*
*వయోగతే కిం వనితా విలాసః? పయోగతే కిం ఖలు సేతుబంధః?*
దీపం ఆరిపోయిన తర్వాత తైలం పోయడం దేనికి? దొంగ దొంగిలించుకుపోయిన తర్వాత మేల్కొనడం దేనికి? వయస్సు అయిపోయిన తర్వాత స్త్రీవ్యామోహమా? నీళ్ళు పోయిన తర్వాత గట్టు నిర్మించడం దేనికి? సకాంలో జాగ్రత లేకపోతే కృషి ఎంత గొప్పదయినా వ్యర్థం అని దీని అర్థం.

శ్లో॥ *లుబ్ధానాం యాచకః శత్రుః మూర్ఖాణాం బోధకో రిపుః!*
*జారిణీనాం పతిః శత్రుః చోరాణాం చంద్రమా రిపుః!!*

లోభులకు యాచకుడు శత్రువు. మూర్ఖులకు బోధకుడు శత్రువు. వ్యభిచారికి భర్త శత్రువు. దొంగలకు చంద్రుడు శత్రువు.

ప॥ *నేయిలేని కూడు నీయాన కసువది*
*కూరలేని తిండి కుక్కతిండి*
*ప్రియములేని కూడు పిండపు కూడురా*
*విశ్వదాభిరామ వినురవేమ!*

నెయ్యిలేని తిండి నిజంగా గడ్డి. కూరలేని తిండి కుక్కలకూడు. ప్రియంగా పిలిచి పెట్టని కూడు 'పిండాకూడు'తో సమానం అంటాడు వేమన.

ప॥ *పాలసాగరమున పవ్వళించినవాడు*
*గొల్లఇండ్లపాలు కోరనేల*
*ఎదుటివారి సొమ్ముమెల్లవారికి తీపి*
*విశ్వదాభిరామ వినురవేమ!*

పాలసముద్రంలో శేషతల్పం మీద శయనించిన శ్రీమహా విష్ణువు, గొల్లవారి ఇళ్ళలో పాలు, వెన్న దొంగిలించి తినడం ఎందుకో? ఎందుకంటే ఎదుటివారి సొమ్ము అందరికీ తీపి కదా అంటాడు వేమన.

❖ మోహాన్ని మించిన అగ్ని, అసూయను మించిన మోసకారి, అవివేకాన్ని మించిన వల, దురాశవంటి ప్రవాహం ఎక్కడా కనిపించవు.

–ధమ్మపథం

❖ జీవితాన్ని ప్రేమిస్తున్నావా? అయితే కాలాన్ని వృధా చేయకు. కాలమే జీవితం.

–*బెంజమిన్ ఫ్రాంక్లిన్*

*ప॥* *అతిచనవిచ్చి మెలంగగ*
*సుతసతులైన నిరసించి చులకన చేతుర్*
*మతమెఱిగి చరింపదగు*
***కుతుకముతో*** *మనుజుడెపుడు గువ్వలచెన్నా!*

అతిమంచి పనికిరాదు. మరీ చనువుగా ప్రవర్తిస్తే అంతా మనల్ని చులకనగా చూస్తారు. వ్యక్తిత్వాన్ని మరచి కలివిడిగా ఉంటే కట్టుకున్న భార్య, కన్నకొడుకులు కూడా తక్కువ చేస్తారు. హద్దుల్లో ఉంటూ తగిన విధంగా ప్రవర్తిస్తేనే మాటకి విలువ, మన్నన ఉంటాయి. అతిచనువు అనర్థదాయకం అని గ్రహించాలి.

❖ *అంధే తమ సి వార్ధక్యే దండం దశగుణం భవేత్!*
గుడ్డితనం, చీకటి, ముసలితనం...ఈ మూడింటికీ చేతికర్రతో పదిరెట్లు బలం కలుగుతుంది.

❖ *అగ్నిదాహాదపి విశిష్టం వాక్పారుష్యమ్!*
నిప్పుకన్నా కఠినమైన మాట ఎక్కువగా బాధిస్తుంది.

❖ *అజల్పన్నహసన్ తన్మనా భుంజీత!*
మాట్లాడుతూ, నవ్వుతూ, పరాకుగా ఉండి భోజనం చేయరాదు.

❖ *అతితృష్ణాన కర్తవ్యా తృష్ణాం నైవ పరిత్యజేత్!*
ఎక్కువ ఆశను కలిగి ఉండకూడదు. అలాగని ఆశను పూర్తిగా వదలకూడదు.

❖ *అనాథప్రేత సంస్కారాత్ కోటియజ్ఞ ఫలం భవేత్!*
అనాథశవానికి దహన సంస్కారం చేయడం వల్ల కోటి యజ్ఞాల ఫలం లభిస్తుంది.

❖ *అనిర్వేద ప్రాప్యాణి శ్రేయాంసి!*
సాహసం చేయనిదే శ్రేయస్సు కలుగదు.

❖ *సంతోష స్త్రిషు కర్తవ్యో, కళత్రే భోజన ధనే!*
*త్రిషు చైవ న కర్తవ్యో, దానే తపసి పాఠనే!*
భార్య, భోజనం, ధనం...ఈ మూడింటా ఎప్పటికప్పుడు సంతృప్తి చెందాలి. లేకపోతే వాటివల్ల సుఖం లభించదు సరికదా, అనర్థాలు సంభవిస్తాయి. ఇక దానం, తపస్సు, చదువు...ఈ మూడింటా ఏనాడూ తృప్తి చెందకూడదు. ఎంత ఎక్కువగా వాటిని ఆచరిస్తే అంత ఫలితం ఉంటుందని గ్రహించాలి.

❖ *శకటం పంచహస్తేషు, దశహస్తేషు వాజినం,*
*గజం హస్తసహస్రేషు, దుష్టం దూరేణ వర్జయేత్!!*
బండికి అయిదు మూరల దూరంగానూ, గుర్రానికి పది మూరల దూరంగానూ, ఏనుగునకు వేయి మూరల దూరం గానూ వైదొలగాలి. దుష్టునికి ఎంత దూరంలో ఉంటే అంత మంచిది.

❖ *వనితా విత్తం పుస్తకం, పరహస్తం గతం గతః,*
*అథవా పునరాయాతి, జీర్ణం భ్రష్టా చ ఖండశః!*
పుస్తకం, స్త్రీ, ధనం...ఈ మూడూ పరాయిచేతికి చిక్కితే తిరిగిరావు. తిరిగి వచ్చినా పుస్తకం చిరిగిపోయి, స్త్రీ భ్రష్టు రాలు అయిపోయి, ధనం కొంచమైపోయి వస్తాయి.

❖ *అప్రతీతో జయతి సంధనాని!*
శ్రమించడంలో వెనుకడుగు వేయనివాడే సంపదలను సాధిస్తాడు.

❖ *అభూత్యై స్వప్నమ్!*
నిద్రాలోలత్వం నాశనం కోసమే!

❖ *అమంత్రమక్షరం నాస్తి!*
మంత్రబీజం కాని అక్షరం లేదు.

❖ కాపు ఎక్కువయిన కొద్దీ చెట్లు వంగిపోతాయి. కొత్తనీరు చేరినకొద్దీ మేఘాలు కిందికి వాలిపోతాయి. సంపదలు పెరిగిన కొలదీ సజ్జనులు అణగిమణగి ఉంటారు.

–భర్తృహరి

❖ *హేతుత శ్శత్రుమిత్రే భవిష్యతః!*
ఇటు శత్రుత్వమూ, అటూ మిత్రుత్వమూ ఏదో కారణంగానే ఏర్పడతాయి. తను బాగుపడాలని ఒకడు ఒక పని చేస్తాడు. దానివల్ల ఒకరికి ఉపకారం జరుగుతుంది. మరొకరికి అప కారం కలుగుతుంది. ఈ క్రమంలో ఉపకారం పొందినవాడు మిత్రుడయితే, అపకారం పొందినవాడు శత్రువు అవుతాడు.

–చాణక్య

❖ లోకంలోని దుఃఖానికంతా కారణం భయం. మూఢవిశ్వాసాలకు అసలు కారణం భయం. భయం లేకపోవడమే స్వర్గం. స్వర్గాన్ని అందుకోవాలంటే భయాన్ని వదలిపెట్టాల్సిందే!

–వివేకానంద

❖ *యథా పూర్వం గజ స్నాత్వా*
*గుహ్యా హస్తేన వైరజః*
*దూషయత్యాత్మనోదేహం*
*తథా నార్యేషు సౌహృదమ్!*

–వాల్మీకి

నదిలో దిగి జలకాలాడుతుంది ఏనుగు. స్నానం చేసి శరీరాన్ని పరిశుభ్రం చేసుకుంటుంది. బయటకు రాగానే తుండంతో దుమ్మునంతా లాక్కొని, మీద జల్లుకుని అపవిత్రం అయిపోతుంది. అలాగే మనలో ఎంత పవిత్రత ఉన్నప్పటికీ అయోగ్యుల స్నేహం వలన కలుషితమయిపోతాం. వారితో స్నేహం నిష్ప్రయోజనం. నిష్ఫలితం.

❖ పక్క ఇంటి పోరు పండగంత వేడుక.

–సామెత

❖ వల్లించకపోవడం వేదాలకూ, వ్రతనియమాలు లేకపోవడం బ్రాహ్మలకూ, అబద్ధం మనిషికీ, భర్తకు దూరంగా ఉండడం భార్యకూ భంగపాటు కలిగిస్తాయి. పడుకున్నకొద్దీ నిద్ర పెరుగుతుంది కాని తగ్గదు. సంభోగం చేసినకొద్దీ కామం పెరుగుతుందికాని తగ్గదు. కట్టెలు వేసినకొద్దీ అగ్ని

విజృంభిస్తుందికాని తగ్గదు. తాగినకొద్దీ మద్యం కావాలని పిస్తుందిగాని తృప్తినీయదు.

-విదురుడు

❖ *శునః పుచ్ఛ మివ వ్యర్థం, లుబ్ధస్య పరిజీవనం,*
*గోపనే నహి గుహ్యస్య, నచ దంశనివారణే!*
లోభి బతుకు కుక్కతోకలా నిరుపయోగం. కుక్కతోక సిగ్గును దాచుకునేందుకూ పనికిరాదు, ఈగల్ని తోలేందుకూ పనికిరాదు. అలాగే లోభిధనం, తనకుగానీ, పరులకుగానీ ఉపయోగపడదు.

❖ *టకా ధర్మః టకా కర్మ, టకా హి పరమం పదం,*
*టకా యస్య గృహే నాస్తి, హాటకా టక్టకాయతే!*
ధనమే ధర్మం, ధనమే కర్మం, ధనమే పరమపదం. ధనం లేని ఇంట్లో కుండలు టకటకలాడుతాయి.

❖ *ఆలస్యం హి మనుష్యాణాం, శరీరస్థో మహారిపుః,*
*నాస్త్యుద్యమసమో బంధుః, కృత్వాయం నావసీదతి.*
తన బద్ధకమే మనిషికి శత్రువు. నిరంతర కృషీవలునికి నాశనం లేదు. ఉద్యమాన్ని(ప్రయత్నం) మించిన ఆత్మబంధువు వేరే లేదు.

❖ *మహానదీ ప్రతరణం, మహాపురుష నిగ్రహం,*
*మహాజన విరోధం చ, దూరతః పరివర్జయేత్.*
మహాప్రవాహాలను నిరాధారుడై దాట ప్రయత్నించకూడదు. మహాపురుషులను అదుపు చేయరాదు. మహాత్ములతో విరోధం పనికిరాదు. ఇవి వినాశకరాలు.

❖ కాలిన పెనం మీద నీళ్ళు జల్లితే ఇగిరిపోతాయి. ఆ నీళ్ళే తామరాకు మీద పడితే ముత్యాల్లా మెరుస్తాయి. ఆ నీళ్ళే సముద్రంలో ముత్యపుచిప్పలో పడితే ముత్యాలయి పోతాయి. అధములనూ, మధ్యములనూ, ఉత్తములనూ అనుసరించి తిరిగే వారి చిత్తవృత్తులు ఇలా ఉంటాయి.

–భర్తృహరి

❖ తిన్న ఇంటి వాసాలు ఎంచుతావేమిటయ్యా అంటే పొరుగింటి సంగతి నాకేం తెలుసు? అన్నాట్ట!

–సామెత

❖ *సహసా విదధీత న క్రియా, మవివేకం పరమాపదాం పదం,*
*వృణతే హి విమృశ్యకారిణం, గుణలుబ్ధాః స్వయ మేవ సంపదః*
ఏ పనినీ తొందరపడి చేయకూడదు. తొందరపాటుతనం, అవివేకమే అన్ని అనర్థాలకూ మూలం. సవిమర్శకంగా మంచి చెడులు ఆలోచించి పనిచేసే వారిని లక్ష్మి తనంత తానుగా కోరి కటాక్షిస్తుంది.

❖ ***పక్షిణాం బలమాకాశం, మత్స్యానా ముదకం బలం,***
***దుర్బలస్య బలం రాజా, బాలానాం రోదనం బలమ్.***
ఆకాశంలోనే పక్షులకు బలం. నీటిలోనే చేపలకు బలం. బలహీనుకు ప్రభువే బలం. శిశువులకు రోదనమే కార్య సాధకం.

❖ భయం వేరు, బెంగ వేరు. జీవితంలో క్షణం సేపు భయపడవచ్చుగాని, గంటసేపు బెంగపెట్టుకోకూడదు.

–రావిశాస్త్రి

ప॥ *తన యూరి తపసి తనమును*
*దన పుత్రుని విద్య పెంపు దన సతి రూపున్*
*దన పెరటిచెట్టు మందును*
*మనసున వర్ణింప రెట్టి మనుజులు సుమతీ!*

అన్నీ తనకు సంబంధించినవే! అందరూ తనవారే! అయినా వారి గొప్పతనాన్ని బయటకు చెప్పరాదంటారు. తన ఊరి తపోనిష్ఠాగరిష్ఠతనూ, తన కుమారుని విద్యాధిక్యతనూ, తన భార్య బాహ్యసౌందర్యాన్నీ, తన ఇంటి పెరటిచెట్టు వైద్యాన్నీ మనసులో సైతం గొప్పగా చెప్పుకోకూడదు. అన్నీ గోప్యంగా ఉంచాలంటాడు సుమతీ శతకకర్త.

❖ అష్టకష్టాలంటే....
1. దేశాంతరగమనం 2. భార్యావియోగం 3. ఆపద్బంధు దర్శనం 4. ఉచ్ఛిష్టభక్షణం (ఎంగిలితినడం) 5. శత్రుస్నేహం 6. పరాన్న ప్రతీక్షణం (ఇతరులపంచన చేరడం) 7. భంగం (పదిమందిలో తలెత్తుకుని తిరగలేనితనం) 8. దారిద్ర్యం.

❖ మృత్యువు గడ్డితో చేసిన పులిబొమ్మలాంటిది. కోరికల ఆంత ర్యాన్ని తెలుసుకుని, స్త్రీవ్యామోహం మొదలయిన విషయ సుఖాలు ఆశించకుండా జ్ఞానాన్ని సంపాదించుకునే పండి తుణ్ణి అదేమీ భయపెట్టలేదు. శరీరమే నేను అనుకునేవాడికి కామక్రోధాలే మృత్యువు అవుతాయి. మృత్యువు రహస్యమూ, పరబ్రహ్మ స్వరూపమూ తెలుసుకున్నవాడు మృత్యువంటే

భయపడడు. పామరుణ్ణి కబళించే మృత్యువు, పండితుణ్ణి సమీపించలేదు. సమీపించినా తానే కడతేరిపోతుంది.

–సనత్సుజాతుడు

ప॥ *పుత్తడి గలవాని పుండుబాధయు కూడ*
*వసుధలోన చాల వార్త కెక్కు*
*పేదవానియింట పెండ్లైన యెరుగరు*
*విశ్వదాభిరామ వినురవేమ*

బంగారం కలిగినవాడు అంటే సంపదకలిగినవాడి చిన్న పుండు కూడా పెద్దవార్తయి ప్రచారమవుతుంది. అదే పేదవాడి ఇంట పెళ్ళి జరిగినా ఎవరూ పట్టించుకోరు. అక్కరలేదెవరికీ.

❖ *అసంతుష్టో ద్విజో నష్టః, సంతుష్ట ఇవ పార్థివః,*
*సలజ్జా గణికా నష్టా, నిర్లజ్జేవ కులాంగనా.*

సంతుష్టిలేని బ్రాహ్మణుడు, సంతుష్టుడయిన రాజూ పాడయిపోతారు. లభించినదానితో బ్రాహ్మణుడు సంతృప్తి చెందాలి. కాని రాజు అలా సంతృప్తి చెందకూడదు. ఉన్న రాజ్యం చాలు అని రాజు అనుకుంటే చాలా ప్రమాదం. పొరుగురాజు పెరిగి ఈ రాజును తన్ని తరిమేస్తాడు. అలాగే కులస్త్రీ సిగ్గూ, లజ్జా కలిగి ఉండడం ఒక యోగ్యత. అదే వెలయాలు ఈ రెంటినీ కలిగి ఉండకూడదు. కలిగి ఉంటే ఆమె చెడిపోతుంది. ఒకరికి మంచిదయింది వేరొకరికి కాదన్నది దీని అర్థం.

ప॥ *భార్య అనెడు నొక్క భారమ్ము లేనిచో*
*పుల్లియాకు వోలె పురుషుడెగురు*
*దారి తప్పనీని దైవమ్ము భార్యరా*
*విశ్వదాభిరామ! వినురవేమ!*

*-బేతవోలు రామబ్రహ్మం*

వేమనను అనుకరిస్తూ భార్య గొప్పదనం గురించి బేతవోలు రామబ్రహ్మంగారు రాసిన పద్యం ఇది. భర్త పుల్లియాకు (ఎంగిలి విస్తరాకు)వంటివాడు. దానిపై బరువు వంటిది భార్య. ఆ బరువు లేకపోతే ఆకు ఎగిరిపోతుంది. స్థిరంగా ఉండదు. అలాగే భార్య లేకపోతే మగవాడు స్థిరత్వాన్ని కోల్పోతాడు. మగవాడు దారి తప్పకుండా సక్రమ ప్రవర్తనలో ఉంచే దైవమే భార్య. జీవితాన్ని చక్కదిద్దే దేవతే భార్య.

❖ పశ్చాత్తాపాన్ని మించిన పరమౌషధం లేదు.

-బైబిల్

❖ జీవితంలో సర్వం కోల్పోయినా ఒకటి మాత్రం మిగులుతుంది. అదే భవిష్యత్తు.

*-క్రిష్టన్‌బోలే*

❖ జీవితంలో సగం సమస్యలకు కారణం, తక్షణమే 'అవును' అని, నింపాదిగా 'కాదు' అని చెప్పడమే!

*-జాన్ బిల్లింగ్*

ప॥ *కనకపర్వతంబున కాపురంబుండిన*
*అనిమిషేశ్వరునకు నాసపోదు*

*కనక కుండలములు కర్ణుని అడుగడా*
*విశ్వదాభిరామ వినురవేమ!*
ఇంద్రుని పుత్రప్రేమను బంగారం మీది ఆశగా వేమన వ్యంగ్యంగా చెబుతున్నాడు. బంగారుకొండ మీద కాపురం ఉంటున్నా దేవేంద్రునికి బంగారం మీద ఆశ పోలేదు. బంగారు కవచకుండలాలు బ్రాహ్మణవేషంలో వచ్చి కర్ణుని యాచించాడు.

❖ ఘటప్రదీపవత్ తదేజ్ఞానం యత్ న పరప్రతిబోధాయ.
ఇతరులకు బోధించేందుకు ఉపయోగపడని జ్ఞానం, కుండలో దీపంలాంటిది.

❖ *కర్మజ్యాయో హ్యకర్మణః*
ఏ పనీ చేయకుండా ఉండడం కంటే ఏదో ఒక పని చేయడం మేలు.

శ్లో॥ *ఉచ్ఛైరధ్యయనం, చిరంతన కథాః, స్త్రీభిః సమాలాపనమ్,*
*తాసా మర్భక లాలనం, పతినుతిః, తత్పాక మిథ్యాస్తవమ్!*
*మిథ్యాదాన, మభూత పూర్వ చరితం, సాముద్రికం, జ్యోతిషం,*
*వైద్యం, గారుడ మంత్రజాల మధికం భిక్షాటనే ద్వాదశ!!*
గట్టిగా చదవడం, ఎక్కడెక్కడివో కథలు చెప్పడం, స్త్రీలతో చక్కగా మాట్లాడడం, వారి బిడ్డలను లాలించడం, పై అధికారిని పొగడడం, వండిన వంటను మెచ్చుకోవడం, దానం చేసినట్టు కనిపించడం, లేని కథలు అల్లి చెప్పడం, హస్తసాముద్రికం, జ్యోతిషం, వైద్యం, పాము, తేలు

మంత్రాలు... ఇవన్నీ ఇతురులను ఆకర్షించే విద్యలు. వీటిలో కొన్ని అయినా చేతకాకపోతే సంఘాన్ని ఆకర్షించలేరు.

శ్లో॥ *అళీ-కుళీ-వృశ్చిక-వేణు-రంభా*
*వినాశకాలే ఫలముద్వహన్తి!*
*యథా తథా సజ్జన-దుర్జనానాం*
*వినాశకాలే విపరీత బుద్ధిః!*

తుమ్మెద, పీత, తేలు, వెదురు, అరటి...ఇవి నశించే కాలం వచ్చినప్పుడే ఫలిస్తాయి. సజ్జనులకయినా దుర్జనులకయినా పోగాలంవేళే విపరీతబుద్ధులు పుడతాయి.

శ్లో॥ *ఇదం కాష్ఠం ఇదం కాష్ఠం నద్యం వహంతి సంగతః,*
*సంయోగాశ్చ వియోగాశ్చ కా తత్ర పరివేదనా?*

ప్రవహించే నదిలో రెండు కట్టెపుల్లలు దగ్గరగా చేరుతాయి. కొంత దూరం కలసి ప్రయాణిస్తాయి. తర్వాత విడిపోతాయి. అలాగే మనుషులు కూడా ఈ జీవన ప్రవాహంలో కొంత కాలం సంయోగ సుఖాన్ని, మరికొంతకాలం వియోగ దుఃఖాన్ని అనుభవించక తప్పదు. దానికి బాధపడకూడదు.

❖ *దాంపత్యోః కలహే సాక్ష్యం న కుర్యాత్ పితృపుత్రయోః*
భార్యాభర్తల గొడవల్లోనూ, తండ్రీ కొడుకుల కలహాల్లోనూ ఏ ఒకరి పక్షంలోనూ సాక్షిగా వ్యవహరించకూడదు.

❖ కోపం వస్తుందేమో అని అప్రియం అయినా నిజం చెప్పని వాడు మిత్రుడు కాదు. అనుమానాస్పదంగా ప్రవర్తించే వాడు

కూడా మిత్రుడు కాడు. ఎవరి పట్ల తండ్రి మీద కలిగేంతటి విశ్వాసం కలుగుతుందో వాడే మిత్రుడు. ఎలాంటి బంధుత్వమూ లేకపోయినా అంటిపెట్టుకుని ఉండి, చలనం లేని మైత్రిని చూపించేవాడే మిత్రుడు. చలచిత్తుడికీ, పెద్దలమాట వినని వాడికీ ఎక్కడికక్కడే భ్రాంతిపడేవాడికీ మిత్రులుండరు.

–విదురుడు

❖ దురాశను మించిన దుర్గుణం, చాడీలు చెప్పడం కంటే పాపం, సత్యాన్ని మించిన సంపద, నిర్మలమయిన మనస్సుకు మించిన తీర్థస్నానం, సౌజన్యాన్ని మించిన సద్గుణం, కీర్తిని మించిన అలంకారం, అపకీర్తిని మించిన మరణం, మంచివిద్యను మించిన ధనం లోకంలో లేవు.

–చాణక్యుడు

❖ అనారోగ్యానికి వ్యతిరేకంగా వైద్యుడేకాదు, రోగి కూడా పోరాటం చెయ్యాలి.

–హిపోక్రేట్స్

❖ నోరు జారిన మాట, ఎగిరిపోయిన పక్షి, గతించిన కాలం, పోగొట్టుకున్న అవకాశం తిరిగి లభించటం కష్టం.

–భర్తృహరి

*ప॥ దానము భోగము నాశము*
*పూనికతో మూడు విధులు భువి ధనమునకున్*
*దానము భోగము నెఱుగని*
*దీనుని ధనమునకు గతి తృతీయమె యగున్*

ధనానికి మూడు గతులు ఉంటాయి. ఒకటి: దానం చేయడం, రెండు: సుఖించేందుకు వినియోగించడం, మూడు: దానం తట అది నశించడం. సంపాదించిన డబ్బుని ఏదేని ఉత్తమ కార్యాలకు దానం చేసి, మంచి పేరు తెచ్చుకోవడమో, లేదంటే సంతృప్తి పొందడమో ఉత్తమమయినది. కాదంటే సంపాదించాడు కాబట్టి, ఆ డబ్బుతో తానే గొప్పగా దర్పంగా భోగాలు అనుభవించాలి. అంటే ఆ రూపంలో నయినా డబ్బును ఖర్చు చెయ్యాలి. ఈ రెండూ చెయ్యక సొమ్ము దాచే పక్షంలో అది ఎవరికో చెందుతుంది. లేదంటే ఏదో ఓ నష్టం వాటిల్లి తనంత తానుగా అది నశిస్తుంది.

శ్లో॥ *జరా రూపం హరతి ధైర్య మాశా, మృత్యుః ప్రాణాన్ ధర్మచర్యా మసూయా,*
*కామో హ్రియం వృత్త మనార్యసేవా, క్రోధః శ్రియం సర్వ మేవాభిమానః*

ముసలితనం రూపాన్ని, ఆశ ధైర్యాన్ని, మృత్యువు ప్రాణాలను, అసూయ ధర్మప్రవృత్తిని, కామం లజ్జను, దుష్టసేవ సత్ప్రవర్తనను, కోపం ఐశ్వర్యాన్ని, గర్వం సర్వాన్నీ హరించి వేస్తాయి.

❖ అడ్డాలనాడు బిడ్డలుగాని, గడ్డాలనాడు బిడ్డలా?

–సామెత

❖ ప్రతి పనీ అవహేళన, వ్యతిరేకత, తర్వాత ఆమోదం అనే మూడు దశలను దాటుతుంది.

–వివేకానంద

ప॥ *శోకము సుఖముం చెఱచును*
*శోకము తేజంబు నడచు, శోకము బుద్ధిం*
*పోకార్చు గాన తాలిమి*
*గైకొని శోకంబు విడవగా వలయు నృపా!*

–మల్లికార్జునుడు

దుఃఖం సుఖాన్ని దూరం చేస్తుంది. తేజస్సును అణచి వేస్తుంది. బుద్ధిహీనుణ్ణి చేస్తుంది. కాబట్టి దుఃఖాన్ని దిగ మింగి ఓర్పును అలవరుచుకోవాలి.

❖ పశువులకు పర్జన్యుడు బంధువు. రాజులకు మంత్రులు బంధవులు. స్త్రీలకు పతులు బంధువులు. బ్రాహ్మలకు వేదాలు బంధువులు. ధర్మానికి సత్యం రక్ష. చదువుకి అభ్యాసం రక్ష. చక్కదనానికి ఉద్వర్తనం(నలుగు) రక్ష . కులానికి శీలం రక్ష. ధాన్యానికి కొలత రక్ష. గుర్రాలకు వ్యాయామశిక్షణ రక్ష. గోవులకు తరుచు కనిపెడుతుండడం రక్ష. స్త్రీలకు సామాన్య వస్త్రాలు రక్ష.

–విదురుడు

❖ ప్రియోపి భవతి ద్వేష్యః పరుషామీరయన్ గిరమ్

–మహాభారతం

పరుషంగా మాట్లాడితే ఎంత మిత్రుడయినా శత్రువు అవుతాడు.

శ్లో॥ *సత్యం మాతా పితా జ్ఞానం, ధర్మో భ్రాతా దయా సఖా,*
*శాంతిః పత్నీ క్షమా పుత్రః, షడేతే మమ బాంధవాః*

సత్యమే తల్లి. జ్ఞానమే తండ్రి. ధర్మమే సోదరుడు. దయయే మిత్రుడు. శాంతమే భార్య, క్షమయే పుత్రుడు...ఈ ఆరుగురూ ఆప్తబంధువులు.

- ❖ గులాబీలు వర్షించవు. ఎక్కువ గులాబీలు కావాలంటే ఎక్కువ మొక్కలు నాటాల్సిందే!

*–జార్జి ఇలియట్*

- ❖ గుర్తు తెచ్చుకుని బాధపడేకన్నా, మరచిపోయి చిరునవ్వు చిందించడం మిన్న.

*–క్రిష్టియానా రోసెట్టి*

- ❖ నియమం అనేది లేనప్పుడు శ్రేయస్సు అనేది ఉండదు. జీవితం అంతా నియమబద్ధంగా గడపాలని దృఢంగా సంకల్పించుకుని, పనులు ప్రారంభించిన నాటి నుంచే నిజమయిన జీవితం ప్రారంభమవుతుంది.

*–సుభాషిత రత్నావళి*

ప॥ *మాటలాడుటొకటి మనసులో నొక్కటి*
*ఒడలి గుణమదొకటి నడత యొక్కటి*
*ఎట్లు కలుగుముక్తి ఇట్టులుండగతాను*
*విశ్వదాభిరామ వినురవేమ!*

మనసులో ఉన్న భావం వేరు, మాటలో ఉన్న భావం వేరు. ఒంటబట్టిన గుణం ఒకటి, నలుగురికీ కనిపించే నడత ఒకటి. ఇన్ని నటనలు నేర్చిన మనిషికీ, మనసుకీ ముక్తి రాదుగాక రాదు.

శ్లో॥ *రా శబ్ద ఉచ్చారణాదేవ ముఖాన్నిర్యాన్తి పాతకాః,*
*పునః ప్రవేశ భీత్యాచ మకారస్తు కవాటవత్!*

'రా' అంటే నోరు తెరుచుకుంటుంది. చేసిన పాపాలు బయటికి పోతాయి. ఆ పాపాలు తిరిగి ప్రవేశించకుండా 'మ' అనాలి. అంటే నోరు కవాటంలా మూసుకుపోతుంది. ఇదీ 'రామ' శబ్దం గొప్పతనం.

శ్లో॥ *న కాష్ఠే విద్యతే దేవో నపాషణే నమృణ్మయే,*
*భావో హి విద్యతే దేవో తస్మాత్ భావో హి కారణమ్!*

దేవుడు కొయ్యబొమ్మలోనో, చెట్టుకొమ్మలోనో లేడు. రాయిలో లేడు. మట్టిబొమ్మలో లేడు. భగవంతుడు భావంలో ఉన్నాడు. భావం(నమ్మకం)ప్రధానం.

❖ అతి అభిమానం, అతిగా వాదించడం, ఇళ్ళు తగులబెట్టి, దోచుకుని, విషంపెట్టి చంపడం...వంటి ఘోరాలు చెయ్యడం, కోపంతో ఉండడం, ఎంతసేపూ తన కడుపుకోసమే చూసుకోవడం, మిత్రులకు ద్రోహం చెయ్యడం...ఈ ఆరూ దుష్కృత్యాలు. ఇవి పదునైన కత్తుల్లాంటివి. ఇవే పురుషుల ఆయుర్దాయం కోసేస్తాయి. మనుషుల్ని నిలువునా చంపేస్తాయి.

–విదురుడు

❖ జీవితంలో యవ్వనం ఒకసారే వస్తుంది. కాని పరిణతి జీవితాంతం సాగే ప్రక్రియ.

–డేవ్‌బారీ

❖ రాజకీయనాయకుడు రానున్న ఎన్నికల గురించి ఆలో చిస్తాడు. రాజనీతిజ్ఞుడు రానున్న తరం గురించి ఆలోచిస్తాడు.

–ప్లేటో

❖ విషంలో పుట్టిన పురుగు, విషంలోనే జీవిస్తుంది.

–సామెత

❖ ఆకులన్నీ ప్రజలవి. ఆపిల్‌పళ్ళన్నీ అధికారులవి.

–రావిశాస్త్రి

ప॥ *కొడుకుల్ పుట్టరటంచు ఏడ్తురవివేకుల్ జీవన భ్రాంతులై*
*కొడుకుల్ పుట్టరె కౌరవేంద్రునకనేకుల్ వారిచే నే గతుల్*
*పడసెన్, పుత్రులులేని ఆ శుకునకున్ పాటిల్లినే దుర్గతుల్*
*చెడునే మోక్షపదం బపుత్రకునకున్? శ్రీకాళహస్తీశ్వరా!*

–ధూర్జటి

జీవితం శాశ్వతం అనుకుంటూ, వివేకాన్ని కోల్పోయి, కొడుకులు పుట్టలేదని బాధపడుతూ ఉంటారు కొందరు. ధృతరాష్ట్రునికి వందమంది కొడుకులు పుట్టారు. ఏం లాభం? వారివల్ల తండ్రికి సద్గతి లభించలేదు సరికదా, కొండంతగా అపకీర్తి లభించింది. భాగవతోత్తముడయిన శుకమహర్షికి కొడుకులే పుట్టలేదు. అయినా అతను మోక్షాన్ని అందు కున్నాడు. అతనికి సద్గతి ప్రాప్తించింది. కాబట్టి కొడుకు పుట్టాలని వ్యామోహం చెందడం అనవసరం.

శ్లో॥ **భోజనాత్ త్పూర్వభాగే చ, భోజనాత్ పరత స్తథా,**
**క్షణే క్షణే మతి ర్భిన్నా, ధర్మస్య త్వరితా గతిః**

భోజనం చేయకముందు ఉన్న బుద్ధి, భోజనం చేసి సుఖంగా కూర్చున్నప్పుడు ఉండదు. మానవుల చిత్తవృత్తులు క్షణ క్షణమూ మారుతుంటాయి. కాబట్టి ఏ ధర్మకార్యాన్నయినా చేయ బుద్ధిపుట్టినప్పుడు వెంటనే చేసేయాలి. చేయకపోతే మళ్ళీ బుద్ధిమారిపోయే ప్రమాదం ఉంది.

శ్లో॥ *ఉత్తమే క్షణకోప స్స్యాత్*
*మధ్యమే ఘటికాద్వయమ్,*
*అధమే స్యా దహోరాత్రం*
*పాపిష్ఠే మరణాంతకమ్.*

ఉత్తముని కోపం క్షణమాత్రమే ఉంటుంది. సామాన్యుడి కోపం రెండు గడియ(గడియ అంటే ఇరవైనాలుగు నిము షాలు)లు ఉంటుంది. నీచునికోపం ఒక పగలూ, ఒక రాత్రీ ఉంటుంది. అంటే ఒక రోజల్లా ఉంటుంది. పాపాత్ముని కోపం మరణాంతమూ ఉంటుంది. క్షణకోపం మంచిది. దీర్ఘక్రోధం మంచిది కాదు.

❖ పురాణకాలం నుంచీ చిరంజీవులు ఏడుగురు. వారు... అశ్వత్థామ, బలిచక్రవర్తి, వ్యాసమహర్షి, హనుమంతుడు, విభీషణుడు, కృపాచార్యుడు, పరశురాముడు.

❖ అవినీతిపరుడయిన బంధువుకన్నా, నిజాయితీపరుడయిన శత్రువు మిన్న.

❖ అరుగుదల తగ్గినవారికి నీరు ఔషధంలా పని చేస్తుంది. అరుగుదలగలవారికి అదే బలాన్ని పెంచుతుంది. తినే

టప్పుడు తాగే నీరు అమృతం అవుతుంది. తిన్న తర్వాత తాగేనీరు మంచిది కాదు.

–చాణుక్యుడు

శ్లో॥ *అశ్వప్లుతం వాసవగర్జనం చ, స్త్రీణాం చ చిత్తం పురుషస్య భాగ్యం,*
*అవర్షణం చాప్యతివర్షణం చ, దేవో న జానాతి కుతో మనుష్యః*
గుర్రం దాటునీ, మేఘగర్జననీ, స్త్రీల మనస్సునీ, పురుషుని భాగ్యాన్నీ, వర్షం రాకపోకలనీ ఆ దేవుడే ఎరుగడు. ఇక మనుషులేం తెలుసుకుంటారు.

శ్లో॥ *శాంతితుల్యం తపో నాస్తి, న సంతోషాత్పరం సుఖం,*
*న తృష్ణాయాః పరో వ్యాధిః, న చ ధర్మో దయాసమః*
శాంతంవంటి తపస్సు, సంతోషం కంటే సుఖం, కోరికను మించిన వ్యాధి, దయనుపోలిన ధర్మం లోకంలో లేవు.

శ్లో॥ *ఉద్యమేన హి సిధ్యంతి, కార్యాణి న మనోరథైః,*
*న హి సుప్తస్య సింహస్య, ప్రవిశంతి ముఖే మృగాః*
యత్నకారణంగానే కార్యసిద్ధి అవుతుంది. అంతేగాని కోరినంతమాత్రాన పనులు నెరవేరవు. సింహాన్నంటూ నోరుతెరుచుకుని ఉన్నంత మాత్రాన జంతువులు తమంతటతాము వచ్చి ఆ నోట పడవు. వేటాడితీరాల్సిందే!

శ్లో॥ *జల మగ్ని ర్విషం శస్త్రం, క్షుద్వ్యాదిః పతనం గిరేః,*
*నిమిత్తం కించి దాసాద్య, దేహీ ప్రాణై ర్విముచ్యతే.*
జలగండం, అగ్నిగండం, విషం, ఆయుధాఘాతం, ఆకలి, వ్యాధి, గిరిపతనం... ఇలాగే ఏదో ఒక కారణంగా దేహి మర

ణిస్తున్నాడు. పుట్టినవాడు గిట్టకమానడు. కారణం అన్నది నిమిత్తమాత్రమే!

❖ మనుషులమధ్య మనుషులకోసం బతకడమే మంచితనం.

–టాల్‌స్టాయ్

❖ విజ్ఞానం ద్వారా బలమయిన తాత్వికత, నిజాయితీ, బుద్ధికుశలత లభిస్తాయి. శ్రమపట్ల గౌరవం ఏర్పడుతుంది.

–గోర్కీ

❖ భయమే బానిసత్వం, శ్రమే స్వాతంత్ర్యం, ధైర్య సాహసాలే విజయపరంపర.

–షేక్స్‌పియర్

❖ ఆలోచనలేని చదువు నిరర్థకం. చదువులేని ఆలోచన ప్రమాదకరం.

–కన్‌ఫ్యూషియస్

❖ నీరెండిపోయిన సరస్సులు విడిచిపెట్టి మరోచోటికి వెళ్ళిపోతాయి హంసలు. స్థిరబుద్ధికానివాణ్ణి, ఆత్మజ్ఞానం లేనివాణ్ణి, ఇంద్రియాలను నిగ్రహించుకోలేనివాణ్ణి సంపదలు అలాగే విడిచిపెట్టేస్తాయి. మిత్రులవల్ల ఉపకారాలు పొందీ, లాభాలు పొందీ, సమయం వచ్చినప్పుడు వారిని ఆదుకోనివారు కృతఘ్నులు. డబ్బున్నా లేకపోయినా మిత్రులను ఆదరిస్తునే ఉండాలి. లుబ్ధుడయినవాడు మిత్రుల స్వభావాన్ని గుర్తించలేడు.

–విదురుడు

❖ ప్రాణం ఉన్నంత వరకూ పనిచెయ్యాలి. సంపద, కీర్తి, భోగాలు క్షణికాలు. క్షుద్రకీటకంగా చనిపోవడంకన్నా సత్యాన్ని బోధిస్తూ కార్యరంగంలో మరణించడం ఉత్తమం.

–వివేకానంద

శ్లో॥ *తృణాదపి లఘు స్తూలః తూలాదపి చ యాచకః,*
*వాయునా కిం ననీతో సౌ? మామయం ప్రార్థయేదితి!*
గడ్డిపరకకంటే దూది తేలిక. దూదికంటే యాచకుడు తేలిక. అయితే అంత తేలికయిన యాచకుణ్ణి గాలి ఎందుకు ఎగరగొట్టడం లేదన్నది ప్రశ్నయితే, తనని కూడా యాచిస్తాడన్న భయంతో గాలి అతని దగ్గరకు చేరడం లేదన్నది సమాధానం.

శ్లో॥ *అధరస్య మధురిమాణం కుచకాఠిన్యం దృశోశ్చ తైక్ష్ణంచ,*
*కవితాయాః పరిపాకం హ్యానుభవరసికో విజానాతి!*
పెదవిని కొరకడంలోగల రుచి, కుచ కాఠిన్యం, చూపుల తీవ్రత, కవిత్వంలోని అందం...ఇవన్నీ అనుభవంతో తెలుసుకోవలసినవి.

ప॥ *తనువు నడవిజేసి తనలోనె కూర్చుండి*
*తపము చేయలేని తపసులెల్ల*
*అడవియందుజేరి అలజడి పడెదరు*
*విశ్వదాభిరామ వినురవేమ!*
శరీరాన్ని అడవి చేసుకోవాలి. అడవి చేసుకుని, తనలో తాను కూర్చోవాలి. తపస్సు చేసుకోవాలప్పుడు. అలాంటి వారు సమర్థులు. అలా చేయలేని అసమర్థ తాపసులు అడవులకు

చేరి ఆందోళనపడతారంటాడు వేమన. తపస్సు పరమార్థాన్ని తెలియని వారిని ఈ రకంగా హెచ్చరిస్తున్నాడతను.

❖ ఆలోచనకు అభరణంలాంటిది భాష. అంతేకాదు, భావానికి శరీరం లాంటిది కూడా.

–థామస్ కార్లైల్

❖ పనిచేయనివాడేకాదు, పనిబాగా చేయనివాడు కూడా సోమరిపోతే!

–సోక్రటీస్

❖ విద్య లక్షణం కార్యశీలతగాని, విషయ సేకరణ ఎంతమాత్రం కాదు.

–హక్స్‌లీ

❖ డబ్బు ఎవడి దగ్గర ఉంటే వాడే గొప్పవాడు. పండితుడు వాడే! సంప్రదాయాలు తెలిసినవాడే కాదు, గుణగ్రహణ చతురుడు కూడా వాడే! మాట్లాడదగ్గవాడు, వెళ్ళి దర్శించుకోదగినవాడు. సుగుణాలన్నీ బంగారాన్నే ఆశ్రయించుకుని ఉంటాయిమరి!

–భర్తృహరి

❖ *అగ్నిదాహా దపి విశిష్టం వాక్పారుష్యం!*
పరుషంగా మాట్లాడడం, మనసుకి నొప్పి కలిగేటట్టు మాట్లాడడం, పుల్ల విరిచినట్టు మాట్లాడడం, నిప్పుతో కాల్చడం కంటే బాధిస్తుంది. అధికారి, అధికారమదంతో మంచీచెడూ గుర్తించక కఠినంగా సేవకుల్ని ఏమయినా అన్నాడా,

అందుకు వారు చురకపెట్టినట్టుగా బాధపడతారు. అలాంటి మాట పడడం కంటే నిప్పులో దూకడం సుఖం అనుకుంటారు. మధురంగా, మృదువుగా మాట్లాడే అధికారి అంటేనే సేవకులు ఇష్టపడతారు. అధికారి సేవకుల ప్రేమాభిమానాలు సంపాదించుకోవాలి.

–చాణక్యుడు

❖ నలుపు నాలుగువంకలను తెస్తుంది. ఎరుపు ఏడువంకలను దాస్తుంది.

–సామెత

❖ *శతం విహాయ భోక్తవ్యమ్!*
వందపనులు ఉన్నా వదలి ముందు భోజనం చెయ్యాలి.

❖ *నహ్యాహాని నివర్తంతే!*
గడిచినకాలం తిరిగిరాదు.

❖ *తృష్ణైకా నతు జీర్యతే!*
లోకంలో అన్నీ జీర్ణించేవే! ఒక్క ఆశ మాత్రమే జీర్ణించదు.

ప॥ *వేష భూషలరసి పీటవేయకుమయ్య*
*మనసులోతు లెరిగి మసలుమయ్య*
*పేరు చూచి నేతిబీరకాయను పిండి*
*తీయగలవె నేయి తెలుగుబిడ్డ!*

ఖరీదయిన వస్త్రాలు ధరించడం, ఆడంబరంగా ఉండడం చూసి గొప్పవారని కీర్తించకూడదు. వాళ్ళ వేషభాషలూ,

భూషలూ(అభరణాలు) కాదు గమనించాల్సింది, వాళ్ళ మనసు గ్రహించాలి. వారి ప్రవర్తన గమనించాలి. పైపై డాబులు చూసి మోసపోకూడదు. నేతిబీరకాయలో నెయ్యి ఉంటుందనుకోవడం ఎంత అవివేకమో, అలాగే వేష భాషలనుబట్టి గొప్పతనం ఉంటుందనుకోవడం అంతే అవివేకం. ఆడంబరాలకు భ్రమపడి గౌరవించవద్దని హెచ్చరిస్తున్నారు నార్లచిరంజీవి.

శ్లో॥ ***మాతృహీన శిశుజీవనం వృథా, కాంతహీన నవయౌవనం వృథా,***
***శాన్తి హీనతపసః ఫలం వృథా, తింత్రిణీరసవిహీనభోజనమ్!***

తల్లిలేని పిల్లవాని బ్రతుకు, భార్యలేనివాని యౌవనం, శాంతంలేని ఋషి తపస్సు...ఇవన్నీ చారులేని భోజనంలా నిష్ఫలం.

❖ దాచినంత కాలం రహస్యం బానిసగా పడి ఉంటుంది. బయటపడిందా, అదే యజమాని అయి నెత్తికెక్కుతుంది.

–ఎమర్సన్

❖ విజయం ఎప్పుడో ఒకసారి వచ్చేదికాదు, అది నిరంతరం రావాలి. అలాగే మంచిపనులు ఎప్పుడో ఒకసారి చేయడం కాదు, నిరంతరం చేస్తూనే ఉండాలి. మంచి చేయడాన్ని అలవాటు చేసుకుంటే విజయం కూడా ఓ అలవాటుగా మారుతుంది.

–ఎడిసన్

❖ వ్యక్తిత్వాన్ని మలచుకునేందుకు సమాజం ఎంత అవసరమో, ఊహాశక్తిని పరిపుష్టం చేసుకునేందుకు ఏకాంతం అంత అవసరం.

*–రాబర్ట్ లోవెల్*

❖ అంకుశం ఏనుగునూ, దీపం చీకట్లనూ, వజ్రాయుధం కొండలనూ, తేజస్సు ఎంతటి బలాన్నయినా లొంగదీస్తాయి. ఏనుగు, చీకటి, కొండ, బలం...ఆకారంలో పెద్దవి. అంకుశం, దీపం, వజ్రాయుధం, తేజస్సు...పరిమాణంలో చిన్నవి. అకారాన్ని బట్టి శక్తిని తూచకూడదు.

–చాణక్యుడు

*శ్లో॥ సర్వం పరవశం దుఃఖం, సర్వ మాత్మవశం సుఖం,*
*ఏత ద్విద్యా త్సమాసేన, లక్షణం సుఖదుఃఖయోః.*

ఇతరుల మీద ఆధారపడి ఉండడమే దుఃఖదాయకం. స్వశక్తి మీద ఆధారపడి, కార్యనిర్వహణ చేసుకోగలగడమే సుఖం. సుఖదుఃఖ స్వరూపం సారాంశం ఇంతే!

*శ్లో॥ ప్రస్తావసదృశం వాక్యం, స్వభావసదృశీం క్రియాం,*
*ఆత్మశక్తిసమం కోపం, యో జానాతి స పండితః.*

సమయోచితమైన పలుకు, స్వభావోచితమైన పని, శక్తికి తగిన కోపాన్ని తెలిసి ప్రవర్తించినవాడే పండితుడు.

❖ కంకి ఎర్రనయితే కన్ను ఎర్రనవుతుంది.

–సామెత

శ్లో॥ *అసంభావ్యం న వక్తవ్యం, ప్రత్యక్ష మపి దృశ్యతే,*
*శిలా తరతి పానీయం, గీతం గాయతి వానరః.*

ప్రత్యక్షంగా చూసినా సరే, అసంభవాలను ఇతరులకు ఎన్నడూ చెప్పకూడదు. నీటిపై రాయి తేలింది, కోతి పాటలు పాడింది అంటే అంతా నవ్వుతారేగాని నమ్మరు.

❖ *వృథావృష్టి స్సముద్రేచ*
*వృథా ఉ తృప్తే చ భోజనం,*
*వృథా ధనపతౌ దానం*
*దరిద్రే యౌవనం వృథా.*

సముద్రంపై వర్షించడం, ఆకలిలేనివాడికి ఆహారం పెట్టడం, ధనవంతునికి దానం ఇవ్వడం, దరిద్రుని యౌవనం ఉపయోగం లేనివి.

❖ బుద్ధిమంతుడు కాలం కలసిరానప్పుడు తాబేలులా ముడుచుకుపోవాలి. కాలం కలసి వచ్చినప్పుడు తాచులా లేచి పగ సాధించాలి.

❖ సంతోషం కలిగినప్పుడు, ప్రమాదం సంభవించినప్పుడు, శత్రుభయం చెలరేగినప్పుడు, రాజసభలోనూ, శ్మశానంలోనూ ఎవడు కనబడతాడో వాడే బంధువు. అతన్నే అక్కున చేర్చుకోవాలి.

❖ స్వర్గాన్ని నరకంగా చేసేది, నరకాన్ని స్వర్గంగా చేసేది మన మనసే!

❖ అడవుల్లోనూ, యుద్ధరంగాల్లోనూ, శత్రువుల మధ్యా, నీటి లోనూ, అగ్గిలోనూ, సముద్రాల్లోనూ, పర్వతాల మీదా, నిద్ర పోయినా, వొళ్ళు తెలియకుండా పడిపోయినా, చిక్కుల్లో ఇరు క్కున్నా, పూర్వజన్మ సుకృతం ఉంటే...అదే ఎవరినయినా రక్షిస్తుంది.

-భర్తృహరి

❖ ఎప్పుడు ఎలా చనిపోయేదీ నువ్వు నిర్ణయించలేవు. ఇప్పుడు ఎలా జీవించాలన్నదే నిర్ణయించగలవు. నిర్ణయించుకో!

-వివేకానంద

శ్లో॥ *వైద్యాః వదన్తి కఫ పిత్త మరుద్వికారాన్*
*జ్యోతిర్విదో గ్రహగతిం పరివర్తయన్తి!*
*'భూతాభిషంగ' ఇతి భూతవిదో వదన్తి*
*ప్రాచీనకర్మ బలవాన్ మునయో వదన్తి*

శారీరకబాధలు కలిగితే వైద్యులు కఫ వాత పిత్తవికారా లంటారు. జ్యోతిష్కులు గ్రహస్థితి అంటారు. భూతవైద్యులు భూతసంబంధం అంటారు. పూర్వజన్మకర్మం అని మునీ శ్వరులు అంటారు. ఏది నిజమో ఆ దేవుడికే తెలియాలి.

శ్లో॥ *అశక్తస్తు భవేత్సాధుః బ్రహ్మచారీ తు నిర్ధనః*
*వ్యాధితో దైవభక్తశ్చ వృద్ధనారీ పతివ్రతా!*

బలహీనుడు గొడవలు పెట్టుకోడు, మంచిగా బతుకుతాడు. ధనహీనుడు, బ్రహ్మచర్యాన్ని పాటిస్తాడు. వ్యాధిగ్రస్తుడికి దైవ భక్తి ఎక్కువగా ఉంటుంది. ముసలితనంలో స్త్రీ పతివ్రతగా జీవిస్తుంది.

❖ శాస్త్రవిజ్ఞానం అంటే ఐక్యత సాధించడమే!

–వివేకానంద

❖ వ్యసనాల్లో మునిగినవాడికి కార్యసిద్ధికాదు. వ్యసనం అంటే ఏదో ఒక దాని మీద అత్యాసక్తి. అది దేన్నీ తోచనీయదు. చెడు చేస్తుందది. వ్యసనం ఉన్నవాడు ఏ పనీ సాధించలేడు. శాంతి కూడా అతనికి అలభ్యం. చేయాల్సిన పని వైపు చూడ లేడు. ఉదాసీనంగా ఉండిపోతాడు. ఏదయినా పని చెయ్యా లనుకునేవాడు, చేసి లాభం పొందాలనుకునేవాడు ఎప్పుడూ ఏ వ్యసనానికీ లోబడకూడదు.

–చాణక్యుడు

❖ జీవితం అంటే ఒక సమస్య నుంచి మరొక సమస్యకు ప్రయాణం మాత్రమే! ఏ సమస్యలూ లేని జీవితం ఉండదు.

శ్లో॥ *గతే భీష్మే హతే ద్రోణేష్యంగ రాజే దివంగతే*
***ఆశా బలవతీ రాజన్ శల్యో జేష్యతి పాండవాన్!***

మహావీరుడు భీష్ముడు పడిపోయాడు. గొప్ప ధనురా చార్యుడు ద్రోణుడు కుప్ప కూలిపోయాడు. తనని ఉద్ధ రిస్తాడని ఎవరి మీద అయితే ఆశలు పెట్టుకున్నాడో ఆ కర్ణుడు ఒరిగిపోయాడు. అయినా ఆశ చావలేదు. బలంగా నిలిచింది. ఫలితంగానే శల్యుని సేనానాయకునిగా చేసి దుర్యోధనుడు యుద్ధానికి సిద్ధమయ్యాడు. భీష్మ ద్రోణ కర్ణులవంటి మహామహులనే ఓడించగలిగిన పాండవులకు శల్యుడు ఒక లెక్కా? అయినా ఆశ...ఆశ సాధ్యాసాధ్యాల గురించి ఆలో చించదు.

శ్లో॥ *తులసీ విటపి స్థానం గృహే య స్యావ తిష్ఠతే*
*తద్గృహం తీర్థ రూపంహి నా యాన్తి యమకింకరాః!*
ఏ ఇంట్లో తులసి మొక్క ఉంటుందో ఆ ఇల్లు తీర్థంలాంటిది. ఆ ఇంటికి యమకింకరులు రారు.

ప॥ *పాల నీడిగింట గ్రోలుచునుండిన*
*మనుజులెల్ల చూచి మద్యమండ్రు*
*నిలువదగనిచోట నిలువ నిందలువచ్చు*
*విశ్వదాభిరామ వినురవేమ!*

–వేమన

కల్లుపాకలో పాలను తాగినా కల్లుతాగుతున్నావనే అంటారు. గుణశీలాలకు తగిన చోట నిలబడాలి. నిలబడకూడని చోట నిలబడితే నిందలు తప్పవు.

❖ శోకం, క్రోధం, లోభం, కామం, గర్వం, అతినిద్రా, ఈసు, అవివేకం, నిర్దయ, అసూయ, జుగుప్సా... ఈ పదకొండు గుణాలూ మహాదోషాలు. మనుష్యులను ఇవి నాశనం చేస్తాయి. మృగాలను పట్టుకోవడానికి వేటగాడు వీలూ చాలూ చూసుకుంటాడే అలాగే పరాకుగా ఉన్న సందర్భం చూసుకుని ఈ మహాదోషాలన్నీ మనిషిని ఒకొక్కటే చుట్టు ముడుతాయి. నిర్దయ, పరుషవాక్కు, అతిగా వాగడం, క్రోధం, డాబు, టక్కరితనం...ఇవి క్రూరుల గుణాలు. ఈ గుణాలు ఉన్నవారిని క్షమించకూడదు. స్త్రీలోలుడు, కుట్రలు

చేస్తూ బతికేవాడు, పదయినా ఎవరికయినా ముందిచ్చి, తర్వాత 'అయ్యో ఇచ్చానే' అని ఏడ్చేవాడు, డబ్బు వచ్చే చోట ఎలాంటి అవమానాన్ని అయినా లెక్కచెయ్యని వాడు, జ్ఞానహీనుడు, ఆత్మస్తుతి చేసుకునేవాడు, సుశీల అయిన తన భార్యను ద్వేషించేవాడు... ఈ ఏడుగురూ తుచ్ఛులు.

–సనత్సుజాతుడు

❖ ప్రతిదీ ప్రవహిస్తుంది. ఏదీ స్థిరంగా నిలిచి ఉండదు. అందుకే ఒకే నదిలో రెండుసార్లు దిగడం అసాధ్యం.

–హెరాక్లిటస్

శ్లో॥ *అంభసః ప్రసృతీ రష్టౌ, రవా వనుదితే పిబేత్,*
*వాత పిత్త కఫాన్ జిత్వా, జీవే ద్వర్షశతం సుఖీ.*

సూర్యోదయానికి ముందు ఎనిమిది గ్లాసులు(రెండు లీటర్లు) నీరు తాగిన వారు వాత పిత్త శ్లేష్మ దోషాలను జయిస్తారు. నూరేళ్ళూ సుఖంగా జీవిస్తారు.

శ్లో॥ *గతే శోకో న కర్తవ్యో, భవిష్యం నూన చింతయేత్,*
*వర్తమానేషు కార్యేషు, వర్తంతే హి విచక్షణాః.*

–విక్రమార్క

గడిచినదాని గురించి ఊరకనే ఆలోచిస్తూ కూర్చోకూడదు. జరగబోయే దాని గురించి ఆశాసౌధాలు కడుతూ కూర్చోకూడదు. విచక్షణజ్ఞానం కలవారు, వర్తమానంలో నివసిస్తూ ఎప్పుడు చేయాల్సిన పనులను అప్పుడే చేస్తారు.

శ్లో॥ అర్థానా మార్జనే దుఃఖం, ఆర్జితానాం చ రక్షణే,
ఆయే దుఃఖం, వ్యయే దుఃఖం, ధిగర్థం దుఃఖభాజనమ్.

–మను

ధనాన్ని సంపాదించడంలో దుఃఖం, సంపాదించినదాన్ని రక్షించుకోవడంలో దుఃఖం. ధనం వస్తే దుఃఖం, పోతే (వ్యయ మయితే) దుఃఖం. ఇంతలా దుఃఖాన్ని కలిగించే ఈ డబ్బు ఎంత వ్యామోహపెడుతోందో!!

శ్లో॥ అతిదానా ద్బలి ర్బద్ధో, హ్యతిమానా త్సుయోధనః,
వినష్టో రావణో లౌల్యా, దతి సర్వత్ర వర్జయేత్.

–చాణక్యుడు

అతిదానం చేసి బలిచక్రవర్తి, మితిమీరిన స్వాభిమానంతో దుర్యోధనుడు, అత్యాశతో రావణాసురుడు నశించిపోయారు. అందుకే అంటారు, అతి ఎందులోనూ పనికిరాదని.

❖ క్షమించడం అన్నది ధైర్యానికి ఉన్న గొప్ప గుణం.

–ఇందిరాగాంధీ

❖ ముసలివాళ్ళు ప్రతిదాన్నీ నమ్ముతారు. నడివయస్కులు ప్రతిదాన్నీ అనుమానిస్తారు. యువకులు ప్రతిదాన్నీ తెలుసుకుంటారు.

–ఆస్కార్‌వైల్డ్

❖ బాగా వికసించినప్పుడే పువ్వులు కోసుకోవాలి. ఆలస్యం చేయకూడదు. చేస్తే వాడిపోతాయవి. అలాగే వయసులో

ఉన్నప్పుడే మంచి పనులు చెయ్యాలి. ఆలస్యం చేశావనుకో, కాలం నీకు అనుకూలంగా ఉండదు.

–ఎడ్మండ్ స్పెన్సర్

❖ భగవంతునికి నువ్వు ఎంత దూరంలో ఉన్నావో, భగవంతుడూ నీకు అంతే దూరంలో ఉంటాడు.

–రమణమహర్షి

❖ సామాన్య ప్రజానీకం సానుభూతిని పొందాలంటే పచ్చి అబద్ధాలు చెప్పాలి. మొరటుగా మాట్లాడాలి.

–హిట్లర్

❖ సిగ్గుపడే విజయం కంటే ఓటమి మేలు.

–క్వింటస్ కషియస్

ప॥ *కులము నీఱుజేసి, గురువును వధియింప*
*పొసగ ఏనుగంత బొంకు బొంకె*
*పేరు ధర్మరాజు పెనువేపవిత్తయా*
*విశ్వదాభిరామ వినురవేమ!*

కులప్రతిష్ఠను బూడిద చేసి, విద్య నేర్పిన గురువును వధించడానికి, సందర్భానికి తగినట్టుగా ఏనుగంత అబద్ధం ఆడాడు ధర్మరాజు. పేరుకి ధర్మరాజేగాని, గుణానికి పెద్ద వేపవిత్తనం.

శ్లో॥ *నారికేళసమాకారా, దృశ్యంతే హి సుహృజ్జనాః,*
*అన్యే బదరికాకారా, బహిరేవ మనోహరాః.*

–హితోపదేశం

మంచి మనసుగల ఉత్తములు కొబ్బరికాయ వంటివారు. పైకి పెటుగ్గా ఉన్నా వారి అంతఃకరణ రసమయంగా ఉండి, లోకోపకారదృష్టి కలదిగా ఉంటుంది. కొందరు మనుషులు పైకి తీయని మాటలు చెబుతూ, లోపల కటువుగా స్వార్థ బుద్ధితో ఉంటారు. రేగుపండు ఎర్రగా పైకి కనబడుతుందే గాని, దానిలో ఉన్నది కఠినమయిన గింజ అన్నది గుర్తు పెట్టుకోవాలి.

శ్లో॥ *యథా కాష్ఠమయో హస్తీ, యథా చర్మమయో మృగః,*
*బ్రాహ్మణ స్త్వనధీయానః, త్రయస్తే నామధారకాః.*

–మనుస్మృతిః

కొయ్యతో చేసిన ఏనుగు, చర్మంతో చేసిన లేడి, అధ్యయనం చేయని బ్రాహ్మణుడు... నామమాత్రమేగాని నిజానికి ఆయా పేరుకి తగినవి కావు.

❖ *దుర్జనేన సమం వైరం, ప్రీతిం చాపి న కారయేత్,*
*ఉష్ణో దహతి చాంగారః, శీతః కృష్ణాయతే కరమ్!*

–హితోపదేశం

దుర్జనులతో విరోధమూ కూడదు. స్నేహమూ కూడదు. చల్లగా ఉన్నాయని బొగ్గుల్ని తాకితే చేయంతా మసి చేస్తాయి. వేడిగా ఉన్నప్పుడు తాకితే చేతులు కాలిపోతాయి.

❖ తన ఆలోచనలన్నీ బయటపెట్టుకున్నవాడు, అన్ని పనులూ చెడగొట్టుకుంటాడు.

–చాణక్యుడు

శ్లో॥ *అభుక్త్వామలకం పథ్యం*
*భుక్త్వా తు బదరీఫలమ్,*
*కపిత్థం సర్వదా పథ్యం*
*కదళీ న కదాచన.*

భోజనం చేయకమునుపు అంటే పరగడుపున ఉసిరికాయను, భోజనానంతరం రేగుపండును భుజించాలి. వెలగపండు ఎప్పుడైనా తినదగినదే! అరటిపండు ఎప్పుడూ తినరాదు. (అరటిపండును దేనితోనయినా చేర్చి తినాలి.)

శ్లో॥ *గీతే వాద్యే తథా నృత్తే*
*సంగ్రామే రిపుసంకటే,*
*ఆహారే వ్యవహారేచ*
*త్యక్తలజ్జ స్సుఖీ భవేత్!*

పాటపాడేటప్పుడు, మృదంగాది వాద్యాలను వాయించేటప్పుడు, నాట్యం చేసేటప్పుడు, శత్రువులు చుట్టుముట్టేటప్పుడు, యుద్ధం చేసేటప్పుడు, భోజనం చేసే సమయంలోనూ, వ్యవహారంలోనూ సిగ్గు పడకూడదు.

❖ దురలవాట్లు మొదట్లో సాలెగూళ్ళలా మెత్తగా ఉంటాయి. తర్వాత అవే ఇనుపగొలుసులై బాధిస్తాయి.

❖ పక్షిలా గాలిలో ఎగరడం, చేపలా నీటిలో ఈదడం మనిషి నేర్చుకున్నాడుగాని, భూమి మీద మనిషి, మనిషిలా జీవించడాన్ని తెలుసుకోలేకపోతున్నాడు.

❖ కెరటాలు కాళ్ళదగ్గరకు వచ్చాయని సముద్రాన్ని చులకనగా చూడడం ఎంత అవివేకమో, సహనం వహిస్తున్నారుకదా అని ఉత్తములను తక్కువగా అంచనా వేయడమూ అంతే అవివేకం.

❖ *అకాల మేఘవద్విత్త మకస్మాదేతి యాతి చ!*
సంపద అకాలమేఘం మాదిరిగా ఆకస్మాత్తుగా వస్తుంది. పోతుంది.

❖ *అకించనః సుఖం శేతే!*
దరిద్రుడు సుఖంగా నిద్రపోతాడు.

❖ *ఆచార్యాణాం శతం పితా.*
తండ్రి, వందమంది ఆచార్యులతో సమానం.

❖ *ఏకస్తపో ద్విరధ్యాయీ త్రిభిర్గీతం చతుఃపథమ్!*
ఒంటరిగా తపస్సు చెయ్యాలి. ఇద్దరు కలసి చదవాలి. ముగ్గురు కలసి గానం చెయ్యాలి. నలుగురు కలసి ప్రయాణం చెయ్యాలి.

❖ *దృశ్యమానే భవేత్ప్రీతిః సౌహృదం నాస్త్యవశ్యతః!*
వ్యక్తి కనిపిస్తున్నప్పుడే అతని మీద ప్రీతి కలుగుతుంది. కనిపించక పోతే ప్రీతి నిలబడదు.

*ప॥ తనువులస్థిరమని, ధనములస్థిరమని*
*తెలుపగలడు, తాను తెలియలేడు*

*చెప్పవచ్చుపనులు చేయుట కష్టమౌ*
*విశ్వధాభిరామ వినురవేమ!*

ఈ శరీరం నిలబడదు. ఈ డబ్బు ఉండదు అని చెప్పడం తేలిక. ఆ సంగతి తనకు తాను తెలుసుకోలేడు. పనులు చెప్పడం సులభం, చేయడమే కష్టం అంటాడు వేమన.

ప॥ *కప్పురంబు పాది, కస్తూరి ఎరువులో*
*ఉల్లినాటి, నందనోదకంబు*
*పోసి పెంప, కంపు పోనట్లు ఖలుడుండు*
*విశ్వధాభిరామ వినుర వేమ!*

ఉల్లికి ఉన్న వాసన పోదు. మూర్ఖుని గుణం మారదు. కప్పురపుపాదు, కస్తూరి ఎరువు వేసి, ఉల్లిని నాటి, నంద నోదకం పోసినా ఉల్లి కంపుపోదు. అలాగే మూర్ఖుడు మారడు అంటాడు వేమన.

ప॥ *నరుడు మెచ్చనేని నారాయణుడు మెచ్చు*
*దీనులందు దేవ దేవుడుండు*
*మానవార్చనంబె మాధవార్చనమురా*
*లలిత సుగుణజాల, తెలుగుబాల!*

*–కరుణశ్రీ*

సాటి మానవుణ్ణి మెచ్చుకోవాలి. సానుభూతి చూపాలి. దీనులపట్ల దయకలిగి ఉండాలి. దేవుడు ఎక్కడో లేడు, దీనులలోనే ఉన్నాడు. మానవత్వం కలిగి ఉండడమే అసలయిన దైవారాధన. దీనుల్ని ఆదుకోవడమే దైవత్వం.

❖ వండలేని అక్కకు వగవులు మెండు! తేలేని అన్నకు తిండి మెండు!

-సామెత

ప॥ *వండగ నెండిన దొక్కటి*
*వండక మరి పచ్చిదొకటి మడి కాలినదిన్*
*తిండికి రుచియై యుండును*
***మండలమున జనులకెల్ల మహిలో వినుమా!***

-పొడుపుపద్యం

సమాధానం: వక్క-ఆకులు-సున్నం.

శ్లో॥ ***ఋణానుబంధ రూపేణ పశుపత్నీ సుతాలయః***
***ఋణక్షయే క్షయం యాంతి కా తత్ర పరివేదనా?***
ఋణానుబంధం ఉన్నంతవరకే భార్య, సంతానం, ఇల్లు, పశువులు ఉంటాయి. ఆ బంధం తీరిపోగానే అవన్నీ నశించి పోతాయి. దానికి బాధదేనికి?

శ్లో॥ ***కీటోపి సుమనః సంగాత్ ఆరోహతి సతాం శిరః,***
***అశ్మాపి యాతి దేవత్వం మహద్భిః సుప్రతిష్ఠితమ్!***
పురుగుకూడా పువ్వు కారణంగా మహాత్ముల శిరసును అధి రోహిస్తుంది. బండరాయి కూడా మహాత్ములచే ప్రతిష్ఠింప బడి, దేవుడిగా మారుతోంది.

శ్లో॥ *హృది ప్రాణో గుదే పానః సమానో నాభి సంస్థితః*
***ఉదానః కంఠదేశస్థో వ్యానః సర్వశరీరగః!***

హృదయంలో ప్రాణం, గుదంలో అపానం, నాభిలో సమానం, కంఠంలో ఉదానం, శరీమంతటా వ్యాపించి వ్యానం... పంచప్రాణాలూ ఉంటాయి.

శ్లో॥ *మర్దలస్తు నితరా మచేతనః, తన్ముఖాదపి ధనం ధనం ధనం!*
*ఇత్థమేవ నినదః ప్రవర్తతే, కింపునర్యది జనస్సచేతనః!*
ప్రాణంలేని మద్దిలే ధనం ధనం ధనం అని అరుస్తోంటే, ప్రాణం ఉన్న మానవుడు ధనం ధనం అని ఏడవడంలో ఆశ్చర్యం ఏముంది?

ప॥ *చాటున రతి, దిట్టతనము, సమయమెరిగి*
*సేకరించు, టొరుల విశ్వసింపకుండట,*
*ఏమరక యుండుటయు ననగ ఏను గుణము*
*లెరుక పరచు మనకు కాకి గురువు వోలె!*

*–చాణక్యుడు*

చాటుగా రతికార్యం చేయడం, మొండితనం, సమయాను కూలంగా సంపాదించడం, ఇతరులను నమ్మకపోవడం, ఎప్పుడూ జాగ్రతగా ఉండడం అన్నవి కాకి మనకు అందించే అయిదుగుణాలు.

❖ భార్యలు యువకులకు గృహిణులు. మధ్య వయస్కులకు స్నేహితులు. వృద్ధులకు నర్సులు.

*–ఫ్రాన్సిస్ బేకన్*

❖ తెలివితేటలు, మేధ, ప్రతిభ హత్యలాగే ఎప్పటికయినా బట్టబయలు కాకతప్పదు.

*–సి. సిమ్మన్స్*

❖ నమ్మకంతో సేవకునికి రహస్యాలు చెప్పడం అంటే...క్రమంగా అతన్ని యజమానిగా మార్చుకోవడమే అవుతుంది.

-డ్రైడన్

❖ ధనవంతుడు కావటానికీ, బీదవాడు కావటానికీ రెంటికీ యవ్వనమే సరయిన సమయం.

❖ తానేమి కోల్పోయాడో ప్రతివ్యక్తీ తన యాభయ్యవపడిలో తెలుసు కుంటాడు.

-జార్జ్ ఆర్వెల్

❖ గడ్డీ గాదమూ లేని చోట నిప్పురవ్వ పడితే దానికదే చల్లారి పోతుంది. అలాగే క్షమలేనివాడు, ఇతరుల మీద దోషాలు ఆరోపిస్తే, చివరికి వాడి మీదే పడతాయవి. ధర్మం ఒక్కటే శ్రేయస్సు కలిగిస్తుంది. క్షమ ఒక్కటే శాంతి కలిగిస్తుంది. చదువు ఒక్కటే తృప్తి కలిగిస్తుంది. అహింస ఒక్కటే సుఖం కలిగిస్తుంది. పుట్టలో ఉండే అల్పజీవులను పాము మింగే సేటట్టు, యుద్ధం చెయ్యని రాజులనూ, తీర్థయాత్రలు చెయ్యని బ్రాహ్మణులనూ భూమి మింగేస్తుంది. పరుషంగా మాట్లాడకపోవడమూ, అయోగ్యులను గౌరవించకపోవ డమూ... ఈ రెండూ చేసేవాడు లోకంలో ఉత్తముడు అనిపించుకుంటాడు.

-విదురుడు

❖ కామత్యాగం ఎనిమిది గుణాలతో ఉంటుంది. ఆ గుణాలు... 1. సత్యం: నిజమే చెప్పడం. 2. ధ్యానం: ధ్యానించడం. 3.

సమాధానం: పరమాత్మలో మనస్సు లీనం చెయ్యడం. 4. చోద్యం: నేనెవరిని? ఎక్కణ్ణుంచి వచ్చాను? ఏమి చేస్తాను? యథార్థం తెలుసుకోవడానికి తనలో తాను చర్చించుకోవడం. 5. వైరాగ్యం: ఐహికసుఖాలూ, స్వర్గాది ఆముష్మికసుఖాలూ కోరకపోవడం. 6. అస్తేయం: దొంగతనం లేకపోవడం. 7. బ్రహ్మచర్యం: మైథున వ్యాపారం మనసా కూడా లేకపోవడం. 8. అసంగ్రహం: భార్య, బిడ్డలు, సిరిసంపదలు... ఇలాంటివి కూడబెట్టుకోవాలని ఆసక్తి లేకపోవడం.

*–సనత్సుజాతుడు*

❖ పట్టరాని ఏనుగులకూ, తాచులకూ, పక్షులకూ కట్టుళ్ళు సంభవిస్తాయి. సూర్యచంద్రులను రాహుకేతువులు పట్టేస్తారు. పండితులకు దారిద్ర్యం పట్టుకుంటుంది. అంతా చూడగా దైవమే బలీయం అనిపిస్తోంది.

*–భర్తృహరి*

❖ పుస్తకాలు జీవితాన్ని సమగ్రంగా దర్శింపజేసే సాధనాలు.

*–వివేకానంద*

*శ్లో॥ క్రోధో వైవస్వతో రాజా*
*ఆశా వైతరణీ నదీ,*
*విద్యా కామదుఘా ధేనుః*
*సంతోషో నందనం వనమ్.*

కోపం యమధర్మరాజుతో సమానమయినది. ఆశ యమలోకం మార్గంలో ఉండే వైతరణినదితో సమానం అయినది.

విద్య కామధేనువుతో సమానం. సంతోషం నందనవనం లాంటిది. ఆనందమైనది.

శ్లో॥ *స్త్రీణాం ద్విగుణ ఆహారో*
*బుద్ధి శ్చాపి చతుర్గుణా,*
*సాహసం షడ్గుణం చైవ*
*కామోష్టగుణ ఉచ్యతే!*

పురుషులకంటే స్త్రీలు రెండింతలు తింటారు. వారి బుద్ధి నాలుగు రెట్లు అధికంగా ఉంటుంది. తెగువ ఆరు రెట్లుంటుంది. కోరికలు ఎనిమిదింతలుగా ఉంటుంది. దానాదీనా స్త్రీ బాగా శక్తిమంతురాలు, నేర్పుగలది.

శ్లో॥ *శైలే శైలే న మాణిక్యం, మౌక్తికం న గజే గజే,*
*సాధవో న హి సర్వత్ర, చందనం న వనే వనే!*

ప్రతిపర్వతంలోనూ రత్నం దొరకదు. ప్రతి ఏనుగులోనూ ముత్యం ఉండదు. ప్రతి అరణ్యంలోనూ చందనవృక్షం ఉండదు. అలాగే సర్వత్రా సజ్జనులు ఉండరు.

శ్లో॥ *నాస్తి మేఘసమం తోయం నాస్తి చాత్మసమం బలమ్,*
*నాస్తి చక్షుఃసమం తేజో నాస్తి ధాన్యసమం ప్రియం!*

*వాననీటితో సమానమయిన మంచినీరు లేదు. ఆత్మబలంతో సమానమయిన బలం లేదు. కంటి వెలుగుకు సమమయిన* వెలుగు లేదు. ఆహారంతో సమానమయిన పదార్థం లేదు.

–చాణక్యుడు

❖ కళ్ళల్లో కళ, వ్యక్తీకరణలో అందం, అక్షరాలలో కాంతి, జీవితంలో ఔన్నత్యం నిరాడంబరత నుంచే వస్తాయి.

–వాల్ట్‌విట్మన్

❖ చెట్టు కూల్చడానికి నాకు ఆరుగంటలు సమయం ఇస్తే, మొదటి నాలుగు గంటలూ రంపం సాన పట్టడానికే ఉపయోగిస్తాను.

–అల్బర్ట్ ఐన్‌స్టీన్

❖ ఓర్పు ఉంటే కవచాలు అక్కరలేదు. కోపం ఉంటే శత్రువులు అక్కరలేదు. దాయాది ఉంటే వేరే నిప్పు అక్కరలేదు. మిత్రుడు ఉంటే సిద్ధౌషధం అక్కరలేదు. దుర్జనుడు ఉంటే సర్పాలు అక్కరలేదు.

–భర్తృహరి

శ్లో॥ *షడ్దోషాః పురుషేణేహ, హాతవ్యా భూతి మిచ్ఛతా,*
*నిద్రా తంద్రా భయం క్రోధః, ఆలస్యం దీర్ఘసూత్రతా.*

బాగుపడాలనుకునే మనిషి అతినిద్ర, బద్ధకం, భయం, కోపం, సోమరితనం, ఎంతకాలానికీ పని తెమలనీయక పోవడం... ఈ ఆరు దోషాలనూ విడచిపెట్టాలి.

శ్లో॥ *ప్రతిమామంత్రతీర్థేషు, దైవజ్ఞే భిషజే గురౌ,*
*యాదృశీ భావనా యత్ర, సిద్ధి ర్భవతి తాదృశి.*

దేవతావిగ్రహం, మంత్రం, పుణ్యతీర్థం, దైవజ్ఞుడు, వైద్యుడు, గురువు... వీరిపట్ల ఎవరికి ఎలాంటి భావం ఉంటుందో వారికి అలాంటి సిద్ధి అంటే అలాంటి ఫలమే కలుగుతుంది.

❖ సంపద ఉప్పునీరులాంటిది. ఎంత తాగితే అంతగా దాహం పెరుగుతుంది.

–గోల్డ్‌స్మిత్

ప॥ *మృగములు మృగముల నడుగవు*
*తగలడుగవు పక్షిజాతి తన సరివారిన్*
*మగవాడడిగిన నియ్యని*
*మగవాడా మగువగాక మహిలో వేమా!*

జంతువులు జంతువుల్ని దానం అడగవు. సహాయం కూడా అర్థించవు. అలాగే పక్షులు తమలో తమకు అన్యాయం జరుగుతున్నదని పంచాయతీపెట్టవు. సాటి మానవుడు అడిగితే, డబ్బు ఉండి కూడా దానం చేయని మనిషి, మగవాడా? మగువతో సమానం అన్నాడు వేమన. ఒకప్పుడు మగవాడు మాత్రమే సంపాదించేవాడు కనుక దానం చేసే అధికారం మగవాడికే ఉండేది.

శ్లో॥ *పండితే వాపి మూర్ఖే వా దరిద్రే వా శ్రియాన్వితే!*
*దుర్వృత్తే వా సువృత్తే వా మృత్యోః సర్వత తుల్యతా!!*

చదువుకున్నవాడు, మూర్ఖుడు, దరిద్రుడు, ధనికుడు, సద్వర్తనుడు, దుర్వర్తనుడు...అందరూ మృత్యువునకు సమానమే!

శ్లో॥ *దుర్మంత్రీ రాజ్యనాశాయ గ్రామనాశాయ కుంజరః*
*శ్యాలకో గృహనాశాయ సర్వంనాశాయ మాతులః*

దుష్టమంత్రి రాజ్యాన్ని నాశనం చేస్తాడు. స్వేచ్ఛగా వదిలేస్తే ఏనుగు, గ్రామాన్నే నాశనం చేస్తుంది. బావమరిదిని ఇంటిలో

పెట్టుకుంటే, వాడు ఇల్లు నాశనం చేస్తాడు. మేనమామను ఆశ్రయించావనుకో సర్వనాశనానికి సిద్ధపడ్డట్టే!

శ్లో॥ *లోకేషు నిర్ధనో దుఃఖీ ఋణగ్రస్తః తతోధికమ్!*
*తాభ్యాం రోగయుతో దుఃఖీ తేభ్యోదుఃఖీ కుభార్యకః!*
లోకంలో డబ్బులేని వాడు దుఃఖిస్తాడు. అతనికంటే అప్పు ఉన్నవాడు ఇంకా దుఃఖిస్తాడు. వీరిద్దరికంటే రోగంతో ఉన్నవాడు మరీ దుఃఖి స్తాడు. ఈ అందరికంటే గయ్యాళి భార్య ఉన్నవాడు మహాదుఃఖితు డవుతాడు.

ప॥ *మాటలాడగలుగు మర్మము లెరిగిన*
*పిన్న పెద్దతనము లెన్నవలదు*
*పిన్నచేతి దివ్వె పెద్దగా వెలుగదా*
*విశ్వదాభిరామ వినురవేమ!*
మర్మం తెలిసి, విజ్ఞతతో మాట్లాడగలిగే నేర్పు ఉంటే చిన్న వాడా? పెద్దవాడా? అని తర్కించడం అనవసరం. చిన్న వాడయితే మాత్రం, వాడు పట్టుకున్న దీపం పెద్దగానే వెలుగు తుందికదా అంటాడు వేమన.

❖ మనిషి దీపమయినా కావాలి. లేదంటే అద్దమయినా కావాలి. దీపం వెలుగునిస్తే, అద్దం ప్రతిబింబిస్తుంది. ప్రతివారూ దీపం కాలేక పోవచ్చు. కనీసం అద్దమయితే చాలు, తనకు తెలిసిన జ్ఞానం మరొ కరికి పంచగలిగితే అదే పదివేలు.

❖ ఏ మంచిని, ఏ నమ్మకాన్ని నువ్వు ఎదుటివారి నుంచి ఆశిస్తు న్నావో, అవి ముందుగా నీ నుండే ప్రారంభం కావాలి.

❖ యజమానికీ నాయకుడికీ తేడా ఒకటే!‘మీరు చేయండి’ అంటాడు యజమాని. ‘మనం చేద్దాం’ అంటాడు నాయకుడు.

❖ గొప్ప లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నించి విఫలం కావడం నేరం కాదు. గొప్ప లక్ష్యం లేకపోవడం నేరం.

❖ తామరాకును తాటాకు చేయడం పాపం.

*–చలం*

❖ విద్యలేనివాడు వింతపశువయితే, కాసులున్నవాడు జాతి పశువు.

*–రావిశాస్త్రి*

❖ సంతృప్తిలేని జీవితానికి శాంతి లేదు. అసంతృప్తిలేని జీవితానికి వృద్ధి లేదు.

*–నార్ల*

❖ తొందరపాటుకన్నా ఆలస్యమయింది లేదు.

*–చర్చిల్*

❖ జ్ఞానార్జన, ధనార్జన, పర్వతారోహణ, కోరికలు నెరవేర్చుకోవడం, ధర్మ పరిపాలన... ఈ అయిదింటిలో తొందరపాటు పనికిరాదు.

*–గరుడపురాణం*

❖ సమాజానికి ఆశావాదులూ, నిరాశావాదులూ ఇద్దరూ అవసరమే! ఆశావాది విమానాన్ని కనిపెడితే, నిరాశావాది పేరాచూట్ కని పెడతాడు.

ప॥ *తన రహస్యము నొకనితో ననియు మరల*
*నితరులకు చెప్పవలదని హెచ్చరించు*
*కంటె చెప్పకయుండుట కరముమేలు*
*నాల్క దాటిన మాటలు నగరు దాటు*

–దువ్వూరి రామిరెడ్డి

మనకు తెలిసిన కొత్త విషయాన్నిగాని, రహస్యాన్నిగాని మరొకరికి చెప్పాలనిపిస్తుంది. చెబుతాం. చెప్పి, ఇది ఎవరితోనూ చెప్పవద్దు, రహస్యం అంటాం. ఆ వ్యక్తీ అంతే! తనకు తెలిసింది ఇంకొకరికి చెప్పి, అదే మాట అంటాడు. ఇలా రహస్యం కాస్త బట్టబయలు అవుతుంది. కాబట్టి రహస్యాన్ని చెప్పకపోవడమే మంచిది. ఎందుకంటే నాలుక దాటిన మాటలు నగరాలు దాటుతాయి. ఇట్టే ప్రచారమవుతాయి.

❖ *విద్యాతురాణాం న సుఖం న నిద్రా!*
విద్యపట్ల ఆసక్తిగలవారు సుఖాన్నీ, నిద్రనీ లెక్కచెయ్యరు.

❖ *భద్రమభద్రం వాకృతమాత్మని ప్రకల్ప్యతే!*
మంచి చేసినా, చెడు చేసినా మనసుకు తెలుస్తూనే ఉంటుంది.

శ్లో॥ ***దాతా దరిద్రః, కృపణో ధనాఢ్యః,***
***పాపీ చిరాయు, స్సుకృతీ గతాయుః,***
***రాజాకులీన, స్సుకులీ చ సేవ్యః,***
***కలౌ యుగే షడ్గుణ మాశ్రయంతి.***

దానబుద్ధిగలవారు బీదవారవడం, ధనవంతులు పిసినిగొట్టు వారవడం, పాపాత్ములు దీర్ఘాయుష్షు కలిగి ఉండడం, పుణ్యాత్ములు అల్పాయుష్షు కలిగి మరణించడం, హీనబుద్ధి గలవారు అధిపతు లవడం, మంచివారు సేవకులవడం...ఈ ఆరుగుణాలూ కలియగంలో ప్రబలంగా కనిపిస్తాయి.

శ్లో॥ *న గచ్ఛే ద్రాజయుగ్మం చ*
*న గచ్ఛే ద్బ్రాహ్మణత్రయమ్,*
*చతు శ్శూద్రా నగచ్ఛేయు*
*ర్న గచ్ఛే ద్వైశ్యపంచకం.*

ఏదయినా పని మీద వెళ్ళేటప్పుడు ఇద్దరు క్షత్రియులు పోరాదు. బ్రాహ్మణులు ముగ్గురుగా పోరాదు. శూద్రులు నలుగురు పోరాదు. వైశ్యులు అయిదుగురు పోరాదు. ఎందుకు పోరాదంటే అలా వెళ్తే వెళ్ళిన పని కాదంటారు.

శ్లో॥ *వేదమూల మిదం జ్ఞానం*
*భార్యామూల మిదం గృహం*
*కృషిమూల మిదం ధాన్యం*
*ధనమూల మిదం జగత్.*

జ్ఞానానికి వేదం ఆధారం. గృహసౌభాగ్యానికి భార్యయే మూలం. ధాన్యలక్ష్మికి సేద్యం జీవగర్ర. లోకానికంతటికీ డబ్బే ప్రధానం.

శ్లో॥ *కృషితో నాస్తి దుర్భిక్షం*
*జపతో నాస్తి పాతకం*

*మౌనేన కలహో నాస్తి*
*నాస్తి జాగరతో భయమ్.*
కష్టించి పని చేసేవారికి దరిద్రం ఉండదు. జపం అంటే దైవధ్యానం చేసుకునేవారికి పాపం అంటదు. మౌనంగా ఉండేవారికి జగడం రాదు. మెలకువకలిగి, అన్నిటినీ కనిపెట్టి ఉండేవారికి భయం అన్నదే లేదు.

❖ ఉత్సాహం ఉంటే సకలసంపదలూ సాధించగలరు. ఉత్సాహమే సుఖం. ఏ కార్యమయినా ఉత్సాహం ఉంటేనే నెరవేరుతుంది. ఉత్సాహం ఉంటే ఎవరెన్ని అడ్డంకులు కలిగించినా పట్టించుకోరు.

*-హనుమంతుడు*

❖ శీలం వలన ధర్మం, ధర్మం వలన సత్యం, సత్యం వలన బలం, బలం వలన ధనం లభిస్తాయి.

❖ బుద్ధిమంతుడు కాలం కలసిరానప్పుడు తాబేలులా ముడుచుకుపోవాలి. కాలం కలసి వచ్చినప్పుడు తాచులా లేచి పగసాధించాలి.

*-పంచతంత్రం*

❖ పువ్వు విరిసి చెడింది. నోరు తెరచి చెడింది.

*-సామెత*

❖ వనం విడచిన పక్షీ, జనం విడచిన మనిషీ ఒక్కటే

*-సామెత*

❖ పగటిమాటలు పనికి చేటు. రాత్రిమాటలు నిద్రకుచేటు.

-సామెత

❖ నవవిధ భక్తిమార్గాలు

**1.** **శ్రవణం:** భగవంతుని లీలలను వినడం. *(పరీక్షిత్తు)*

**2.** **కీర్తనం:** భగవంతుని గుణగుణాలను కీర్తించడం. *(నారదుడు)*

**3.** **పాదసేవనం:** భగవంతునికి పాదసేవచేసి తరించడం. *(లక్ష్మీదేవి)*

**4.** **ఆత్మనివేదనం:** భగవంతునికి చిత్తాన్ని నివేదించడం. *(బలిచక్రవర్తి)*

**5.** **దాస్యం:** సర్వేశ్వరుని తత్త్వమందు దాస్యభావాన్ని కలిగి ఉండడం. *(విదురుడు)*

**6.** **వందనం:** భగవంతునికి నమస్కరించడమే వందనభక్తి. *(ధర్మరాజు)*

**7.** **సఖ్యం:** మనోవాక్కాయలతో భగవతత్త్వానికి ఎప్పుడూ సఖ్యంగా ఉండడం. *(అర్జునుడు)*

**8.** **స్మరణం:** ఎల్లప్పుడూ భగవంతుని నామాన్ని స్మరించడం. *(అజామిళుడు)*

9. అర్చన: భక్తిగా భగవంతుణ్ణి ఆరాధించడం. (కుచేలుడు)

❖ సౌందర్యం ఏమీ ఫలం ఈయదు. కులమూ, శీలమూ, చదువూ, రాజ సేవా ఇవేవీ ఫలమియ్యావు. తపస్సు చేసుకుని,

పూర్వజన్మలో సాధించు కున్న పుణ్యాలే, చిన్నతనంలో పెంచుకున్న వృక్షాల్లా ఫలిస్తాయి.

–భర్తృహరి

❖ **అర్థేషు పానవ్యసనీ న గణ్యతే!**
మద్యపానం పెద్దవ్యసనం. తాగుబోతు ఏ పనీ చెయ్యలేడు. పని చెయ్యనివాడు మనిషి అనిపించుకోలేడు. ఎందుకు అనిపించు కోలేడంటే... తాగితే మత్తు కలుగుతుంది. మత్తు ఎక్కినవాడు ఎలాంటి రహస్యాన్నీ దాచలేడు. ఏదేని కార్యం చెయ్యాలంటే, అది సిద్ధించాలంటే దానికి ప్రధానంగా కావాల్సిన యోగ్యత రహస్యాలు దాచగలగడం. తాగుబోతుకి రహస్యాలు దాచే శక్తి ఉండదు. ఆ శక్తి లేనివాడికి కార్యసిద్ధి కాదు. వ్యసనపరుడు సమయాసమయాలు గుర్తించలేడు. మోతాదుకూడా తెలుసుకోలేడు. కాబట్టి ఆర్థిక విష యాల్లో తాగుబోతుకి ప్రవేశం నిషిద్ధం. ఆ సందర్భంలో అతన్ని మనిషిగా గణించనక్కరలేదు.

–చాణక్యుడు

❖ గాఢారణ్యాలకు పోయినా, వనదుర్గాల్లో బంధించినా, ఎంతెంతలేసి ఆపదలు వచ్చినా ఎలాంటి క్లిష్టపరిస్థితులు ఎదురయినా, మీదికి దూసుకువచ్చి నరకడానికి శత్రువులు కత్తులెత్తినా సత్త్వమూర్తులకు భయం ఉండదు. పూనికా, ఇంద్రియనిగ్రహం, దక్షతా, ఏమరి పాటులేమి, ధైర్యమూ, బుద్ధీ, బాగా ఆలోచించి ఏ పనికయినా సిద్ధ పడడమూ...ఇవి

ఐశ్వర్యానికి మూలకారణాలు. దుర్జనులకు హింసే బలం. గుణవంతులకు క్షమే బలం.

-విదురుడు

శ్లో॥ *లోభశ్చేదగుణేన కిం? పిశునతా యద్యస్తి కిం పాతకైః?*
*సత్యం చేత్తపసా చ కిం? శుచిమనో యద్యస్తి తీర్థేన కిమ్?*
*సౌజన్యం యది కిం బలేన? మహిమా యద్యస్తి కిం మండనైః?*
*సద్విద్యా యది కిం ధనైః? అపయశో యద్యస్తి కిం మృత్యునా?*

-భర్తృహరి

పిసినారితనం ఉంటే వేరే దుర్గుణాలు అక్కర్లేదు. అదొక్కటే నూరు దుర్గుణాలకు సాటి. చాడీలు చెప్పే అవలక్షణం ఒక్కటి ఉంటే, వేరే పంచమహాపాతకాలు చెయ్యనక్కర్లేదు. సత్యసంధత ఒక్కటి ఉంటే, వేరే జపతపాలు ఎందుకు? అక్కర్లేదు. చిత్తశుద్ధీ, మంచిమనసూ ఉంటే తీర్థాలకు వెళ్ళి స్నానాలు చెయ్యాల్సిన అవసరం లేదు. సజ్జనుడికి బలంతో అవసరం లేదు. గొప్పతనమే ఉంటే ఆభరణాలూ, అలంకారాలూ ఎందుకు? చక్కని పాండిత్యం ఉంటే ధనం దేనికి? తేలికగా సంపాదించవచ్చుది. అప్రతిష్ఠతో బతికేవాడికి వేరే చావు ఎందుకు? అలా బతకటం మృత్యువుతో సమానమే కదా!

❖ మతంలోని అసలు మర్మం అంతా ఆచరించడంలో ఉంది గాని, సిద్ధాంతాలలో లేదు. మంచిగా ఉండడం, మంచిని చేయడం ఇదే మతసర్వస్వం.

-వివేకానంద

❖ *నేక్షేతోద్యంత మాదిత్యం*
*నాస్తం యంతం కదాచన,*
*నోపసృష్టం న వారిస్థం*
*న మధ్యం నభ సోగతమ్!*

ఉదయించేటప్పుడు, అస్తమించేటప్పుడు, ఆకాశమధ్య భాగంలో ఉన్న ప్పుడు, ప్రతిసూర్యుడుగా అంటే ప్రతి బింబంగా ఉన్నప్పుడు, నీటిలో ప్రతిఫలించినప్పుడు సూర్యుణ్ణి చూడరాదు.

❖ ఇంటి మీద ధ్యాస ఉంటే చదువురాదు. మాంసం తినే వాడికి దయ ఉండదు. ధనసంపాదన సత్యాన్ని విడచిపెడుతుంది. స్త్రీలపొందు మరిగిన వాడికి శుచీ శుభ్రతలూ ఉండవు.

❖ *ఇంద్రియాణి చ సంయమ్య బకవత్ పండితో జనః*
*దేశ కాల బలం జ్ఞాత్వా సర్వకార్యాణి సాధయేత్!*

*–చాణక్యుడు*

ఆహారం కోసం ఎలా అయితే కొంగ ఏకాగ్రతగా నిరీక్షిస్తుందో అలా విజ్ఞుడు దేశ కాలమాన పరిస్థితులు గమనించి తన సామర్థ్యాన్ని గణించుకుని, సర్వేంద్రియాలనూ నియంత్రించుకుని మరీ ఓపికగా కార్యాన్ని సాధించాలి.

❖ అరచేతిలో వైకుంఠం, కలత నిద్రలో కైలాసం.

❖ ప్రారబ్ధం బాగా లేకపోతే పైబట్టే పామై కరుస్తుంది.

*–సామెతలు*

❖ సాహిత్యం ఒక దేశం యొక్క సజీవజ్ఞాపకం.

–సోల్జినిత్సిన్

❖ స్వేచ్ఛ అంటే అర్థం బాధ్యత. అందుకే అదంటే చాలా మంది భయపడతారు.

–బెర్నార్డ్ షా

శ్లో॥ *హసతా క్రియతే కర్మ, రుదతా పరిభుజ్యతే,*
*దుఃఖదాతా న కో ఉ వ్యస్తి, సుఖదాతా న కశ్చన.*
*స్వకర్మణా భవే ద్దుఃఖం, సుఖం తేనైవ కర్మణా,*
*తస్మాచ్చ పూజ్యతే కర్మ, సర్వం కర్మణి సంస్థితమ్.*

కర్మలను నవ్వుతూ చేసి, వాటిని ఏడుస్తూ అనుభవిస్తాడు మానవుడు. ఈ కర్మలకు దుఃఖదాతా లేడు, సుఖదాతా లేడు. తాను చేసిన పనుల కారణంగానే మానవునికి సుఖదుఃఖాలు సంప్రాప్తిస్తాయి. ఫలితంగానే కర్మను అందరూ పూజిస్తారు. కర్మలోనే సర్వమూ ఉన్న దంటారు.

శ్లో॥ *షట్కర్ణో భిద్యతే మంత్రః, చతుష్కర్ణః స్థిరో భవేత్,*
*తస్మా త్సర్వప్రయత్నేన, షట్కర్ణం వర్జయేత్ సుధీః*

రహస్యం ఇద్దరిలో ఉంటేనే గోప్యంగా ఉంటుంది. మూడవ వాడికి తెలిస్తే లోకానికంతా తెలిసినట్టే! అందుకనే రహస్యాన్ని ఇద్దరిలోనే దాచిపెడతారు బుద్ధిమంతులు.

శ్లో॥ *అవశ్యంభావిభావానాం, ప్రతీకారో భవే ద్యది,*
*తదా దుఃఖైః న లిప్యేరన్, నల రామ యుధిష్ఠరాః.*

–పంచదశి

జరగాల్సింది జరగకుండా ఆపగలగడం మానవమాత్రులకు సాధ్యం కాదు. సాధ్యం కాదుకాబట్టే మహితాత్ములైన నలుడు, రాముడు, ధర్మ రాజాదులు పడరాని కష్టాలు పడ్డారు. చెప్పలేని దుఃఖాన్ని అను భవించారు. లేకపోతే రాజాధి రాజులు, వారికి కష్టాలేమిటి? దుఃఖా లేమిటి? అందుకు కారణాలేమిటి?

శ్లో॥ ***ఆత్మాయత్తే గుణగ్రామే, నైర్గుణ్యం వచనీయతా,***
***దైవాయత్తేషు విత్తేషు, పుంసాం కా నామ వాచ్యతా.***

గుణాలు స్వార్జితాలు. సంపదలు దైవదత్తాలు. ఒకడు సద్గుణవంతు డంటే అతనిని గురించి చెప్పుకోవడంలో అర్థం ఉంటుందికాని, ధన వంతుని గురించి చెప్పుకోవడంలో అర్థమూ ఉండదు. ఔచిత్యమూ ఉండదు. దీనిని తెలుసు కున్నప్పుడే లోకం సుఖశాంతుల్ని పొందుతుంది.

శ్లో॥ ***సర్వే యత్ర వినేతారః, సర్వే పండితమానినః,***
***సర్వే మహత్త్వ మిచ్ఛంతి, తద్బృంద మవసీదతి.***

ఎక్కడయితే అందరూ పెత్తనం కావాలని కోరుకుంటారో, ఎక్కడయితే అందరూ తాము పండితులమని అనుకుంటారో, ఏ సంఘంలో సర్వులూ గొప్పవారమని విర్రవీగుతారో ఆ దేశమూ, ఆ సంఘమూ నశిస్తాయి.

❖ ఉపదేశం కన్నా ఉదాహరణ గొప్పది.

–శామ్యూల్ జాన్సన్

❖ ఇతరులకు దైవత్వాన్ని ఆపాదించేందుకు చూపే శ్రద్ధ, మనల్ని మనం ఆ స్థాయికి చేర్చుకునేందుకు చూపించం. ఎంత అవివేకులం!!

*–రోష్ ఫోకాల్డ్*

❖ భార్యాభర్తలిద్దర్నీ కత్తెర అంచులతో పోల్చవచ్చు. విడదీయలేనంతగా ఈ అంచులు రెండూ కలసి ఉంటాయి. తరుచూ వ్యతిరేక దిశలలో సంచరిస్తున్నట్టుగా కనిపిస్తాయి కాని, వాటి మధ్యకు వస్తే దేనినయినా ఎవరినయినా శిక్షిస్తాయి.

*–సిడ్నీ స్మిత్*

❖ ***శత్రుణాపి సూక్తముక్తం న దూషణీయమ్!***

శత్రువు చెప్పినదయినా మంచి మాటను దూషించరాదు.

❖ ***శ్రీమతో హ్యరణ్యాన్యపి రాజధానీ!***

ఐశ్వర్యవంతునికి మహారణ్యం కూడా రాజధానే!

❖ **ఈర్ష్యా భయ క్రోధపరిప్లుతేన, లుబ్ధేన రుగ్దైన్యనిపీడితేన విద్వేషయుక్తేన చ సేవ్యమానం, అన్నం న సమ్యక్పరిపాక మేతి.** ఈర్ష్య, భయం, కోపం, లోభం, రోగం, దైన్యం, ద్వేషం, మనసులో ఉంచుకుని, భోజనం చేయరాదు. అలా చేస్తే ఆ తిన్నది జీర్ణం కాదు సరి కదా, విషతుల్యమవుతుంది. భోజనం ఎప్పుడూ నిర్మలమయిన మనస్సుతో నిశ్చింతగా, సంతోషంగా చెయ్యాలి.

❖ *భుంజానో న బహు బ్రూయాత్, న నిందేదపి కంచన,*
*జుగుప్సితకథాం నైవ శృణుయాదపి వా వదేత్!*

భోజన సమయంలో అధికంగా మాట్లాడరాదు. పరనిందా ప్రసంగం అసలు చేయరాదు. అసహ్యాకరమయిన కథాప్రసంగాలు తప్పు. అలాంటివి చేయకూడదు, వినకూడదు.

❖ *కర్తా కారయితా చైవ, ప్రేరక శ్చానుమోదకః,*
*సుకృతే దుష్కృతే చైవ, చత్వార స్సమభాగినః.*

చేసేవాడు, చేయించేవాడు, ప్రేరేపించేవాడు, అమోదించేవాడు... ఈ నలుగురూ పుణ్యపాపకార్యాలన్నిటా సమభాగులే!

ప॥ *కారుకారు గురులు కాగుణింతము చెప్ప*
*శాస్త్రపాఠములను చదివిచెప్ప*
*ముక్తిదారి చూపు మూలము గురుడురా*
*విశ్వదాభిరామ వినురవేమ!*

కా గుణింతము చెప్పినంత మాత్రాన గురువులు కారు. వ్యాకరణాది శాస్త్రాలు చదివి చెప్పిన వారు కూడా గురువులు కారు. మరి ఎవరు గురువులంటే...మోక్షానికి మార్గదర్శనం చేసే మహాత్ముడే నిజమైన గురువు.

❖ *అధ్వా జరా మనుష్యాణాం అనధ్వా వాజినాం జరా!*
*అమైథునం జరా స్త్రీణాం అశ్వానాం మైథునం జరా!*

శక్తికి మించిన కాలినడక మనుషులను ముసలివాళ్ళను చేస్తుంది. పరిగెత్తకుండా ఉంటే గుర్రానికి ముసలితనం

సంప్రాప్తిస్తుంది. పురుషసంపర్కం లేని స్త్రీలు తొందరగా ముసలివారయితే, చిత్రంగా దాంపత్యక్రీడ గుర్రానికి ముసలి తనాన్ని తెచ్చిపెడుతుంది.

ప॥ నవ్వవు జంతువుల్, నరుడు నవ్వును, నవ్వులు చిత్తవృత్తికిన్
దివ్వెలు, కొన్ని నవ్వులెటుతేలవు, కొన్ని విషప్రయుక్తముల్,
పువ్వులువోలె ప్రేమరసమున్ వెలిగ్రక్కు విశుద్ధమైనవే
నవ్వులు, సర్వ దుఃఖ శమనంబులు, వ్యాధులకున్ మహౌ
షధుల్!

–జాషువా

జంతువులు నవ్వవు, మనిషే నవ్వుతాడు. మనసును వెలిగించేవి నవ్వులు, అయితే కొన్ని నవ్వులు ఎటూ తేలవు. మంచో చెడో తెలియ జేయవు. కొన్ని నవ్వులు విషంతో సమానం. ప్రేమతో నవ్విన నవ్వులే నవ్వులు. పువ్వుల్లాంటివవి. సర్వదుఃఖాలనూ పోగొట్టేవి నవ్వులే, అలాగే రోగాలకు గొప్ప ఔషధాలు కూడా నవ్వులే!

ప॥ *అత్యంబు పానా దతి మైథునాచ్చ*
*దివాస్వపాత్ జాగరణాచ్చరాత్రౌ*
*విధారణాత్ మూత్రపురీషాణాచ్చ*
*షడ్భిః మనుష్యైః ప్రభవన్తి రోగాః*

మితంగా నీరు తాగడం, సమయాసమయాలు తెలియక నీరు తాగడం, అతిసంభోగం, పగటిపూట నిద్ర, రాత్రివేళ

మేల్కొని ఉండడం, మూత్ర పురీషాలను బిగబట్టి ఉండడం... ఈ ఆరింటి కారణంగా రోగాలు వస్తాయి.

❖ అత్యంత ఆనందాన్ని కలిగించే ఉద్యోగం లేదా ఉపాధిని ఎన్నుకోగలిగితే జీవితంలో ఒక్కరోజు కూడా 'పని' చేయాల్సిన అవసరం ఉండదు.

❖ మీ అనుమతి లేకుండా మిమ్మల్ని ఎవరూ కించపరచలేరు.

❖ ఓర్పు చేదుగానే ఉంటుంది కాని, దాని ఫలం చాలా మధురంగా ఉంటుంది.

ప॥ ***శ్రుతులభ్యాసము చేసి, శాస్త్రగరిమల్ శోధించి, తత్త్వంబులన్ మతినూహించి, శరీరమస్థిరము, బ్రహ్మంబెన్న సత్యంబు గాం చితి మంచున్ సభలన్ వృథా వచనముల్ చెప్పంగనే కాని, ని ర్జిత చిత్తస్థిర సౌఖ్యముల్ తెలియరో శ్రీకాళహస్తీశ్వరా!***

వేదాలూ, శాస్త్రాలూ బాగా చదివామంటారు. వాటిని క్షుణ్ణంగా పరి శీలించామంటారు. భగవంతుని తత్వాన్ని తర్కించి ఆవిష్కరించా మంటారు. ఈ శరీరం నిత్యం కాదనీ, బ్రహ్మపదార్థమే సత్యమనీ గ్రహించామంటూ ఉపన్యాసాలు ఇస్తారు. అయితే ఈ ఉపన్యాసాలు ఇచ్చిన వారెవరూ నిత్యజీవితంలో వారు చెప్పేదేదీ ఆచరించరు. మనసుని స్వాధీనం చేసుకోరు. శాశ్వతసుఖాన్ని ఇచ్చే వాటిని గ్రహించలేరు. మనసుని జయించలేనివాడు, పెద్దపండితునిలా గంభీర ఉపన్యాసాలు ఇవ్వడం దేనికి? అంటాడు ధూర్జటి.

❖ మాటలు ఈటె పోట్లకన్నా పెను బాధాకరమయినవి. గొడ్డలితో చెట్టును నరికితే, కొంత కాలానికి అది చిగురిస్తుందేమోకాని, మాటలు పడినవాడు ఎంత కాలమ్మైనా ఆ బాధను మరచిపోడు. మరచిపోలేడు.

❖ ఏ పని జరగాలన్నా డబ్బు ముఖ్యం. డబ్బు ఉన్నవాడు పెద్దగా ప్రయత్నించకుండానే ఎంతటి కార్యాన్నైనా సాధించ గలడు.

శ్లో॥ *ఆతురే నియమోనాస్తి*
*బాలే వృద్ధే తథైవచ,*
*సదాచారరతే చైవ*
*హ్యేష ధర్మ స్సనాతనః*
రోగంతో బాధపడేవానికీ, బాలునికీ, ముసలివానికీ, చక్కగా ఆచా రాన్ని పాటించేవానికీ నియమాలు అంటూ ఏమీ ఉండవు. ఇది పెద్దలు చెప్పిన మాట.

శ్లో॥ అంధే తమసి వార్ధక్యే దండం దశగుణం భవేత్!
గుడ్డితనం, చీకటి, ముసలితనం వేళ చేతిలో కర్ర ఉంటే పది రెట్లు బలాన్ని పుంజుకోవచ్చు.

శ్లో॥ *ఉష్టః శశంస గార్గ్యస్తు*
*శకునం తు బృహస్పతిః*
*మనోదృఢం తు మాండవ్యః*
*విప్రవాక్యం జనార్దనః*

ఏదైనా ఒక పని ప్రారంభించేందుకుగాని, ఎక్కడికైనా బయ ల్దేరేందుకుగాని ఉషఃకాలం(అంటే సూర్యోదయానికి ముందు పొద్దు) శ్రేష్ఠమంటాడు గార్గ్యముని. శకునం ప్రధానం అంటాడు బృహస్పతి. దానిని జాగ్రతగా చూసుకోవా లంటాడు. అనుకున్న పని అయితీరుతుందన్న మనోబలం చాలంటాడు మాండవ్యముని. పరిశుద్ధులైన బ్రాహ్మణుని మాటను అనుసరించాలంటాడు కృష్ణుడు.

❖ పనిచేసే వాడికి పరికరాలు ప్రధానం కాదు, దీక్షా, ఏకా గ్రతా ప్రధానం కావాలి.

–శ్రీపాద

*ప॥ వాసన లేని పువ్వు, బుధ*
*వర్గములేని పురంబు, నిత్య వి*
*శ్వాసము లేని భార్య, గుణ*
*వంతుడుగాని కుమారుడున్, సద*
*భ్యాసము లేని విద్య, పరి*
*హాస ప్రసంగములేని వాక్యమున్,*
*గ్రాసములేని కొల్వు కొరగానివి.*

*–పెమ్మయసింగధీమణి శతకం*

❖ పవర్(అధికారం)కి ఒక విధమైన పరిమళం ఉంటుంది. సిరి సంపదలకీ ఒక విధమైన సువాసన ఉంటుంది. ఈ రెండూ తరుచూ కలుస్తాయి.

*–రాచకొండ*

ప॥ రామనామ జపముచే మున్ను వాల్మీకి
పాపి బోయడయ్యు బాపడయ్యె
కులము ఘనము కాదు, గుణమె ఘనమ్మురా
విశ్వదాభిరామ వినుర వేమ.

–వేమన

పాపాత్ముడు, బోయ అయిన వాల్మీకి రామనామజపం చేసి, గతంలో బ్రాహ్మణుడు అయ్యాడు. బ్రాహ్మణుడయ్యేందుకు కులం కాదు ముఖ్యం, గుణం అంటాడు వేమన.

❖ వేయి వరహాలు పెట్టి ఏనుగుని కొన్నవాడు, అరవీసం పెట్టి అంకుశం కొనడానికి పాలు మానుకున్నాడా?

❖ వగలమారి వంకాయ సెగ తాకగానే సగమైంది.

❖ పెద్ద ఇంటి రంకూ, పెద్ద మనిషి బొంకూ తెలియవు.

–సామెతలు

❖ శరీరానికి వ్యాయామం ఎలాంటిదో, మనసునకు చదువు అలాంటిది.

–రిచెర్డ్ స్టీల్

❖ మూఢనమ్మకాలకూ, కరకుగా ఉండడానికీ భయమే మూలం. భయాన్ని అధిగమించడమే జ్ఞానసముపార్జనకు తొలిమెట్టు.

–బెట్రాండ్ రస్సెల్

❖ నువ్వేం చెయ్యాలని కలగంటున్నావో, ఆ పనిని వెంటనే మొదలుపెట్టు. సాహసంలో ప్రతిభ ఉంది. శక్తి ఉంది. మంత్రమహిమ ఉంది.

–గోథె

శ్లో॥ *అస్థిరం జీవనం లోకే, అస్థిరే ధనయౌవనే,*
*అస్థిరాః దారపుత్రాది, ధర్మకీర్తిద్వయం స్థిరమ్.*

*–నీతిశాస్త్రం*

ఈ లోకంలో జీవితం అస్థిరం. అలాగే డబ్బు, యౌవనం, భార్యాబిడ్డలు... అన్నీ అస్థిరాలే! స్థిరమైనవి రెండే, ధర్మమూ, కీర్తి.

శ్లో॥ *అలసస్య కుతో విద్యా, అవిద్యస్య కుతో ధనమ్,*
*అధనస్య కుతో మిత్రం, అమిత్రస్య కుతః సుఖమ్.*

*–పంచతంత్రం*

సోమరికి విద్య పట్టుబడదు. విద్యలేని వాడికి డబ్బు రాదు. డబ్బు లేని వాడికి మిత్రులు ఉండరు. మిత్రులు లేని వాడికి సుఖం ఎక్కడిది?

శ్లో॥ *చింతనీయా హి విపదా, మాదావేవ ప్రతిక్రియా,*
*న యుక్తం కూపఖననం, సందీప్తే వహ్నినా గృహే!*

*–ఆర్యధర్మ*

ఆపదలకు ప్రతిక్రియను ముందుగానే ఆలోచించుకోవాలి. అంతేగాని, ఇల్లు తగలబడుతోంటే, నూతిని తవ్వడానికి ప్రయత్నించడం బుద్ధిమంతుల లక్షణం కాదు.

శ్లో॥ *క్రోధో వైవస్వతో రాజా, ఆశా వైతరణీ నదీ,*
*విద్యా కామదుఘా ధేనుః, సంతోషో నందనం వనమ్!*

*–కవితారత్నాకరం*

క్రోధమే యమధర్మరాజు. ఆశ వైతరణీనదిలాంటిది. విద్య కామధేనువు. సంతోషమే నందనవనం.

శ్లో॥ *కుచేలినం దంతమలాపహారిణం,*
*బహ్వాశినం నిష్ఠుర వాక్యభాషిణమ్,*
*సూర్యోదయేచాస్తమయేచ శాయినమ్,*
*విముంచతి శ్రీరపి చక్రపాణిమ్.*

మురికిగుడ్డలు ధరించేవాణ్ణీ, పళ్ళు శుభ్రంగా తోముకోనివాణ్ణీ, తిండిపోతునీ, కఠినంగా మాట్లాడేవాణ్ణీ, ప్రాతఃకాలంలోనూ, సాయంత్రం వేళలా నిద్రపోయేవాణ్ణీ లక్ష్మీదేవి విడచిపెడుతుంది. ఈ గుణాలు విష్ణుమూర్తికి ఉన్నా అతని నుంచి కూడా లక్ష్మి తొలగిపోతుంది. అంటే ఈ గుణాలు దరిద్రాన్ని కలిగిస్తాయి అని అర్థం.

శ్లో॥ *ఆయుః కర్మ చ విత్తం చ, విద్యా నిధన మేవ చ,*
*పంచైతా న్యపి సృజ్యంతే, గర్భస్థ స్యైవ దేహినః*

*–హితోపదేశం*

ఆయుష్షు, వృత్తి, ధనం, విద్య, చావు...ఈ అయిదూ జీవి గర్భస్థుడై ఉండగానే నిర్ణయమైపోతాయి.

శ్లో॥ *పుత్రపౌత్రవధూభృత్యై, రాక్రాంత మపి సర్వతః*
*భార్యాహీనం గృహస్థస్య, శూన్యమేవ గృహం భవేత్.*

ఇల్లు, పుత్రులు, పౌత్రులు, కోడళ్ళు, సేవకులు ఇంకా అనేక మందితో ఇల్లు నిండిపోయినా భార్య లేని ఆ ఇల్లు, గృహస్థునికి శూన్యంగానే ఉంటుంది.

శ్లో॥ *అస్థాస్వాస్థ్యే యది స్యాతాం, మేధయా కిం ప్రయోజనమ్,*
*తే ఉభే యది న స్యాతాం, మేధయా కిం ప్రయోజనమ్.*

పట్టుదల, ఆరోగ్యం ఈ రెండూ ఉంటే పెద్దగా తెలివితేటలు అక్కర్లేదు. ఆ రెండూ లేని క్షణంలో తెలివితేటలు ఉండి మాత్రం ప్రయోజనం ఏముంది?

❖ జీవితంలో ఎన్నిసార్లు ఓడినా గెలిచేందుకు మరో అవకాశం ఉంటుంది.

❖ చదువు అంటే మనకి కావాల్సింది తెలుసుకోవడం. జ్ఞానం అంటే మనకి అక్కరలేని దానిని వదలిపెట్టడం.

❖ వివేకులు సంతోషంగా జీవిస్తారు. సామాన్యులు సంతోషం కోసం పాకులాడతారు.

శ్లో॥ *విచిత్రం చారిత్రం తవ ఖలు మురారే! మమ పునః*
*ననిద్రా యత్కించిత్ భవతి మశకస్యైవ నినదాత్!*
*కథం నిద్రాసి త్వం? శయన భుజగోచ్ఛ్వాస రభసైః*
*విధే ర్వేదోద్ఘోషైః ప్రబలతర ఘోషైశ్చ జలధేః!!*

మురారీ! నీ చరిత్ర చాలా చిత్రంగా ఉంది. చిన్న దోమ చెవి దగ్గర రొద చేస్తేనే మాకు నిద్రపట్టదు కదా! మరి నీకు ఒక పక్క వేయి తలల పాము బుసలు, మరో పక్క బ్రహ్మదేవుని వేదఘోష, ఇంకో పక్క సముద్రఘోష, ఈ మధ్యలో నువ్వెలా నిద్రపోతున్నావయ్యా!?

శ్లో॥ శీఘ్రీ గీతీ శిరః కంపీ యథా లిఖిత పాఠకః
అనర్థజ్ఞో ఽ ల్పకంఠశ్చ షడేతే పాఠకాధమా!
తొందరగా చదవడం, మూలుగుతూ చదవడం, తల ఆడిస్తూ చదవడం, రాస్తూ చదవడం, అర్థజ్ఞానం లేకుండా చదవడం, నీరసంగా చదవడం... ఈ ఆరూ అధమపాఠకుని లక్షణాలు.

❖ దాతృత్వం, మృధుమధురంగా మాట్లాడడం, ధైర్యగుణం, మంచి చెడులు తెలిసి ఉండడం... ఈ నాలుగూ పుట్టుకతో రావాల్సిన లక్షణాలు. నేర్చుకుంటే వచ్చేవి కావు.

శ్లో॥ గాత్రం సంకుచితం, గతర్విగళితా, భ్రష్టాచ దంతావళిః
దృష్టిర్నశ్యతి, వర్ధతే బధిరతా, వక్త్రంచ లాలాయతే!
వాక్యం నాద్రియతేచ బాంధవ జనైః, భార్యా నశుశ్రూయతే
హా కష్టం! పురుషస్య జీర్ణవయసః, పుత్రోప్యమిత్రాయతే!!
శరీరం ముడుతలు పడింది. నడక తూలుతున్నది. పళ్ళూడి పోయాయి. దృష్టి మందగించింది. చెవుడు పెరుగుతోంది. నోటి నుంచి చొంగ కారుతోంది. బంధువులు ఎవరూ మాట పట్టించుకోవట్లేదు. భార్య మాట వినడం లేదు. ఆహా! మానవునికి వార్ధక్యం ఎంత కష్టం? కొడుకు కూడా శత్రువుగా మారిపోతున్నాడే!!

ప॥ ధారుణి నెయ్యదియైన వి
చారము వెలిగాగ తొడరి సాహస కృత్యం
బూరక ఎవ్వడు చేయును
ఆరయ, వాడొందు నపజయంబును నెపుడున్

–పంచతంత్రం

జీవితంలో సాహసం చాలా అవసరం. అయితే ఆ సాహసం ఎప్పుడు చేయాలన్నది పంచతంత్రం ఇలా పేర్కొన్నది. సాహసం చేసే ముందు ఆ సాహసం మనకు ఉచితమేనా? మేలు కలిగిస్తుందా? అన్న విచక్షణ ఉండాలి. అది లేకుండా చేసే సాహసం వ్యర్థం. అంతేకాదు, అలాంటి సాహసం అపజయాన్ని కూడా కలిగిస్తుంది.

ప॥ **భూతహితంబుగా పలుకు బొంకును సత్యఫలంబునిచ్చు, త**
**ద్భూత భయాస్పదంబగు ప్రభూతపు సత్యము బొంకునట్లు, ప్రా**
**ణాతురడైనచో పరిణయంబున యందును పల్కుబొంకు స**
**త్యాతిశయంబు యండ్రు, మహితాత్మక! ఇట్టివి ధర్మసూక్ష్ముల్.**

ఎప్పుడు నిజం చెప్పాలి? అబద్ధం అసలు చెప్పకూడదా? చెబితే అబద్ధం ఎప్పుడు చెప్పవచ్చు? అనే ధర్మసందేహాలకు ఎట్టిన జవాబు ఇది.

అబద్ధం చెప్పకూడదు. అందులో అనుమానం లేదు. అయితే మేలు కలిగించే అబద్ధం చెప్పడం వల్ల నిజం చెప్పినంత ఫలితం లభిస్తుంది. నువ్వు చెప్పేది నిజమే కావచ్చు, కాని దాని వల్ల ప్రాణులకి భయాన్నీ, కీడునీ కలిగిస్తే అది అబద్ధంతో సమానమే! ప్రాణభయంలోనూ, వివాహసమయంలోనూ అబద్ధం ఆడడం నిజంతో సమానం.

❖ రకరకాల పక్షులు ఒక చెట్టు మీద నివసిస్తాయి. నిద్రిస్తాయి. తెల్లవారగానే తలా ఓ దారినా పోతాయి. కలసిపోవడం, విడిపోవడం మామూలే! దానికి చింతించడం అనవసరం.

–చాణక్య

- ❖ మూరెడు పొంగటం ఎందుకు? బారెడు కుంగటం ఎందుకు?
- ❖ సంపదలో మరపులు, ఆపదలో అరుపులు.
- ❖ తాడు అని ఎత్తి పారవేయనూ కూడదు. పాము అని దాటనూ కూడదు.

-సామెతలు

- ❖ సాయంకాలం నమ్మరాని వాడింటికి వెళ్ళకూడదు. రచ్చసా వళ్ళలో, రాత్రులు ఒక్కడూ రహస్యంగా ఉండకూడదు. రాజుగారి ప్రియురాళ్ళను కామించకూడదు. దురాలోచనలు చేసేవాడి మాయలో పడకూడదు. వాణ్ణి నమ్మకూడదు కూడా. యుక్తిగా మాట్లాడి, వాడి నుంచి తప్పించుకోవాలి. లజ్జావంతుడూ, రాజూ, రంకుటాలూ, రాజోద్యోగీ, కొడుకూ, సోదరుడూ, చిన్నపిల్లలుగల వితంతువూ, సేనలో పనిచేసేవాడూ, అధికారంపోయినవాడూ...వీళ్ళతో ఎలాంటి వ్యవహారమూ పెట్టుకోకూడదు.

-విదురుడు

- ❖ ఒకచోట కటికనేల మీద పడుకోవాల్సి వస్తుంది. మరొక చోట పూలపాన్పు దొరుకుతుంది. ఒకప్పుడు గంజి మెతుకులతోనే కడుపు నింపుకోవాల్సివస్తుంది. మరొకప్పుడు పంచభక్ష్యపరమాన్నాలు దొరుకు తాయి. ఒకప్పుడు గుడ్డపీలికలనే కట్టుకోవాల్సి వస్తుంది. మరొకప్పుడు చీనిచీనాంబరాలు దొరుకుతాయి. మానం కలవాడు ఆ కష్టాలకు కుంగిపోడు, ఈ

సుఖాలకు పొంగిపోడు. కార్యం సానుకూలం కావడమే అతనికి ప్రధానం.

–భర్తృహరి

శ్లో॥ *అహిం నృపం చ శార్దూలం కిటిం చ బాలకం తథా*
*పరశ్వానం చ మూర్ఖం చ సప్త సుప్తాన్ న బోధయేత్!*
పామునీ, రాజునీ, పులినీ, పందినీ, శిశువునీ, పరుల కుక్కనీ, మూర్ఖుణ్ణీ...ఈ ఏడుగురినీ నిద్రిస్తున్నప్పుడు మేల్కొలప కూడదు.

శ్లో॥ *జానీయాత్ప్రేషణే భృత్యాన్, బాంధవాన్ వ్యసనాగమే*
*మిత్రం చాపత్తికాలేషు, భార్యాం చ విభవక్షయే!*
బాధ్యత అప్పగించి సేవకుణ్ణీ, సంకటసమయంలో బంధువులనూ, ఆపత్కాలంలో మిత్రులనూ, సంపదలు పోయినప్పుడు భార్యనూ తెలుసుకోగలం. వారి నిజరూపం అప్పుడే బయటపడుతుంది.

–చాణక్య

❖ కుండకు ఒక్క రంధ్రం ఉంటే చాలు, నీళ్ళన్నీ కారిపోతాయి. అలాగే మనిషి ఒక్క ఇంద్రియాన్ని అదుపు చెయ్యకపోయినా అతని పతనం తథ్యం.

–మనువు

❖ వినడం మూలంగా విజ్ఞానం, మాట్లాడం మూలంగా పశ్చాత్తాపం కలుగుతాయి.

–ఇటలీసామెత

❖ ఎలా బతకాలో నేర్చుకోవడమే పెద్ద కళ

-మాంటేగ్

శ్లో॥ *లోష్టమర్ది తృణచ్ఛేదీ*

*నఖఖాదీ చ యో వరః*

*స వినాశం వ్రజ త్యాశు*

*సూచకో శుచి రేవచ!*

మట్టిపెళ్ళను నలచడం, గడ్డిపోచలను త్రుంచడం, గోళ్ళను కొరకడం, చాడీలు చెప్పడం, పరిశుభ్రంగా లేకపోవడం... చాలా హాని కలిగిస్తాయి. ఈ పనులు చేయకూడదు.

శ్లో॥ *పిబంతి సద్యః స్వయ మేవ నాంభః*

*ఖాదంతి న స్వాదు ఫలాని వృక్షాః,*

*పయోధరా స్సస్య మదంతి నైవ*

*పరోపకారాయ సతా విభూతయః!*

తమ జలాల్ని నదులు తాగడం లేదు. తమ ఫలాలను చెట్లు తినడం లేదు. తమ మూలంగా పండిన పంటను మేఘాలు భక్షించడం లేదు. తమ సంపదను ఇతరుల కోసమే వెచ్చిస్తున్నాయి ఇవన్నీ. ఇలాగే సజ్జనులు, తమ ధనసంపదలను ఇతరుల కోసమే ఉపయోగిస్తారు.

❖ ఈ లోకంలో హాయిగా బతకాలంటే రోగి విందుకు పోకూడదు. అలాగే ఉబ్బసం కలిగిన వాడు దొంగతనానికి పోకూడదు.

❖ కాలం కలిసి వస్తే అన్ని పనులూ చక్కగానే జరుగుతాయి.

❖ పాపానికి మూలం కోపం. కోపం వచ్చినప్పుడు విచక్షణా జ్ఞానం లోపిస్తుంది. దీనికి విరుగుడు ఓర్పే!

శ్లో॥ *యద్ధాత్రా నిజఫాలపట్ట లిఖితం స్తోకం మహద్వా ధనమ్*
*తత్ప్రాప్నోతి మరుస్థలేపి నితరాం మేరౌ చ నాతోధికమ్!*
*తద్ధీరోభవ విత్తవత్సు కృపణాం వృత్తిం వృథా మా కృథాః*
***కూపే పశ్య పయోనిధావపి ఘటో గృహ్ణాతి తుల్యం జలమ్!***

–భర్తృహరి

❖ నీ నుదుటన బ్రహ్మ ఎంత రాశాడో, అంత డబ్బ్బా నువ్వు ఎడారిలో కూర్చున్నా లభించకమానదు. నువ్వు మేరుపర్వతం మీద కూర్చున్నంత మాత్రాన అంతకంటే ఎక్కువా లభించదు. అందువల్ల వాళ్ళనీ వీళ్ళనీ దేబిరించడం అనవసరం. నీకెంత ప్రాప్తం ఉందో అంతే లభిస్తుంది. నీ కుండను తీసుకుని వెళ్ళి బావిలో ముంచినా, సముద్రంలో ముంచినా దానిలోకి కుండెడు నీళ్ళే వస్తాయిగాని, సముద్రం అని ఎక్కువా రావు, బావి అని తక్కువా రావు.

❖ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. అంతరాత్మ తర్వాత ఆరోగ్యానికే ప్రాధాన్యత ఇవ్వాలి. స్వల్పకాలంపాటు జీవించే మనిషికి ఆరోగ్యమే మహాభాగ్యం. దీనిని డబ్బుతో కొనలేరు.

–వాల్టన్

❖ నిందకన్నా పొగడ్త చాలా శక్తివంతమైనది.

–హార్లాక్

శ్లో॥ *దూరదేశ గతే పుత్రే జీవత్యే వాత్ర తత్పితాః*
*విప్రలంభక వాక్యేన మృతం మత్వా ప్రరోదతి!*
*మృతేపి తస్మిన్ వార్తాయాం అశ్రుతాయాం న రోదితిః*
*అతః సర్వస్య జీవస్య బంధకృన్మానసం జగత్!*

–విద్యారణ్యస్వామి

కొడుకు దూరదేశంలో సురక్షితంగా ఉన్నా, అతడు చనిపో యాడని తప్పుడు సమాచారం వస్తే అతని తండ్రి నిజంగానే పుత్రశోకం అనుభవిస్తాడు. అలాగే దూరదేశంలో ఉన్న కొడుకు మృత్యువు వాత పడ్డా, ఆ విషయం తెలియనంత వరకూ పుత్రుడి మరణం అనే యథార్థం తండ్రిని బాధిం చదుగాక బాధించదు. అంటే సర్వజీవులకూ బంధాన్ని కలి గించేది మానసిక ప్రపంచమే కాని మరొకటి కాదని దీని అర్థం.

❖ పెద్దపెద్ద పనుల ప్రణాళికలు తయారు చేస్తూ కూర్చోవడం కంటే చిన్నచిన్న పనులను పూర్తి చేసుకోవడం ఉత్తమం.

–పీటర్ మార్షల్

శ్లో॥ భద్రం భద్ర మితి బ్రూయాత్, బద్ర మిత్యేవ వా వదేత్,
శుష్కవైరం వివాదం చ, న కుర్యాత్ కేనచిత్సహ.

–మనువు

శుభం శుభం అంటూ మంచిమాటనే ఎప్పుడూ పలుకుతూ ఉండాలి. వృథా వివాదాలలోనూ, తగవులలోనూ తల దూర్చకూడదు.

శ్లో॥ *శరీరనిరపేక్షస్య, దక్షస్య వ్యవసాయినః,*
*బుద్ధిప్రారబ్ధకార్యస్య, నాస్తి కించన దుష్కరమ్!*

నేర్పుతో పని చేసేవాడూ, ఒళ్ళు దాచుకోనివాడూ, ఉద్యమ శీలుడూ, తెలివిగా కార్యారంభం చేసేవాడూ సాధించలేని పని అంటూ ఉండదు.

శ్లో॥ *పుస్తకేషు చ యా విద్యా, పరహస్తే చ యద్ధనమ్,*
*సమయే తు పరిప్రాప్తే, నసా విద్యాన తద్ధనమ్!*

*–చాణక్య*

పుస్తకాలలో ఉన్న జ్ఞానం, ఇతరుల దగ్గర దాచిన డబ్బూ ఈ రెండూ సమయానికి పనికిరావు. అంటే జ్ఞానంగానీ, డబ్బుగానీ నీతో పాటే ఉండాలి. ఉంటేనే పనికివస్తాయి.

ప॥ *సాటిలేని కీర్తిని గన్న మేటియైన*
*నల్పమైన దుష్కీర్తిచే హాసితుడగును*
*జగమశేషంబుల వెలిగింప జాలునినుడు*
*చిన్న మబ్బులచేత సంఛన్నుడగును.*

*–చిలకమర్తి*

ఎంత పేరు పొందినా చిన్న చెడ్డపని చేస్తే చాలు, సమాజంలో నవ్వులపాలై, అపకీర్తి పొందడం ఖాయం. సూర్యుడు ఎంత వెలుగు వెలిగినా, ఒక చిన్న మబ్బు అడ్డం వస్తే చాలు, కాంతిని కోల్పోతాడతను. అంటే సత్కీర్తిని పొందిన తర్వాత అపకీర్తి రాకుండా జాగ్రత్త వహించమని హెచ్చరిక.

❖ ఎంగిలికి ఎగ్గు లేదు, తాగుబోతుకి సిగ్గు లేదు.

❖ ఉపవాసం ఉంటే అప్పు తీరదు. ఊపిరితో బొగ్గు పెరగదు.

❖ మనిషికి మనిషీ, చెట్టుకు వేరూ అండ.

–సామెతలు

శ్లో॥ *కోర్థాన్ ప్రాప్య న గర్వితో విషయిణః కస్యాపదోస్తం గతాః*
*స్త్రీభిః కస్య న ఖండితం భువి మనః కో నామ రాజ్ఞాం ప్రియః*

–చాణక్య

సంపదలు పొంది గర్వించినదెవరు? విషయలంపటంలో పడి ఆప దలు కొని తెచ్చుకోనిదెవరు? ఈ లోకంలో స్త్రీల కారణంగా భగ్న హృదయులు కానిదెవరు? యథార్థంగా పాలకునికి ఇష్టుడైనవాడెవరు? యముని దృష్టిని తప్పించు కునేదెవరు? యాచనలో గౌరవం పొందేదెవరు? దుర్మార్గు ల వలలో పడి క్షేమంగా తిరిగి వచ్చేందెవరు? వీటి నుంచి తప్పించుకోవడం మానవమాత్రునికి సాధ్యం కాదు.

శ్లో॥ *మాతా యస్య గృహే నాస్తి, భార్యా చాప్రియవాదినీ*
*అరణ్యం తేన గంతవ్యమ్, యథారణ్యం తథా గృహమ్!*

తల్లిలేని ఇల్లూ, కటువుగా మాట్లాడే భార్యగల ఇల్లూ రెండూ అడవి లాంటివే! అలాంటి ఇళ్ళల్లో ఉండడం కన్నా అరణ్యా వాసమే మేలు అంటాడు చాణక్యుడు.

❖ ప్రతిభ పుట్టుకతో వస్తుందిగాని, బోధనతో రాదు.

–డ్రైడన్

❖ పైకి ప్రయాణించేటప్పుడు కలిసినవాళ్ళతో మంచిగా వ్యవ హరించాలి. కారణం దిగి వచ్చేటప్పుడు మళ్ళీ వాళ్ళని

కలుసుకోవాల్సి ఉంటుంది. అది గుర్తుంచుకోవాలి.

–మిజ్నర్ విల్సన్

❖ పంటినొప్పిని ఓర్పుగా భరించగల తత్త్వవేత్త లేడు.

–షేక్స్పియర్

శ్లో॥ ***విపది ధైర్య మథాభ్యుదయే క్షమా, సదసి వాక్పటుతా యుధి విక్రమః***

***యశసి చాభిరతి ర్వ్యసనం శ్రుతౌ, ప్రకృతిసిద్ధ మిదం హి మహాత్మనామ్.***

–భర్తృహరి

ఆపదలో ధైర్యం, సంపదలో తాలిమి, సభలో వాక్చాతుర్యం, యుద్ధంలో పరాక్రమం, కీర్తి సంపాదనలో ఆసక్తి, వ్యసనంగా విద్యలు నేర్చుకోవడం...ఈ గుణాలన్నీ మహాత్ములకు ప్రకృతి సహజాలు.

శ్లో॥ ***యాత్రార్థం భోజనం యేషాం, సంతానార్థం చ మైథునం, వాక్సత్యవచనార్థాయ, దుర్గాణ్యాతితరంతి తే!***

ఎవరికి భోజనం జీవయాత్ర సాగించేందుకే అనిపిస్తుందో, ఎవరికి మిథునకర్మ సంతానం కోసమే అనిపిస్తుందో, ఎవరికి మాటలాడడం సత్యం చెప్పేందుకే అనిపిస్తుందో వారు, ఈ దుర్గమమైన సంసారాన్ని అవలీలగా దాటేస్తారు.

❖ మదించిన ఏనుగు కళ్ళబడిందంటే దాని కుంభస్థలం బద్దలు కొట్టేందుకు సింహప్పిల్ల కూడా మీదికి ఉరుకుతుంది. బలశాలికి అది సహజగుణం. తేజశ్శాలికి వయసు ప్రధానం కాదంటాడు భర్తృహరి.

శ్లో॥ *వృథావృష్టి స్సముద్రేచ*
*వృథాతృప్తేచ భోజనమ్,*
*వృథా ధనపతౌ దానం*
*దరిద్రే యౌవనం వృథా.*

సముద్రంపై వర్షించడం వృథా. ఆకలి లేని వాడికి అన్నం పెట్టడం వృథా. ధనవంతునికి దానం వృథా. దరిద్రునికి యవ్వనం వృథా.

శ్లో॥ *అసంతుష్టో ద్విజో నష్టః*
*సంతుష్ట ఇవ పార్థివః,*
*సలజ్జా గణికా నష్టా*
*నిర్లజ్జేవ కులాంగనా.*

తృప్తిలేని బ్రాహ్మణుడు, తృప్తి చెందిన రాజులా చెడిపోతాడు. సిగ్గుపడే వేశ్య, సిగ్గు వదలిన కులస్త్రీలా చెడిపోతుంది. అంటే...కలిగినంతలో బ్రాహ్మణుడు తృప్తి చెందాలి. రాజు రాజ్యాన్ని పెంచుకుంటూ పోవాలిగాని, ఉన్నది చాలనుకుని తృప్తి పడకూడదు. అలాగే వేశ్య సిగ్గుపడకూడదు. సిగ్గు వదలి అందరి మెప్పూ పొందాలామె. ఇల్లాలు సిగ్గు పడాలి. మర్యాద కలిగి ఉండాలి. భర్తను తప్ప మిగిలిన వారిని సోదరులలా చూడాలామె. ఈ గుణాలు తారుమారయితే చెప్పేదేముంది? ప్రమాదం ముంచుకొచ్చినట్టే!

శ్లో॥ *గుణవన్తః క్లిశ్యన్తే ప్రాయేణ భవన్తి నిర్గుణాః సుఖినః!*
*బంధన మాయాన్తి శుకాః యథేష్ట సంచారిణః కాకాః!*

ఉత్తమగుణాలు కలిగిన వారినే లోకులు బాధిస్తారు. ఆ గుణాలు లేని వారిని ఎవరూ ఏమీ అనరు. పట్టించుకోరు. ఫలితంగా వారు సుఖంగా జీవిస్తారు. చిలుకలనే పంజరంలో బంధిస్తారు. కాకుల్ని బంధిస్తారా? బంధించరు. పైగా వాటి స్వేచ్ఛను ఎవరూ అడ్డ గించరు.

శ్లో॥ *కర్మణోహి ప్రధానత్వం, కింకుర్వన్తి శుభాశుభాః!*
*వసిష్ఠ దత్తలగ్నోపి, రామః కిం భ్రమతే వనే?*

జ్యోతిశ్శాస్త్రం కంటే కర్మే ప్రధానమైనది. పండితుల శుభాశుభనిర్ణయాలు కర్మను తప్పించలేవు. వసిష్ఠుడంతటివాడు పట్టాభిషేకానికి నిర్ణయించిన ముహూర్తంలో రాముడు ఘోరారణ్యం పాలయినాడు. ఇంతకంటే నిదర్శనం ఇంకేం కావాలి?

శ్లో॥ *దైవే, తీర్థే, ద్విజే, మంత్రే, దైవజ్ఞే, భేషజే, గురౌ!*
*యాదృశీ భావనాయత్ర సిద్ధిర్భవతి తాదృశీ!*

దైవం, తీర్థం, బ్రాహ్మణుడు, మంత్రం, జ్యోతిష్కుడు, వైద్యుడు, గురువు... వీరందరిపై మనకి ఉన్న నమ్మకాన్ని అనుసరించే వారి మహాత్మ్యం సిద్ధిస్తుంది.

❖ నూరు కల్లలాడైనా ఒక ఇల్లు నిలపాలి.

❖ దోసకాయలు తిన్న కడుపూ, దొంగలు పడ్డ ఇల్లూ ఒకటే!

❖ మీసాలు వచ్చేవేళ దేశాలు కానరావు.

–సామెతలు

శ్లో॥ *వనాని దహతో వహ్నేః సఖాభవతి మారుతః*
*స ఏవ దీపనాశాయ 'కృశే కస్యాస్తి గౌరవమ్?'*

అగ్ని బలంగా అడవుల్ని దహించే వేళ, గాలి తోడవుతుంది. అదే గాలి, అగ్ని చిన్న దీపంగా ఉన్నవేళ, దానిని ఆర్పి వేస్తుంది. అంటే పేదవాణ్ణీ, బలహీనుణ్ణీ ఎవరూ ఆదరించ రని అర్థం.

శ్లో॥ *యథా వ్యాళగళస్థోపి భేకో దంశా నపేక్షతే!*
*తథా కాలాదినాగ్రస్తో లోకో భోగా నపేక్షతే!*

పాము గొంతులో సగానికి సగం కూరుకుపోయిన కప్ప, బయట కనిపించిన కీటకం కోసం నాలుక చాస్తోంది. అలాగే కాలం కబళిస్తున్న లోకం, భోగాలను కోరుకుంటున్నది. చిత్రంగా లేదూ?

శ్లో॥ *సర్వమన్యత్ పరిత్యజ్య శరీరమనుపాలయేత్!*
*తదభావే కింభవానాం సర్వాభావః శరీరిణమ్!*

పనులన్నిటినీ పక్కనబెట్టి శరీరాన్ని ఆరోగ్యంగా, బలంగా ఉండేట్టుగా చూసుకోవాలి. శరీరం లేకపోతే ప్రపంచంతో సంబంధమే ఉండదని గ్రహించాలి.

ప॥ **పూవులో సువాసన, చిరు నూవు లోన**
**తైలమును, కట్టెలో నిప్పు, పాల లోన**
**నెయ్యి, చెఱకులో బెల్లము నెట్లు కంటి**
**వట్లె దేహమందాత్మను అందుకొనుము.**

పూవులో సువాసన, నువ్వుగింజలో నూనె, కర్రలో అగ్ని, పాలలో నెయ్యి, చెఱకులో బెల్లం దాగి ఉన్నాయని ఎలా తెలుసుకున్నావో అలాగే దేహంలో ఆత్మరూపంలో ఉన్న పర మాత్మను కూడా తెలుసుకో!

❖ స్నేహితుల్ని కలుసుకోవడం, అపారంగా డబ్బు కలసి రావడం, కొడుకుని పొదువుకోవడం, సంభోగం, కులాసాగా మాట్లాడుకోవడం, తనవారిలో, తన కులంవారిలో ఘనుడై ఉండడం, అనుకున్నది లభించడం, సభల్లో సత్కారం జర గడం... ఈ ఎనిమిదీ సంతోషానికి కారణాలు. సుఖంగా కూడా అనిపిస్తాయి. ప్రజ్ఞ కలిగి ఉండడం, మంచికుటుం బంలో పుట్టడం, దమం, చదువు సంధ్యలు, పరాక్రమం, మితంగా మాట్లాడడం, దానం చెయ్యడం, కృతజ్ఞత కనబ రచడం... ఈ ఎనిమిది గుణాలూ మనిషికి మంచి గౌరవాన్ని కలిగిస్తాయి.

–విదురుడు



**అయలసోమయాజుల**
**నీలకంఠేశ్వర (ఎ.ఎన్)**
**జగన్నాథశర్మ**

13-4-1956లో జన్మించారు. ప్రవృత్తిరీత్యా రచయిత, వృత్తిరీత్యా పత్రికా రచయిత అయిన ఈయన సుమారుగా అయిదు వందల కథలూ, అయిదు నవలలూ, అనేక వ్యాసాలూ రాశారు. సినిమా, టీవి రచయితగా కూడా ప్రసిద్ధులు.

**ప్రముఖుల మంచిమాటలను లక్షలాదిగా సేకరించారు.**

ప్రస్తుతం ఆంధ్రజ్యోతి ప్రచురణ 'నవ్యవీక్లి'కి సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు.